www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 239

జగన్ కేసుల్లో పెండింగ్.. పెండింగ్


విచారణ దశలో 125 పిటిషన్లు



80 శాతం వ్యాజ్యాలు పెండింగ్.. సుప్రీంలో 15 స్పెషల్ లీవ్ పిటిషన్లు
వాటిలో 12 వ్యాజ్యాలు ఇప్పటికీ విచారణ దశలోనే
ట్రయల్ కోర్టులో 86 డిశ్చార్జి పిటిషన్లు.. ఒక్క దానిపైనా తుదితీర్పు రాలేదు
సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదన.. తదుపరి విచారణ జనవరి 10కి వాయిదా

2

శనివారం | 14-12-2024
పేజీలు: 14
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి సా. 4.59 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: రోహిణి తె. 3.54 తదుపరి మృగశిర; వర్జ్యం: రా. 8.32-10.00; దుర్ముహూర్తం: ఉ. 6.40-8.08; అమృతఘడియలు: రా. 12.57-2.25; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 5.39
విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలు

- ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం.. సంపద.. సంతోషం..
- ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన
- నదుల అనుసంధానంతో ఏపీకి నీటి భద్రత
- పేదరికం సంపూర్ణ నిర్మూలన
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- 3 వేల డాలర్లు (రూ.2.54 లక్షలు) ఉన్న తలసరి ఆదాయాన్ని 2047 నాటికి 42 వేల డాలర్లకు (రూ.35.62 లక్షలు) చేర్చడం

స్వర్ణాంధ్ర @2047



స్వర్ణాంధ్ర విజన్ 2047ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్, సీఎస్ నీరబ్‌కుమార్

ఆంధ్రాను నం.1గా నిలుపుతాం

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం

ఏపీ దిశ, దశ మార్చే విజన్ ఆవిష్కరించాం: సీఎం


- 2047నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు
- జీరో పావర్టీ, నదుల అనుసంధానం.. నాలెడ్జ్ సొసైటీ, అభివృద్ధి వికేంద్రీకరణ సాధనకు సంకల్పం
- భవిష్యత్తులో డేటా గొప్ప సంపద
- సిలికాన్ వ్యాలీ బాటలోనే.. ఆంధ్రా వ్యాలీ
- రాబోయే కాలంలో సక్సెస్ స్టోరీ వినిపిస్తాం
- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దశ, దిశను మార్చే స్వర్ణాంధ్ర - 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆరోగ్యం.. సంపద.. సంతోషాలే లక్ష్యంగా రూపుదిద్దుకున్న విజన్ పత్రాన్ని శుక్రవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రపంచంలోనే తెలుగుజాతిని నంబర్ 1గా, దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలిపే కృషికి ఈ రోజు బీజం పడిందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల తలరాతను, భావితరాల భవిష్యత్తును విజన్ డాక్యుమెంట్ మార్చి తీరుతుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. "పది సూత్రాలతో

మిగతా 13వ పేజీలో...

సాధారణంగా అభివృద్ధిని అంకెల్లో కొలుస్తారు. సాధించిన ప్రగతిని సగటుల్లో చూస్తారు. కానీ, అభివృద్ధిని ఆరోగ్యం.. సంతోషం.. సంపదతో బేరీజు వేస్తూ స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌ను కూటమి ప్రభుత్వం ఆవిష్కరించింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ఏకంగా రాబోయే 23 ఏళ్ల 'విజన్'ను రాష్ట్రానికి అందించింది.

బాబు విజన్ అద్భుతం



- దేవుడు వందేళ్ల ఆయుష్షు ఇవ్వాలి.. నా సంపూర్ణ సహకారం ఉంటుంది
- రూల్ ఆఫ్ లా బలంగా ఉంటేనే అభివృద్ధి.. అన్ని రంగాల్లో వృద్ధి చెందాలి
- అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం.. యువతకు ఉపాధి అవకాశాలు
- సమష్టిగా పనిచేద్దాం.. అధికారులు తమ బలం తెలుసుకోవాలి
- సక్రమంగా బాధ్యతలు నిర్వహించాలి.. డిప్యూటీ సీఎం పవన్

13

సాగు.. కొత్త పుంతలు!

రైతన్నకు సుస్థిర ఆదాయమే లక్ష్యం

2047 నాటికి 100% అక్షరాస్యత

నిరుద్యోగ రేటు 2% కంటే తగ్గాలి

13

టెక్నాలజీ
ట్రాన్స్‌పోర్టబులిటీ
ట్రేడబులిటీ

'3టీ'తో ఐటీ

2

భావి తరం సాంకేతిక సేవల హబ్‌ల ఏర్పాటు

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు



అలహాబాద్ హైకోర్టు జడ్జిని తొలగించాలి

- 55 మంది పార్లమెంటు సభ్యుల సంతకాలు
- రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు అందజేత
- మైనార్టీలపై విద్వేష ప్రసంగం చేశారని ఆరోపణ
- రాజ్యాంగ విలువలను ఉల్లంఘించినట్టు ఫిర్యాదు
- వీహెచ్‌పీ సభలో చేసిన ఉపన్యాసంపై అభ్యంతరం

2

మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్‌కు నో

12

బడి మారుతోంది!

ఇకపై 5 రకాలుగా పాఠశాలలు

- ప్రాథమికోన్నత పాఠశాలలకు సెలవు
- బేసిక్ ప్రైమరీలో ప్రీప్రైమరీ-1, 2తో పాటు 1 నుంచి 5 వరకూ క్లాసులు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లు
- కొత్తగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు
- ప్రతి తరగతికి తప్పనిసరిగా ఒక టీచర్
- హైస్కూల్ ప్లస్ స్కూళ్లకు ప్రత్యామ్నాయాల కోసం అన్వేషణ
- ప్రాథమిక పాఠశాలలకు అంగన్‌వాడీల అనుసంధానం
- పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు రకాల బడులు ఉండగా వాటి స్థానంలో ఐదు రకాలు తీసుకొచ్చేలా పాఠశాల

మిగతా 3వ పేజీలో...

జైల్లో పుష్ప

బెయిల్ వచ్చినా అల్లు అర్జున్ విడుదల వాయిదా!

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అరెస్టు
- 14 రోజులు రిమాండ్ విధించిన న్యాయస్థానం
- చంచల్‌గూడ జైలుకు.. హైకోర్టుకెళ్లిన నటుడు
- నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిల్
- సకాలంలో జైలుకు చేరని బెయిల్ ఉత్తర్వులు
- రాత్రి 11 గంటల తర్వాత పత్రాల అప్‌లోడ్
- నేటి ఉదయం విడుదల చేస్తామన్న అధికారులు
- అల్లు అర్జున్ అరెస్టుతో దేశవ్యాప్తంగా సంచలనం

12

మహిళ మృతికి కారణం అల్లు అర్జునే: రిమాండ్ రిపోర్టు

ఆయన తప్పు లేదు.. కేసు వెనక్కి తీసుకుంటా: మృతురాలి భర్త



అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి తీసుకెళుతున్న పోలీసులు

జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన నోటీసు




రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు అందజేసిన 55 మంది ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 13: విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని విపక్షాలు నిర్ణయించాయి. ఈ మేరకు 55 మంది ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును శుక్రవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీకి సమర్పించాయి. సంతకాలు చేసిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు వివేక్ టంఖా, దిగ్విజయ్ సింగ్, కె.టి.ఎస్ తుల్సి, డీఎంకే సభ్యుడు పి.విల్సన్, సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తదితరులు ఉన్నారు. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఈ నెల 8న అలహాబాద్ హైకోర్టు ఆవరణలో ఉమ్మడి పౌర స్మృతిపై నిర్వహించిన సదస్సులో జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పక్షపాతపూరిత, విద్వేషపూరిత ప్రసంగం చేశారని ఎంపీలు నోటీసులో పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో పాటించాల్సిన నైతిక విలువలపై సుప్రీంకోర్టు 1997 మే 7న 'న్యాయ జీవితంలో విలువల పునరుద్ఘాటన' పేరుతో ప్రవర్తన నియమావళి జారీ చేసిందని, ప్రస్తుతం జస్టిస్ యాదవ్ చేసిన ప్రసంగం అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యా జడ్జీల విచారణ చట్టం-1968 ప్రకారం తమ నోటీసును రాష్ట్రపతికి పంపించి సభలో ప్రవేశపెట్టేలా ఆమోదం తీసుకోవాలని కోరారు.

తొలగించే ప్రక్రియ ఇదీ...

పదవిలో కొనసాగేందుకు న్యాయమూర్తి అసమర్థుడని భావిస్తే తొలగించేందుకు రాజ్యాంగంలోని 124(4) అధికరణం, జడ్జీల విచారణ చట్టం-1968లో విధానాన్ని పొందుపరిచారు. తొలగించేందుకు రాజ్యసభలోగానీ, లోక్‌సభలోగానీ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి. దీనిపై లోక్‌సభలో అయితే 100 మంది, రాజ్యసభలో అయితే 50 మంది సంతకాలు చేయాల్సి ఉంటుంది. సభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి సభాపతి అనుమతి ఇస్తే.. జడ్జీల విచారణ చట్టం ప్రకారం దర్యాప్తునకు కమిటీ ఏర్పాటవుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఏర్పాటవుతుంది. ఆ కమిటీ విచారణ జరిపి సభాపతికి నివేదిక సమర్పిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే పార్లమెంటు ఉభయ సభల్లో దీనిపై చర్చ జరుగుతుంది. సంబంధిత జడ్జి కూడా పార్లమెంటుకు వచ్చి తన వాదన వినిపించుకోవచ్చు. తరువాత తీర్మానంపై ఉభయసభల్లో ఓటింగ్ జరుగుతుంది. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మెజార్టీగానీ, మొత్తం సభ్యుల సంఖ్యలో మెజార్టీగానీ లభిస్తేనే తీర్మానం ఆమోదం పొందినట్టవుతుంది. అనంతరం జడ్జిని తొలగించాలని సిఫారసు చేస్తూ రాష్ట్రపతికి నివేదిక పంపిస్తారు.

లోకం తీరు



జగన్ కేసుల్లో పెండింగ్.. పెండింగ్
విచారణ దశలో 125 పిటిషన్లు

- 80 శాతం వ్యాజ్యాలు పెండింగ్
- సుప్రీంలో 15 స్పెషల్ లీవ్ పిటిషన్లు.. వాటిలో 12 పెండింగ్
- ట్రయల్ కోర్టులో 86 డిశ్చార్జి పిటిషన్లు
- ఒక్కదానిపైనా తుదితీర్పు రాలేదు.. సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదన

న్యూఢిల్లీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి 125 పిటిషన్లు విచారణ దశలో ఉన్నాయని సుప్రీంకోర్టుకు సీబీఐ నివేదించింది. ఇప్పటి వరకు 860 మంది సాక్షులను కోర్టు విచారించిందని వెల్లడించింది. సుప్రీంకోర్టులో మొత్తం 15 స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు కాగా.. అందులో 12 పిటిషన్లు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొంది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ ఆలస్యమవుతోందని, ట్రయల్ వేగవంతంగా పూర్తి చేయాలని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గతంలో పిటిషన్ దాఖలు చేశారు. కేసులను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. అదేవిధంగా జగన్ బెయిల్ రద్దు చేయాలని.. లేకపోతే విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టులో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. వాస్తవానికి జగన్ కేసుల్లో జాప్యానికి కారణాలు.. అన్ని కోర్టుల్లో పెండింగ్ కేసుల వివరాలు, విచారణ ఏ దశలో ఉందన్న సమగ్ర సమాచారంతో నివేదిక సమర్పించాలని గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశించింది. గురువారం సాయంత్రం ఆ నివేదికను సుప్రీంకోర్టుకు అందజేశామని సీబీఐ తరఫు న్యాయవాది శుక్రవారం ధర్మాసనానికి వివరించారు. జగన్ కేసుల విచారణలో జాప్యంపై సీబీఐ, ఈడీ అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చాయన్నారు. స్టేటస్ రిపోర్టు పరిశీలనకు మరింత సమయం కావాలని జగన్ తరఫు న్యాయవాదులు కోరారు. అయితే.. సీబీఐ, ఈడీ ఇచ్చిన నివేదికలు పరిశీలించాక తీర్పు వెల్లడిస్తామని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేసింది.

80 శాతం పిటిషన్లపై విచారణ పెండింగ్...

జగన్ అక్రమాస్తులకు సంబంధించి 80 శాతం పిటిషన్లపై విచారణ పెండింగ్‌లోనే ఉందని దర్యాప్తు సంస్థలు తమ నివేదికలో తెలిపాయి. 'మొత్తం 120 మంది నిందితులపై చార్జిషీట్లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు 860 మంది సాక్షులను కోర్టు విచారించింది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో మొత్తం 125 పిటిషన్ల విచారణ పెండింగ్‌లో ఉంది. ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు దాఖలైన పిటిషన్లలో దాదాపు 80 శాతం పెండింగ్ ఉన్నాయి. ట్రయల్ కోర్టులో 11 కేసుల్లో 86 డిశ్చార్జి పిటిషన్లు దాఖలయ్యాయి. అవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏ ఒక్క డిశ్చార్జి పిటిషన్‌లోనూ తుది తీర్పు వెలువడలేదు. తెలంగాణ హైకోర్టులో నిందితులు 40 పిటిషన్లు దాఖలు చేయగా.. ఇంకా 27 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి' అని నివేదికలో వెల్లడించాయి.

మహాకుంభమేళాలో
తెలుగులో ఏఐ చాట్‌బాట్ సేవలు
ప్రయాగ్‌రాజ్‌లో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన మోదీ

ప్రయాగ్‌రాజ్, డిసెంబరు13: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగే మహాకుంభమేళాతో దేశం సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ప్రధాని మోదీ చెప్పారు. కులాలు, తెగల ఊసే లేకుండా ఐక్యతను చాటే మహాకుంభమేళా మహాయజ్ఞాన్ని తలపించనుందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రధాని రూ.5,500 కోట్ల విలువైన 167 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రధాని ప్రసంగించారు. మహాకుంభమేళాలో తొలిసారి భక్తులు, యాత్రికుల కోసం బహుభాషా ఏఐ చాట్‌బాట్ సేవలను ఉపయోగించుకోబోతున్నామని మోదీ చెప్పారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌తో పాటు అనేక భాషల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా మహాకుంభమేళా విశేషాలతో పాటు చరిత్ర, పూజలు, ప్రయాణ, విడిది సౌకర్యాల వివరాలు యాత్రికులకు ఉచితంగా అందిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రధాని గంగ, యమున, సరస్వతి నదుల సంగమ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇస్తాంబుల్ విమానాశ్రయంలో 2రోజులుగా
ఇండిగో ప్రయాణికుల ఇక్కట్లు

- భోజనం, సరైన వసతి లేక 400 మంది అగచాట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 13: తుర్కియేలోని ఇస్తాంబుల్ విమానాశ్రయంలో 400 మంది ఇండిగో ప్రయాణికులు చిక్కుకుపోయారు. వీరంతా ఢిల్లీ, ముంబైలకు రెండు విమానాల్లో రావాల్సి ఉంది. ఏ సమాచారం ఇవ్వకుండా ఆ విమానాలు రద్దు చేయడంతో దాదాపు రెండు రోజుల పాటు అక్కడే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తింది. బుధవారం రాత్రి ఇస్తాంబుల్ నుంచి వారు ముంబై, ఢిల్లీకి విమానాల్లో బయలుదేరాల్సి ఉండగా.. శుక్రవారం ఉదయం నాటికి కూడా విమానాలు ఏ సమయానికి బయలుదేరేది స్పష్టత ఇవ్వలేదు. దీంతో ప్రయాణికులు విమానాశ్రయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారికి భోజనం, ఎలాంటి వసతి కల్పించకపోవడంతో సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు క్షమాపణలు చెప్పడంతో పాటు పరిహారం ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. చివరకు ఇండిగో దీనిపై స్పందిస్తూ.. ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది.

రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదు!

ఇది ప్రధాని మోదీకి ఇంకా అర్థం కానట్లుంది.. స్వేచ్ఛ, న్యాయానికి రాజ్యాంగమే రక్షా కవచం

- దాన్ని బద్దలు కొట్టడానికి బీజేపీ చేయని ప్రయత్నం లేదు
- రాజ్యాంగంపై చర్చలో ప్రియాంక
- రాజ్యాంగాన్ని హైజాక్ చేయడానికి కాంగ్రెస్ యత్నం: రాజ్‌నాథ్‌సింగ్



న్యూఢిల్లీ, డిసెంబరు 13: భారత రాజ్యాంగం అంటే 'సంఘ్' రూపొందించిన నియమాలు, విధానాల పుస్తకం కాదన్న విషయం ప్రధాని మోదీకి ఇంకా అర్థం కానట్లు ఉందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకపక్షంగా అధికారంలోకి వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చే ప్రక్రియను ప్రారంభించేదన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని లోక్‌సభలో రెండు రోజుల ప్రత్యేక చర్చ శుక్రవారం మొదలైంది. ఈ చర్చను కేంద్ర ప్రభుత్వం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. విపక్షాల తరఫున తొలుత ప్రియాంక గాంధీ ప్రసంగించారు. లోక్‌సభలో ప్రియాంక మొట్టమొదటి ప్రసంగం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమె బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. న్యాయానికి, ఐక్యతకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగమే రక్షా కవచమని పేర్కొన్నారు. ఈ రక్షా కవచాన్ని బద్దలు కొట్టడానికి పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. బ్రిటిష్ వాళ్లు దేశ ప్రజలను ఎలా భయపెట్టాలని చూశారో.. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వ అలాగే చేస్తోందని చెప్పారు. ఇలాంటి పిరికివాళ్ల చేతుల్లో దేశం ఎంతో కాలం ఉండదని, ప్రజలు న్యాయం కోసం తిరగబడతారని హెచ్చరించారు. ఒక్కరికి మేలు చేయడం కోసం కేంద్రంలోని బీజేపీ సర్కారు 142కోట్ల మంది భారతీయులను విస్మరిస్తోందని ప్రియాంక అదానీని ఉద్దేశించి అన్నారు. ప్రియాంక మొత్తం 32 నిమిషాల పాటు ప్రసంగించారు. బీజేపీ పదే పదే నెహ్రూను విమర్శించడంపైనా ప్రియాంక స్పందించారు. "ఎప్పుడూ గతం గురించి మాట్లాడుతూ, నెహ్రూను విమర్శించే వీరంతా ఇప్పుడేం చేస్తున్నారో చెప్పగలరా.. లేకపోతే ఇప్పుడు కూడా దేశాభివృద్ధి బాధ్యతను ఈ పాలకులు నెహ్రూకే వదిలేశారా" అని ఎద్దేవా చేశారు. ప్రియాంక ప్రసంగంపై ఆమె సోదరుడు రాహుల్ గాంధీ ప్రశంసల వర్షం కురిపించారు. లోక్‌సభలో తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక ప్రసంగమే బాగుందన్నారు. మరోవైపు, రాజ్యాంగంపై చర్చ సమయంలో ప్రధాని మోదీ సభలో లేకపోవడంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీలను ముఖ్యంగా ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వారు నేర్చుకున్నది అదే

అంతకుముందు రాజ్యాంగంపై చర్చను ప్రారంభించిన రాజ్‌నాథ్‌సింగ్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నించిందన్నారు. రాజ్యాంగం కంటే తమ అధికారమే గొప్పదని కాంగ్రెస్ భావిస్తుందని మండిపడ్డారు. ఆ పార్టీ దురుద్దేశపూర్వకంగా ఎన్నో సార్లు రాజ్యాంగానికి సవరణలు చేసిందన్నారు. ఎమర్జెన్సీని ప్రస్తావించారు. "ఇటీవల విపక్ష నేతలు జేబులో రాజ్యాంగం పుస్తకాన్ని పెట్టుకొని తిరుగుతున్నారు. వారు చిన్నప్పటి నుంచి నేర్చుకున్నది అదే. తరతరాలుగా వారు రాజ్యాంగాన్ని తమ జేబులోని పుస్తకం అనుకుంటున్నారు" అని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్యాంగ నిర్మాణానికి కృషి చేసిన కొంత మందిని కావాలనే విస్మరించారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగంపై చర్చ శనివారం కూడా జరగనుంది. కాగా, భారత పార్లమెంట్‌పై 2001 డిసెంబరు 13న ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నేతలు శుక్రవారం నివాళులర్పించారు.

మిమ్మల్ని ఎలా గౌరవించాలి?

- నన్ను, మా పార్టీని అవమానిస్తున్నారు
- రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 13: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో సభలో శుక్రవారం తీవ్ర గందరగోళం నెలకొంది. చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. 'నేను రైతు బిడ్డను. ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనంగా ఉండను, ఇప్పటికే నేను చాలా వరకు సహించాను' అని ధన్‌ఖడ్ పేర్కొనగా.. 'మీరు రైతు బిడ్డ అయితే.. నేను కూడా ఒక కూలీ కుమారుడిని!' అని ఖర్గే పేర్కొన్నారు. 'మీరు మా కాంగ్రెస్‌ను, మా పార్టీ నేతలను అవమానిస్తున్నారు. మీ గొప్పలు వినేందుకు మేం ఇక్కడకు రాలేదు' అని అన్నారు. చైర్మన్ అధికార పార్టీ ఎంపీలకే అధిక సమయం ఇస్తూ, బీజేపీ దౌర్జన్యాలను ప్రోత్సహిస్తున్నారని, విపక్ష సభ్యులను మాట్లాడనివ్వకుండా పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు. ఈ సమయంలో వాడీవేడి చర్చ మరింత తీవ్రంగా మారింది. ఒకానొక సమయంలో 'నన్ను అవమానిస్తున్న మిమ్మల్ని.. నేను ఎలా గౌరవించగలను?' అని ఖర్గే రాజ్యసభ చైర్మన్‌ను అడిగారు.

ఆఘాడీకి బీటలు!

- బృహన్ ముంబై కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంటరి పోటీకే ఉద్ధవ్ పార్టీ మొగ్గు



ముంబై, డిసెంబరు 13: మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాల ప్రకంపనలు ప్రతిపక్ష కూటమి మహా వికాస్ ఆఘాడీని కుదిపేస్తూనే ఉన్నాయి. ఆఘాడీ నుంచి వేరయిపోయి, ఒంటరిగా మహారాష్ట్రలో ఎదగాలని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) యోచిస్తున్నట్టు సమాచారం. స్వతంత్ర దారిని ఎన్నుకునేందుకు ఇదే సరైన సమయమని అసెంబ్లీలో ఆ పార్టీ పక్ష నేత అంబదాస్ ధాన్వే వ్యాఖ్యానించగా, తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ రౌత్ కూడా అదే అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న బృహన్ ముంబై కార్పొరేషన్, ఇతర నగరాల్లో జరిగే స్థానిక ఎన్నికలను ఒంటరిగా ఎదుర్కొంటామన్న సంకేతాలను ఆయన అందించారు. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలనుకుంటే నిరభ్యంతరంగా ఆ పని చేయొచ్చునని ఆఘాడీలోని తక్కిన పార్టీలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. అయితే, సంజయ్ రౌత్ ఒత్తిడిలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఏవిధంగా పోటీకి దిగాలనేది ఆయన పార్టీ ఇష్టమని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. తాము మాత్రం కలిసి పోటీచేయాలని కోరుకుంటున్నామని ఆ పార్టీ నేత విజయ్ వాడెట్టివర్‌అన్నారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి నేపథ్యంలో తనను బాధ్యతల నుంచి తప్పించాలని ఆ పార్టీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడు నానా పటోలే అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు ఒక లేఖను మెయిల్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో 101 సీట్లలో పోటీచేసి కేవలం 16 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది.



మల్కాపూర్ పెద్ద చెరువులో ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్

నేలపైనే కాదు.. నీటిపైనా గర్జిస్తాయ్

- ఎద్దుమైలారం ఓడీఎఫ్‌లో ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ తయారీ
- మల్కాపూర్ పెద్ద చెరువులో ట్రయల్‌రన్ సక్సెస్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ యుద్ధ వాహనాలు నేలపైనే కాదు నీటిపైనా దూసుకెళ్తూ శత్రువులపై గుళ్ల వర్షం కురిపిస్తాయి. మన దేశ సైన్యం అమ్ములపొదిని మరింత శక్తిమంతం చేయనున్న ఈ అధునాతన ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్‌ను సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్)లో రూపొందించారు. శుక్రవారం వీటి ట్రయల్‌రన్‌ను కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పెద్దచెరువులో విజయవంతంగా నిర్వహించారు. ఓడీఎఫ్ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్ ప్రసాద్ పూజలు చేసిన అనంతరం ట్రయల్‌రన్ ప్రారంభించారు. పెద్దచెరువులో రెండు యుద్ధ వాహనాలు 20 సార్లు చక్కర్లు కొట్టాయి. దీనిని వీక్షించేందుకు మల్కాపూర్ గ్రామస్థులు తరలివచ్చి ఉత్సాహంగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ ట్రయల్‌రన్ విజయవంతమైందన్నారు. ఓడీఎఫ్ పరిశ్రమను 1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రారంభించారని, 1987 నుంచి యుద్ధ వాహనాలను తయారు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ ఏడు రకాల యుద్ధ వాహనాలను రూపొందించామని, వాటిలో.. బీఎంపీ2, ఏఏటీ, సీఎంటీ, ఏఈఆర్వీ, ఎన్‌బీసీఆర్వీ, సీసీపీటీ, ఎన్ఏఎంఐసీఏ వంటివి ఉన్నాయన్నారు. యుద్ధవాహనాలతోపాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను కూడా తయారు చేస్తున్నట్టు వెల్లడించారు. తాజాగా రూపొందించిన ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వెహికిల్స్ ఒక్కొక్కటి 14 టన్నుల బరువు ఉంటాయని, గంటకు 65 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయని తెలిపారు. నైట్ విజన్ టెక్నాలజీ, ఆర్మమెంట్ గన్‌తో పాటు మిసైల్ లాంచర్ సదుపాయం కూడా వీటిలో ఉందన్నారు. భారత సైన్యానికి ఇప్పటి వరకు మూడు వేల యుద్ధ వాహనాలను అందజేశామని శివశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓడీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఇంత తక్కువ వేతనమా?

- పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆక్షేపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 13: జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు తక్కువ వేతనాలివ్వడంపై పార్లమెంటరీ స్థాయీసంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వేతనాలను వినియోగదారుల సూచీకి అనుసంధానించకపోవడాన్ని ఆక్షేపించింది. పనిదినాలను ఇప్పుడున్న వంద రోజుల నుంచి 150కి పెంచాలని సిఫారసు చేసింది. గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్ శాఖపై కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాకా సారథ్యంలో ఏర్పాటైన ఈ కమిటీ గురువారం తన నివేదికను లోక్‌సభకు సమర్పించింది. 'ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జీవన వ్యయం బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఉపాధి కూలి రూ.200 మాత్రమే ఉండడంలో అర్థం లేదు. అందుచేత గ్రామీణాభివృద్ధి శాఖ తన వైఖరిని మార్చుకుని ఉపాధి వేతనాల పెంపునకు సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి' అని స్థాయీ సంఘం సిఫారసు చేసింది.

కెనడాలో ముగ్గురు విద్యార్థుల హత్యపై
భారత్ ఆందోళన

న్యూఢిల్లీ, డిసెంబరు 13: కెనడాలో ముగ్గురు భారతీయ విద్యార్థుల హత్యపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తమ ఆవేదనను కెనడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని శుక్రవారం విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం, వాంకోవర్, టొరంటోల్లోని కాన్సులేట్ కార్యాలయాలు సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. సమగ్రమైన దర్యాప్తు జరిగేలా స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపారు. కెనడాలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని భారతీయ విద్యార్థులకు సూచించారు. కెనడాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు వీసా మంజూరులో భారత రాయబార కార్యాలయం ఆలస్యం చేస్తోందన్న వార్తలపై ఆయన స్పందించారు. ఇది కెనడా మీడియా చేస్తున్న దుష్ప్రచారమన్నారు.

ఎర్రకోటను మాకు తిరిగి ఇవ్వండి

న్యూఢిల్లీ, డిసెంబరు 13: ఎర్రకోటను తిరిగి తనకు అప్పగించాలని కోరుతూ మొఘల్ చక్రవర్తి వారసురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఈ పిటిషన్ దాఖలు చేశారు. చక్రవర్తికి చట్టబద్ధ వారసురాలిని తానేనని, అందువల్ల ఎర్రకోటపై తనకు హక్కు ఉందని తెలిపారు. తొలుత ఇదే విషయమై దావా వేయగా పరిశీలించిన ఏకసభ్య ధర్మాసనం దాన్ని తిరస్కరిస్తూ 2021 డిసెంబరులో ఆదేశాలు ఇచ్చింది. సంఘటన జరిగి ఎన్నో దశాబ్దాల అనంతరం కేసు పెట్టినందున విచారణకు స్వీకరించలేమని తెలిపింది. దీనిపై అప్పీలు చేయగా ద్విసభ్య ధర్మాసనం..ఏకసభ్య ధర్మాసనం తీర్పుపై అప్పీలుకు రెండున్నరేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది.

వరకట్నం, గృహహింస చట్టాలను సమీక్షించండి

- సుప్రీంకోర్టులో వ్యాజ్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 13: వరకట్నం, గృహహింస చట్టాలను సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలయింది. భార్య వేధింపుల కారణంగా బెంగళూరుకు చెందిన అతుల్ సుభాష్ అనే టెకీ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో విశాల్ తివారీ అనే న్యాయవాది వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ చట్టాలను సమీక్షించి, సంస్కరించాలని కోరారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయకోవిదులతో నిపుణుల కమిటీ వేయాలని సూచించారు. అత్తింటివారు గృహ హింసకు పాల్పడుతున్నారంటూ కొందరు మహిళలు తప్పుడు ఆరోపణలు చేసి ఐపీసీలోని సెక్షన్ 498ఏను దుర్వినియోగం చేస్తున్నారని 2010లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోవాలని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

'3టీ'తో ఐటీ!




- టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టబులిటీ, ట్రేడబులిటీతో విశ్వవ్యాప్తంగా వృద్ధి చెందుతోంది
- రాష్ట్రంలో భావి తరం సాంకేతిక సేవల హబ్‌లు స్థాపించాలి

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 3 టీతో సమాచార సాంకేతిక రంగం (ఐటీ) పురోభివృద్ధి సాధిస్తుందని స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ పేర్కొంది. టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టబులిటీ, ట్రేడబులిటీ అనే మూడు 'టీ'లతో విశ్వవ్యాప్తంగా ఐటీ రంగం వృద్ధి చెందుతూ వస్తోందని.. గ్లోబల్ దిగ్గజ కంపెనీలు సర్వీసు రంగంలోనూ దీనిని అనుసరిస్తున్నాయని తెలిపింది. సాంకేతిక ఆధార సేవల్లో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో ముందు వరుసలో నిలబెట్టేలా కార్యచరణ అమలు చేయాలని పేర్కొంది. రాష్ట్ర యువత ఐటీ అత్యున్నత సాంకేతిక నైపుణ్యాల్లో నిష్ణాతులవుతున్నారని.. అమెరికాలోని ఐటీ ఉద్యోగుల్లో 25 శాతం మంది తెలుగువారేనని, వీరిలో 45 శాతం మంది మహిళలేనని వెల్లడించింది. ఇన్నోవేషన్ ఇండియాలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో స్థానంలో ఉన్నట్లు తెలిపింది. 'రాష్ట్రంలో సర్వీసు రంగం అత్యంత కీలక భూమిక పోషిస్తోంది. ఐటీ ఎగుమతుల్లో టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టబులిటీ, ట్రేడబులిటీ-'3టీ' ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఐఐటీ-తిరుపతి, ఐఐఎస్‌ఈఈఆర్, మంగళగిరి ఎయిమ్స్, ఐఐఎం విశాఖపట్నం వంటి సంస్థలు దీనిని ప్రధానంగా వినియోగిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణలోనూ ఐటీ రంగం విస్తృత సేవలు అందిస్తోందని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) కూడా వెల్లడించింది. 'థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ' విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో భవిష్యత్ తరం సాంకేతిక సేవల హబ్‌లను స్థాపించాలి. ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. అసెట్ లైట్ మోడల్‌గా రాష్ట్రాన్ని నిలపాలి. ల్యాండ్ బ్యాంకులను గుర్తించి టెక్నాలజీ హబ్‌ల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలి. ఐటీ సేవల విస్తృతిలో విశాఖ కీలక భూమిక పోషిస్తోంది. ఫిన్‌టెక్, మెడ్‌టెక్, సైబర్‌సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్, ఏఆర్/వీఆర్, బయో ఫార్మాలో ఈ నగరం ప్రధాన కేంద్రంగా ఉంది. కృత్రిమ మేధ(ఏఐ), అగ్రిటెక్, గ్రీన్‌టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుంది. అదేవిధంగా ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డ్రోన్స్, నానో టెక్, ఐవోటీ, 3డీ ప్రింటింగ్‌కు తిరుపతి.. రెన్యువబుల్స్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, అటానమస్ వెహికల్స్, బిల్డింగ్ మెటీరియల్స్‌కు అనంతపురం-కర్నూలు కేంద్రంగా ఉంటాయి. రాష్ట్రంలో టెక్నాలజీ క్లస్టర్‌ను, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫ్లెక్సిబుల్ వర్కింగ్ మోడల్స్‌ను.. టాలెంట్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ విధానాలను అమలు చేయాలి. గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్, క్వాలిటీ హామీ ఇచ్చేలా ఐటీ సేవలు ఉండాలి. డిజిటల్ గవర్నెన్స్ సాగేలా ఏఐని వినియోగించుకోవాలి. సత్వర ఆర్థికాభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్నాలజీని వినియోగించాలి' అని విజన్ డాక్యుమెంట్ పేర్కొంది.

ప్రతి ఇల్లూ విద్యుత్తు ప్లాంటే!

- 29 లక్షల గృహాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- 'స్వర్ణాంధ్ర విజన్' డాక్యుమెంట్‌లో లక్ష్య నిర్దేశం



అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇంటినీ సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా మార్చాలని స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047 పేర్కొంది. జర్మనీ తరహాలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుని.. 29 లక్షల గృహాల నుంచి ఉత్పత్తయ్యే సోలార్ విద్యుత్తును స్థానిక గ్రిడ్‌కు అనుసంధానించి, కరెంటు సరఫరా చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం ఎక్కడికక్కడ స్మార్ట్ గ్రిడ్‌లు ఏర్పాటు చేస్తారు. వీటితో విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ పటిష్ఠమవడంతో పాటు డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుంది. 2029 నాటికి 10లక్షల ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్లు అమర్చే లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తయ్యే



సోలార్ విద్యుత్తును గృహావసరాలకు సరిపోను.. మిగిలిన కరెంటును గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. పగటిపూట ఉత్పత్తయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు పంపి.. రాత్రి సమయంలో వాడుకునే వెసులుబాటునూ కల్పిస్తారు. దీనివల్ల స్థానిక ఫీడర్‌పై విద్యుత్తు డిమాండ్ హెచ్చుతగ్గుల వల్ల కలిగే ఒత్తిడిని నివారించగలుగుతారు. స్థానిక ఫీడర్ ద్వారా ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌తో కలుపుతారు. పథకం పరిధిలోకి రాని వినియోగదారుల కోసం హైబ్రిడ్ ఎనర్జీ (సోలార్-విండ్-పంప్డ్ హైడల్ విద్యుత్తు)ని అందిస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 18 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ ప్యానల్‌లను అమర్చడం వల్ల.. రైతులకు ఉచిత విద్యుత్తు అందడంతో సహా.. ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.



పట్టాలపై నిప్పుల బండి

రైలు పట్టాలపై నిప్పులు చిమ్ముతూ, పొగలు రేపుతూ సాగుతున్న ఈ బండిని చూశారా..! ఇది ఆటోమేటిక్‌గా ట్రాక్ వెల్డింగ్, చిప్పింగ్, గ్రైండింగ్ పనులు చేసే 'ఫ్లాష్ బట్ వెల్డింగ్ మెషీన్'. గుణదల రైల్వే స్టేషన్ సమీపంలో పనులు చేస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. ఈ యంత్రంతో ట్రాక్‌ను సరిచేయడం వల్ల రైలు ప్రయాణం కుదుపులు లేకుండా సాగుతుంది. అలాగే శబ్దం స్థాయి కూడా తగ్గుతుంది. రైల్వే లైన్ల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించే భారతీయ రైల్వే ట్రాక్‌ల నిర్వహణకు ఇలాంటి పలు ఆటోమేటిక్ యంత్రాలను వాడుతోంది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

జస్టిస్ అంబటి లక్ష్మణరావుకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావుకు హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ఇటీవల కన్నుమూసిన జస్టిస్ లక్ష్మణరావుకు నివాళి అర్పించేందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు శుక్రవారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం జస్టిస్ లక్ష్మణరావు న్యాయసేవలను గుర్తు చేసుకున్నారు. జస్టిస్ లక్ష్మణరావు ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, రిజిస్ట్రార్‌లు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

లాంచ్ కాంప్లెక్స్‌కు ఎస్200 సాలిడ్ మోటార్

▸▸ షార్‌లో వేగం పుంజుకున్న 'గగన్‌యాన్' పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్‌లో కీలక ముందడుగు పడింది. దీనిలో ఒక రోబోను అంతరిక్షంలోకి పంపి దాన్ని తిరిగి సురక్షితంగా భూమి మీదకు తీసుకురానున్నారు. ఈ ప్రయోగాన్ని తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట వేదికగా జనవరిలో చేపట్టే అవకాశం ఉంది. దీనికోసం హెచ్‌ఎల్‌వీఎం3-జీ1 రాకెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్‌లో కీలకమైన దశలో వినియోగించే ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్‌ను శుక్రవారం రాకెట్ లాంచ్ కాంప్లెక్స్‌కు తరలించారు.

ప్రేమ్‌కుమార్ అరెస్ట్‌పై కౌంటర్ వేయండి

▸▸ ఎందుకు అరెస్టు చేయాల్సివచ్చిందో చెప్పండి

▸▸ సోషల్ మీడియాలో వ్యాఖ్యల కేసుపై కర్నూలు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసులు తన తండ్రి ప్రేమ్‌కుమార్‌ను అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా వారిని ఆదేశించాలని కోరతూ కొరిటిపాటి అభినయ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. ప్రేమ్‌కుమార్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని, న్యాయాధికారి రిమాండ్ విధించారని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రేమ్‌కుమార్ అరెస్టుకి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కర్నూలు పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిందితులను అరెస్టు చేసే విషయంలో పోలీసులు చట్టనిబంధనలు పాటించడం లేదన్నారు. సివిల్ డ్రెస్సులో వచ్చి బలవంతంగా తీసుకెళ్తున్నారని తెలిపారు. నిబంధనలు పాటించని పోలీసులపై కఠిన చర్యలకు ఆదేశించాలని కోరారు. "రాష్ట్రంలో కొత్తగా రోడ్లు వేసి, టోల్‌గేట్లు పెట్టి కూటమి ప్రభుత్వం వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయనుందని ప్రేమ్‌కుమార్, ఆయన అనుచరులు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అదేవిధంగా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు" అని పేర్కొంటూ కర్నూలు ఐ-టీడీపీ అధ్యక్షుడు గట్టు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రేమ్‌కుమార్‌పై కర్నూలు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆళ్ల నా భూమిని కబ్జా చేశారు

▸▸ వర్షపు నీరు పోక పంట దెబ్బతింటోంది

▸▸ టీడీపీ నేతలకు ఓ బాధితుడి ఫిర్యాదు

▸▸ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం వినతుల కార్యక్రమంలో కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి భూ కబ్జాకు పాల్పడ్డారని శుక్రవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల కార్యక్రమంలో ఫిర్యాదు అందింది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి ఈ వినతులు స్వీకరించారు. 'మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నా భూమిని ఆక్రమించారు. దీంతో మిగిలిన వ్యవసాయ భూమి నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే దారిలేక పంట దెబ్బ తింటోంది. ఈ కబ్జా నుంచి నా భూమిని విడిపించండి' అంటూ మంగళగిరికి చెందిన వి.పూర్ణచంద్రరావు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విచారణ జరిపించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మెర గంగాధర మాట్లాడుతూ, 'వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మా గ్రామం వచ్చారు. ఆ రోజు మా ఇంటిపై టీడీపీ జెండా చూశారు. నాపై కేసులు పెట్టించి రౌడీ షీట్ తెరిపించారు. ఐదేళ్లుగా రాజకీయ వేధింపులకు గురవుతున్నా. నాపై రౌడీ షీట్ ఎత్తివేయించండి' అని విజ్ఞప్తి చేశారు. తనకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిని తమ గ్రామానికే చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించడంతోపాటు తన ఇంటిని కూడా కూలగొట్టి ఆక్రమించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తన భూమిని తనకు ఇప్పించాలని తిరుపతి జిల్లా ఆర్‌సీ పురం మండలం చిత్తాటూరు గ్రామానికి చెందిన పి.భూపతి కోరారు. చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మండలం అల్లాగుంట గ్రామంలో ఎనిమిది సెంట్ల పోరంబోకు భూమిని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారని, వారి నుంచి దానిని విడిపించి పేదలకు ఇవ్వాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో కాకర గొంతెమ్మ అనే మహిళ తన ఎకరా భూమిని కొట్టేసిందని, తనకు న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా దొర్లపూడి గ్రామానికి చెందిన బొల్లం వరహాలమ్మ విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన సిమెంట్ రోడ్లను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని, మళ్లీ వాటిని మంజూరు చేయాలని నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు గ్రామానికి చెందిన కాకొల్లు రమణయ్య కోరారు.

బడి మారుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలల విధానాన్ని తొలగించింది. అలాగే ఫలితాలు దారుణంగా ఉంటున్న హైస్కూల్ ప్లస్‌ల స్థానంలో ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. తాజా ప్రతిపాదనల్లో వీటి గురించి పాఠశాల విద్యాశాఖ ప్రస్తావించలేదు. ఇక కొత్తగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ప్రవేశపెట్టింది. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో ప్రీప్రైమరీ-1, 2తో పాటు 1 నుంచి 5 తరగతులు ఉంటాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లను కేటాయిస్తారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలోనూ ఇవే తరగతులు ఉంటాయి. వీటిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రారంభించి, ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకుంటారు. హైస్కూల్ ప్లస్‌లకు ప్రత్యామ్నాయంగా బాలికలకు ఇంటర్ విద్య అందించే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కాలేజీల విధానం తేవాలని భావిస్తున్నారు.

అత్యంత వివాదాస్పదం జీవో 117

పాఠశాలల నిర్మాణం, టీచర్ల కేటాయింపుపై గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 అత్యంత వివాదాస్పదమైంది. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య భారీగా పెరిగింది. 4,731 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను 3,348 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించారు. ఫలితంగా 2,43,540 మంది విద్యార్థులు బడి మారిపోవాల్సి వచ్చింది. ఈ కారణంగా ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 12,247కు పెరిగింది. అనేకమంది విద్యార్థులు ప్రైవేటు బడులకు మారిపోయారు. 2,073 ప్రాథమికోన్నత పాఠశాలలు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కోల్పోయాయి.

ఆ తరగతులు వెనక్కి

గత ప్రభుత్వంలో విలీనం కారణంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేరిన 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మిగిలిన 1,43,410 మందిని తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తీసుకొస్తారు. ఫౌండేషనల్ స్కూల్‌లో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక సెకండరీ గ్రేడ్ టీచర్‌ను, బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో ఒక ఎస్జీటీని కేటాయిస్తారు. ఆ తర్వాత విద్యా హక్కు చట్టం ప్రకారం కేటాయింపులు చేస్తారు. 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులుండే వాటిని మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించి ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున కనీసం ఐదుగురిని, విద్యార్థుల సంఖ్య 120 దాటితే ప్రధానోపాధ్యాడి పోస్టును కేటాయిస్తారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులున్న ప్రాంతాల్లో 45 నుంచి 50 మంది విద్యార్థులే ఉన్నా మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పరిగణిస్తారు.

రాజ్యసభ సభ్యులుగా సతీశ్, మస్తాన్‌రావు, కృష్ణయ్య

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా రాష్ట్రం నుంచి సానా సతీశ్ బాబు, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నుంచి సానా సతీశ్ బాబు, బీద మస్తాన్‌రావు యాదవ్, బీజేపీ నుంచి ఆర్ కృష్ణయ్య నామినేషన్లు దాఖలు చేయగా.. వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఈ ముగ్గురూ శుక్రవారం అసెంబ్లీకి వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితా రాణి నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.

పోషణ్ 2.0 పథకానికి 169 కోట్లు విడుదల

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల్లో గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించే 'పోషణ్ 2.0' పథకానికి ప్రభుత్వం రూ.169.65 కోట్లు విడుదల చేసింది. 2024-25 సంవత్సరానికిగానూ ఈ నిధులు విడుదల చేస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

▸▸ వేడుకలకు ముస్తాబైన పోరంకి



పెనమలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు విజయవాడ సమీపంలోని పోరంకిలో ఉన్న మురళీ రిసార్ట్సులో శనివారం వైభవంగా జరగనున్నాయి. వేడుకల వివరాలను ఉత్సవ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి శుక్రవారం విలేకరులకు వివరించారు. జనార్దన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ జీవితాన్ని ప్రారంభించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను ఏడాదిపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. పోరంకితోపాటు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర నగరాలలో నిర్వహిస్తామన్నారు. తారకరామం పేరుతో అన్న గారి అంతరంగం పుస్తకాన్ని వేడుకల్లో ఆవిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రను భావితరాల కోసం పాఠ్య పుస్తకాల్లో పొందుపరుస్తామని తెలిపారు. నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంతవరకు అన్నగారి పేరు నిలిచి ఉంటుందని, రాజకీయాల్లో, సినీరంగంలో ఎన్టీఆర్ ఒక ధ్రువతార అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ లాంటి ఒక మహానుభావుడి సినీ వజ్రోత్సవ వేడుకలను నిర్వహించడం తెలుగు జాతి చేసుకొన్న అదృష్టమని తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎన్టీఆర్ కుమారులు మోహనకృష్ణ, జయశంకరకృష్ణ, ఎన్టీఆర్ తొలిచిత్రం మనదేశం నిర్మాత కృష్ణవేణి తదితర సినీ ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

తిరుమల నడకదారిలో భక్తుడు మృతి

▸▸ మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి

తిరుమల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదా మాట్లాడుతూ.. తిరుమల నడక మార్గంలో వెళుతున్న ఓ యువకుడు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే తిరుమలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌కు చెందిన సీహెచ్.రవికుమార్(38) ఐదుగురు స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నాడు. అలిపిరి నుంచి తిరుమలకు నడక ప్రారంభించారు. 2,500వ మెట్టు వద్దకు చేరేసరికి రవికుమార్ ఒక్కసారిగా ఛాతీనొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో తిరుమలలోని ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు.

అధికారుల తీరుకు నిరసనగా
రైతు బలవన్మరణం

▸▸ డిప్యూటీ కలెక్టరు వేధింపులే కారణమని ఆరోపణ

▸▸ ఆత్మహత్య చేసుకుంటూ సెల్ఫీ వీడియో

▸▸ నెల్లూరు జిల్లా చేవూరులో విషాదం



ఉరి వేసుకునే ముందు సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న రైతు వినోద్

గుడ్లూరు/కందుకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణ ఓ రైతు ప్రాణం బలి తీసుకుంది. భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి పరిహారం చెల్లింపులో తనకు అన్యాయం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు గ్రామానికి చెందిన నక్కల వినోద్ కుమార్ (40) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కావలిలోని తన నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు ఒక సెల్ఫీ వీడియోలో తన ఆత్మహత్యకు కారణాన్ని వివరించారు. చేవూరుకు చెందిన వినోద్ కుమార్ పిల్లల చదువు కోసం కావలిలో ఉంటున్నారు. ఆయనకు చేవూరులో 9.6 ఎకరాల భూమి ఉండగా రామాయపట్నం పోర్టు కోసం ఆ భూమిని సేకరించారు. ఇందులో 7 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన 2.6 ఎకరాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ.80 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. పరిహారం చెల్లించాలని కావలి భూ సేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల 40 సెంట్లకు పరిహారం తన ఖాతాలో జమ అయినా వినోద్‌కుమార్ వెనక్కి ఇచ్చేశారు. కాగా.. వినోద్‌కుమార్ ఆత్మహత్య విషయం తెలిసి కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ చేవూరుకు చేరుకుని మృతుని భార్య మౌనిక, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా చేవూరులో వినోద్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుని కుమారుడు, కుమార్తెలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉన్నత చదువులు చదివించే బాధ్యతను తాను తీసుకుంటానని ఆయన భార్య మౌనికకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా రూ.50 వేల ఆర్థికసహాయం అందించారు. ఈ ఘటనపై కావలి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చదరంగపు రారాజు

ప్రపంచ చాంపియన్ అవ్వాలని ప్రతి ఆటగాడూ కోరుకుంటాడు. కొందరు కెరీర్ చరమాంకంలో లక్ష్యాన్ని చేరుకుంటే.. మరికొందరు ఆదినుంచే అద్భుతాలు సృష్టిస్తూ అందనంత 'ఎత్తు'కు ఎదుగుతారు. తెలుగు మూలాలున్న పద్దెనిమిదేళ్ల తమిళ ఆటగాడు దొమ్మరాజు గుకేష్ రెండో కోవలో నిలుస్తాడు. ఇటీవలే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన గుకేష్, ప్రపంచ టోర్నీకి డిఫెండింగ్ చాంపియన్, చైనా ఆటగాడు డింగ్ లిరెన్‌ను సవాల్ చేశాడు. అనుకున్నట్టే తాజాగా సింగపూర్‌లో జరిగిన అసలైన సమరంలో లిరెన్‌ను తన ఎత్తులతో చిత్తు-చేసి కొత్త చాంపియన్‌గా అవతరించాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా, కాస్పరోవ్‌లాంటి దిగ్గజాన్ని అధిగమిస్తూ ప్రపంచంలోనే అతి పిన్న వయసు ఆటగాడిగా గుకేష్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు.

చదరంగంలో గుకేష్ ప్రయాణమే ఓ సంచలనం. ఏడేళ్ల వయసులోనే అరవై నాలుగు గళ్ల ఆటను ఔపోసన పట్టేసిన గుకేష్, అనతికాలంలోనే తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. తొమ్మిదేళ్లకే ఆసియా పాఠశాలల చాంపియన్‌షిప్, మూడేళ్ల అనంతరం ప్రపంచ యూత్ చెస్ చాంపియన్-షిప్‌లో విజేతగా నిలిచి తన సహజ-సిద్ధమైన ప్రజ్ఞను చాటుకున్నాడు. 12 ఏళ్ల ఏడు నెలల పదిహేడు రోజుల వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకున్నాడు. గ్రాండ్‌మాస్టర్ అయ్యాక మరింత కష్టపడడం మొదలుపెట్టాడు. భారత దిగ్గజం విశ్వ-నాథన్ ఆనంద్ మార్గనిర్దేశనంలో మరోస్థాయికి ఎదిగాడు. తన గురువు ఆనంద్, మాగ్నస్ కార్ల్‌సన్‌లను ఓడిస్తానని ఐదేళ్లక్రితమే ప్రకటించిన గుకేష్.. చెప్పినట్టే అనంతరకాలంలో ఆ ఇరువురు దిగ్గజాలపై పైచేయి సాధించాడు. రెండేళ్ల క్రితం ఒలింపియాడ్‌లో వ్యక్తిగత స్వర్ణం, నిరుడు ఆసియా క్రీడల టీమ్ విభాగంలో రజతం అందుకున్న గుకేష్ ప్రపంచ చెస్‌లో 2750 రేటింగ్ దాటిన అతి పిన్న వయసు ఆటగాడిగా రికార్డుల్లో నిలిచాడు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో తలపడి పదిహేడేళ్ల వయసులోనే టైటిల్ నెగ్గి చరిత్ర సృష్టించాడు. ఇక భారత జట్టు చెస్ ఒలింపియాడ్ ట్రోఫీని సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఈ చెన్నై చిన్నోడు, ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌తో చదరంగ సింహాసనంపై రారాజు జెండా ఎగరేశాడు. ఈ ఘనతలన్నీ అతి తక్కువకాలంలో, చిరు-ప్రాయంలోనే అందుకొని తనపేరును చిరస్మరణీయం చేసుకున్నాడు.

గుకేష్ మితభాషి. ఎంత తక్కువగా మాట్లాడతాడో అంత ఎక్కువగా తనదైన వ్యూహాలతో చదరంగ బోర్డుపై చెలరేగిపోతాడు. చెస్ శిక్షణలో కంప్యూటర్ల సాయం తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ తరం ఆటగాళ్లకు గుకేష్ కొంత భిన్నం. ఈ క్రీడలో క్లాసికల్ ఫార్మాట్ అంటే మక్కువ చూపే గుకేష్, వీలైనంత వరకు కంప్యూటర్ల వాడకాన్ని తగ్గిస్తూ, సంప్రదాయమైన శిక్షణలో కోచ్‌ల పర్య-వేక్షణను ఎక్కువగా ఇష్టపడతాడు. ఏ టోర్నీకి వెళ్లినా ఆటకు ముందు గుకేష్ అమ్మతో పావుగంట సేపు మాట్లాడతాడు. ఆ సంభాషణలో ఎక్కడా చెస్ ప్రస్తావన తీసుకురాకుండా జాగ్రత్తపడతాడు. ఎంత ఒత్తిడి దరిచేరు-తున్నా, ప్రశాంతంగా ఉంటూ ఆటకు సిద్ధమయ్యేందుకే కాసేపు అమ్మతో మాట్లాడతానని గుకేష్ చెప్తాడు. ఇలా, ప్రతి అంశంలోనూ విభిన్నంగా ఉంటూ బోర్డులో ఎత్తుకు పైఎత్తులు వేస్తూంటాడు.

భారతీయుల ఆటగా పేరొందిన చదరంగంలో గుకేష్‌తో పాటు ప్రజ్ఞానంద, అర్జున్, విదిత్ గుజరాతి, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్ లాంటి యువ ఆటగాళ్లు సాధిస్తున్న విజయాలతో ఇప్పుడు పుట్టింటికి పూర్వ వైభవం వచ్చింది. వీళ్ల అంతర్జాతీయస్థాయి ప్రదర్శనలతో దేశవ్యాప్తంగా చదరంగ విప్లవం మళ్లీ పురుడు పోసుకుంది. 1999లో భారత్‌లో ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లే ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 85కు చేరడమే అందుకు నిదర్శనం. విశ్వనాథన్ ఆనంద్ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ యువతరం తమ క్రీడాప్రజ్ఞకు పదును పెట్టుకుంటుండడం శుభ పరిణామం. క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న మన చిన్నారులకు వ్యవస్థాగత తోడ్పాటు, నిరంతరం శిక్షణ అందించే పటిష్ఠ యంత్రాంగాన్ని తీర్చిదిద్దాలి. క్షేత్రస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న మౌలిక సమస్యలపై దృష్టి సారించాలి. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రైవేట్ సంస్థల వెన్నుదన్నూ ఉండాలి.

ఆర్థిక భారత అద్భుతానికి మోదీ ఎలా ఆద్యుడు?

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఎలెక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ నాగరీక మర్యాదలు తెలిసినవారు, విద్యాధికులు, మృదుస్వభావులు. ప్రజ్ఞా-వంతుడైన దౌత్యవేత్తగా జైశంకర్ సుప్రసిద్ధుడు. ఉదారవాదిగా పేరు పొందారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన వైష్ణవ్ వ్యాపార రంగంలో విజయాలు సాధించి పార్లమెంటుకు ఎన్నికై వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించిన ప్రతిభావంతుడు. అర్థశాస్త్రం, ఆర్థిక రంగ వ్యవహారాలలో జైశంకర్‌కు ఆసక్తి ఉన్నదన్న విషయం నాకు తెలుసు. వార్టన్ బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేట్‌గా వైష్ణవ్ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి ఈ ఇరువురికీ బాగా తెలుసు. టీవీ ఛానెల్ ఎన్‌డీటీవీ ఇటీవల నిర్వహించిన ఒక సదస్సులో దేశ ఆర్థిక వ్యవస్థపై ఇరువురూ తమ అభిప్రా-యాలను సుదీర్ఘంగా వ్యక్తం చేశారు.

అంకెలు ప్రతిభావంతులను సైతం గందరగోళపరుస్తాయి. జైశంకర్ తొలుత భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం గురించి సగర్వంగా మాట్లాడారు: నేడు మన ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల విలువైనది. 80,000 కోట్ల డాలర్ల విదేశీ వాణిజ్యం జరుపుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. మన దేశంలో విదేశీ మదుపులను చూస్తే మన ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదో మీకు అర్థమ-వుతుంది...'. వాస్తవం ఇందుకు చాలా దూరంగా ఉంది సుమా! మనం ఇంకా 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందలేదు. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని మనం లక్ష్యం నిర్దేశించుకున్నాం. ఆ గమ్యానికి చేరేందుకు మనం ఆపసోపాలు పడుతున్నాం. ఈ లక్ష్య సాధన విషయమై ఆర్థికమంత్రి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు గత ఆరేళ్లలో మూడుసార్లు భిన్న రీతుల్లో మాట్లాడారు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

2023–24 ఆర్థిక సంవత్సరాంతంలో మన దేశం నుంచి 437 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి అయ్యాయి; 677 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతి చేసుకున్నారు. వాణిజ్య లోటు 240 బిలియన్ డాలర్లు. మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2021–22లో 84.84 బిలియన్ డాలర్ల నుంచి 2023–24లో 70.95 బిలి-యన్ డాలర్లకు తగ్గిపోయాయి. 'ప్రజలకు లబ్ధి, ముఖ్యంగా ఆహారాన్ని సమ-కూర్చడంలో మన ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం గురించి ఘనంగా మాట్లాడారు. తలసరిన ఐదు కిలోల ఆహారధాన్యాలను ఉచితంగా సరఫరా చేయడం గురించి జైశంకర్ మాట్లాడుతున్నారా? నేనైతే ఆ ఉచిత సరఫరా ప్రజల దురవస్థలు, అల్ప వేతనాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాల కొరతకు సూచనగా పరిగణిస్తాను. కోవిడ్ కాలంలో వాక్సిన్ల ఉత్పత్తిదారుగా, సృష్టికర్తగా భారత్ సామర్థ్యాన్ని కూడా ఆయన ప్రశంసించారు. నిజమేమిటి? మన దేశంలో రూపొందించిన ఏకైక వ్యాక్సిన్ కోవాక్సిన్. దీని ప్రభావశీలత 80 శాతంగా ఉందని నిర్ధారణ అయింది. మరో వాక్సిన్ కోవిషీల్డ్. ఇది 90 శాతం ప్రభావశీలతను కలిగి ఉన్నదని రుజువయింది. అయితే ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రాజెనెకా నుంచి లైసెన్స్ పొంది ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్ ఇది. మన దేశంలో వేసిన 200 కోట్ల వ్యాక్సిన్లలో 160 కోట్లు కోవి-షీల్డ్ వ్యాక్సిన్లే.



వైష్ణవ్ సైతం మన ఆర్థిక వ్యవస్థ పురోగతి గురించి ఎంతో ఉద్వేగ భరితంగా మాట్లాడారు. భారత్ 6 నుంచి 8 శాతం సుస్థిర వృద్ధిరేటు సాధించడం గురించి ఆయన మాట్లాడారు. ఈ పురోగతికి నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని మూలధన పెట్టుబడులు, వస్తూత్పత్తి, సమ్మిళిత వృద్ధి, సరళీకరణగా ఆయన గుర్తిం-చారు. అయితే వాస్తవాలు ఏమిటి? మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదల రేటు కోవిడ్ ప్రభావిత ఏడాదితో సహా గత ఆరు సంవత్సరా-లుగా సగటున 4.99 శాతంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థల మదుపులు వాస్తవంగా 2019–20లో జీడీపీలో 4.7 శాతం నుంచి 2023–24లో 3.8 శాతానికి తగ్గిపోయింది.

1991లో ప్రారంభమైన సరళీకృత ఆర్థిక విధానాలతో భారత్‌లో ఆర్థిక స్వాతంత్ర్యం ఉదయించింది. ఆ నవశకానికి తీవ్ర అవరోధాలు ఎదురయినా కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల కృషిని మరింత ముందుకు తీసుకువెళ్లి దేశ సౌభాగ్య సౌధాన్ని మరింత సమున్నతమూ, శోభావంతమూ చేశాయి. ఆర్థిక పురోగతి పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితుల నుంచి తమ పాలనా ప్రస్థానాన్ని ప్రారంభించామని మోదీ ప్రభుత్వం చెప్పుకోవడంలో సత్యం లేదు.

జీడీపీలో వస్తూత్పత్తి రంగ వాటా 2014లో 15.07 శాతం నుంచి 2019లో 12.84 శాతానికి, 2023లో 12.84 శాతానికి తగ్గిపోయింది. సమ్మిళిత వృద్ధి అనేది తీవ్ర చర్చనీయాంశం. అటువంటి పురోగతి ఉన్నదా లేదా అనేది ఇంత చిన్న వ్యాసంలో నిరూ-పించడం కష్టం. కనుక ఈ అంశాన్ని వదిలివేస్తున్నాను. ఇక సరళీకరణ విషయానికి వస్తే పది సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడే, ముఖ్యంగా క్రమబద్ధీకరణ చట్టాల కింద నియమనిబంధనలు ఎక్కువగా ఉన్నాయి. ఏ చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కంపెనీ సెక్రెటరీ లేదా లీగల్ ప్రాక్టీషనర్‌ను అయినా అడగండి, నియమ నిబంధనలు, నియంత్రణలు ఎంత ఎక్కువ స్థాయిలో అదనంగా వచ్చాయో వివరిస్తారు.

1991లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ సాధించిన పురోగతి గురించి జైశంకర్, వైష్ణవ్‌లు సహేతుకంగా గర్వపడవచ్చు. అది ఆర్థిక స్వాతంత్ర్య నవోదయం. అయితే దానికి 1997లో (ఆసియన్ ఆర్థిక సంక్షోభం), 2008 (అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం), 2016 (పెద్దనోట్ల రద్దు), 2020 (కోవిడ్ విలయం) తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల భుజస్కంధాలపై నిలబడి భవి-ష్యత్తులోకి దృష్టి సారించి, దేశ సౌభాగ్య సౌధాన్ని మరింత సమున్నతం, శోభావంతం చేశాయి. ఆర్థిక పురోగతి పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితుల నుంచి తమ పాలనా ప్రస్థానాన్ని ప్రారంభించామని మోదీ ప్రభుత్వం చెప్పుకోవడంలో సత్యం లేదు. ఏ ప్రభుత్వమూ అలా ప్రారంభమవదు. కోవిషీల్డ్ వ్యాక్సిన్ విషయాన్నే తీసుకోండి. సీరమ్ ఇనిస్టిట్యూట్‌ను 1996లో నెలకొల్పారు. ఔషధాల ఉత్పత్తిలో ఒక బృహత్తర సంస్థగా అది అభివృద్ధి చెందింది. అపార అనుభవాన్ని సంతరించుకుంది. కోవిడ్ ఉపద్రవం సంభవించినప్పుడు ఆ[illegible]జెనెకా సాంకేతికతను సమకూర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థగా ఆవిర్భవించింది. అలాగే అతిగా పొగుడుతుండే JAM – జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ ఆద్యక్షర సంక్షిప్త పదం– నే తీసుకోండి నో–ఫ్రిల్స్ బ్యాంక్ ఖాతాల (జీరో బ్యాలెన్స్ ఎకౌంట్)కు బీజాలు ఇరువురు ఆర్బీఐ గవర్నర్లు– డాక్టర్ ఎస్. రంగరాజన్ (1992–97), డాక్టర్ బిమల్ జలాన్ (1997–2003) హయాంల్లో పడ్డాయి. లక్షలాది కొత్త ఖాతాలు ప్రారంభమ-య్యాయి. ప్రప్రథమ ఆధార్ నంబర్‌ను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకత్వంలో సెప్టెంబర్ 29, 2010న జారీ అయింది. సెల్‌ఫోన్ ద్వారా తొలి కాల్ చేసిన జూలై 31, 1995న మొబైల్ విప్లవం ప్రారంభమయింది.


సరే, భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిగతుల గురించి తెలుకోవాలంటే దాని అసాధారణ పురోగతి గురించి గౌరవనీయ మంత్రులు జైశంకర్, వైష్ణవ్‌ల ప్రశంసా-పూర్వక ప్రసంగాలను మీరు వినితీరవలసిందే. అయిత ప్రతినెలా ప్రచురితమయ్యే ఆర్బీఐ బులెటిన్‌లో ఆర్థిక వ్యవస్థ తాజా పరిస్థితిపై విపుల సమీక్షా వ్యాసాన్ని కూడా మీరు తప్పక చదవాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

వ్యాసుడు చూపిన వెలుగుబాట

గొప్ప చరిత్రకారుడు, విశిష్ట జీవితాల కథకుడు అయిన రాజ్‌మోహన్ గాంధీని నేను చాలా సంవత్సరాలుగా చదువుతున్నాను. అత్యయికస్థితి చీకటి రోజుల్లో ఆయన ఎడిటర్‌గా ఉన్న వారపత్రిక 'హిమ్మత్' ఆనాటి భయ విహ్వల వాతావరణాన్ని సాహ-సోపేతంగా ఎదుర్కొంది. ఆ తరువాత ఆధునిక భారతదే-శంపై లోతైన, నిర్దుష్ట పరిశోధనతో పలు పుస్తకాలు వెలు-వరించారు. పటేల్, రాజాజీ జీవితం, రాజనీతిజ్ఞత, పాలనా-దక్షతపై ప్రభావశీల గ్రంథాలు కూడా వాటిలో ఉన్నాయి. పత్రికలలో తన కాలమ్స్ ద్వారా వివిధ అంశాలపై ఆలోచ-నాత్మక చర్చకు విశేషంగా దోహదం చేశారు.

ఇటీవల నా మిత్రుడు ఒకరు నేను ఇంతకు ముందు చదవని రాజ్‌మోహన్ గాంధీ ప్రసంగం ఒకదాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. సెప్టెంబర్ 1991లో రాజ్యసభలో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టంపై చర్చలో చేసిన ఉపన్యాసమది. ఆగస్టు 15, 1947నాటికి ఉన్న ఒక ప్రార్థనాస్థలం మతపరమైన స్వభావాన్ని యథాతథంగా ఉంచేందుకు, ప్రార్థనాస్థలం లేదా స్థలంలోని ఒక విభాగాన్ని వేరే మతానికి చెందిన లేదా అదే మతంలోని వేరే సంప్రదాయానికి చెందిన ప్రార్థనాస్థలంగా మార్చడాన్ని నిషేధించే బిల్లు అది. అప్పటికే న్యాయ విచారణలో ఉన్న అయోధ్య వివాదాన్ని ఆ ప్రతిపాదిత చట్టం నుంచి మిన-హాయించారు. ఆనాడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ లోక్‌సభలో ఆ బిల్లు ఆమోదం పొందింది. తమ నియంత్రణలో ఉన్న ప్రార్థనా స్థలాలలో ఎటువంటి మార్పులు చేయడానికి అయినా రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉన్నదని బీజేపీ వాదించింది. అప్పట్లో జనతాదళ్ సభ్యుడుగా ఉన్న రాజ్‌మోహన్ గాంధీ ఆ బిల్లుపై చర్చ ప్రారంభించారు. పగ తీర్చుకునే ప్రయత్నాలలో లక్షలాదిమంది హతమైపోయిన విషాదం గురించి మహాభారతంలో వ్యక్తమైన ఆవేదన ప్రస్తావనతో రాజ్‌మోహన్ తన ప్రసంగాన్ని ప్రారంభిం-చారు. 'గతించిన యుగాలలో జరిగిన తప్పులను ప్రతీకార దృక్పథంతో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసానికి, మరింత విధ్వంసానికి, మరెంతో వినాశనా-నికి కారకులు అవుతారని మహాభారతం ఉద్ఘోషిస్తోంది' అని వక్కాణించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రార్థనాస్థలాల చట్టాన్ని రాజ్‌మోహన్ పూర్తిగా సమర్థించారు. ఆ బిల్లు హిందూ మతస్థులకు వ్యతిరేకంగా ఉందని బీజేపీ సభ్యులు చేసిన విమర్శకు ఆయన ఇలా ప్రతిస్పందించారు: 'ఆ విమ-ర్శలు మన దేశంలో కొత్త వేర్పాటు వాదాన్ని వినిపిస్తు-న్నాయి. ఆ విమర్శలు చేస్తున్నవారు తాము ప్రవచిస్తున్నది ఒక కొత్త జాతీయవాదం అని అంటున్నారు. అయితే అది హిందూ వేర్పాటువాదం. హిందూ ధర్మాన్ని వక్రీకరించిన వాదనలు అవి. ఆ విమర్శలు చేస్తున్నవారు తమ సొంత భావావేశాలు, ఉద్వేగాలతో తప్పుదోవ పట్టినవారు. భారత్‌లో ఒక హిందూ పాకిస్థాన్‌ను, ఒక హిందూ సౌదీ అరేబియాను సృష్టించాలని వారు ఆకాంక్షిస్తున్నారు'. 'గత యుగాలలో జరిగిన నేరాల (వాస్తవమైనవి, ఊహా-త్మకమైనవి)పై మితిమీరిన స్థాయిలో దృష్టి పెట్టిన 'కొత్త వేర్పాటువాద హిందూధర్మం' ఉద్దేశపూర్వకంగా వర్తమాన



1991లో ప్రార్థనాస్థలాల చట్టంపై రాజ్యసభలో చర్చను ప్రారంభిస్తూ 'గతించిన యుగాలలో జరిగిన తప్పులను ప్రతీకార దృక్పథంతో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసానికి, మరింత విధ్వంసానికి, మరెంతో వినాశనానికి కారకులు అవుతారని మహాభారతం ఉద్ఘోషిస్తోంది' అని రాజ్‌మోహన్ గాంధీ గుర్తుచేశారు. భారతీయ ధర్మస్ఫూర్తిని రక్షించుకోదలిచిన వారందరూ ఆ వివేకవాణిని ఔదలదాల్చాలి.

కాలంలోని సంఖ్యానేక ప్రజల జీవన దుర్భరత్వం, ఆకలి దప్పులను విస్మరిస్తుం-దని, తాండవమాడుతున్న అవినీతి, పెచ్చ-రిల్లుతున్న హింసాకాండను ఉపేక్షిస్తుం-దని' ఆయన ఆక్షేపించారు.

'హిందువుల ఆత్మ గౌరవ పునరుద్ధరణ గురించి హిందూత్వశక్తులు మాట్లాడు-తున్నాయి. ముస్లింల పట్ల వ్యతిరేకత చూపడం ద్వారా మీ హిందూ అస్తిత్వాన్ని నిరూపించుకోండి అని కొత్త హిందూ వేర్పాటువాద శక్తులు నిర్దేశిస్తున్నాయి' అని ఆయన గర్హించారు. 'ప్రార్థనా స్థలాల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నవారు స్వల్పంగానో లేదా బృహత్తర స్థాయిలోనే రాజకీయ ప్రయోజనాలు పొందవచ్చు గానీ, ఆ వ్యతిరేకత కొత్త భావావేశాలను సృష్టి-స్తుంది. పురాతన యుగాలలో సంభవిం-చిన తప్పులను సరిదిద్దేందుకు మరెన్నో ప్రయత్నాలు జరుగుతాయి. ఇది దేశ శ్రేయస్సుకు శుభం కాదు. ఈ సత్యాన్ని విస్మరిస్తే గత చరిత్రలో జరిగిన తప్పు-లను సరిదిద్దే పేరిట మరెన్నో పోరాటాలు ప్రజ్వరిల్లి శాంతి సామరస్యాలు సమసిపోయే ప్రమాదమున్నది' అని ఆయన హెచ్చరించారు. హిందూ ఆత్మాభిమానం, హిందూ గౌరవం అనే భావావేశాలను నగదుగా, ఓట్లుగా, జడిపించే అధికారంగా, తుపాకీగా మార్చివేసే ప్రయత్నాలు హిందూ ధర్మానికి చెడ్డ పేరు తీసుకువస్తాయని ఆయన స్పష్టం చేశారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

'ఇక చాలు, ఈ ఘర్షణలకు స్వస్తి చెబుదాం అన్నది మన జాతీయ సంకల్పం అయ్యేందుకు కృషి చేద్దాం. వివాదాలు ఉంటాయి, ఉండవచ్చు. అయితే హింసాత్మక ఘర్షణలను నివారిద్దాం. మనం సమైక్యంగా భవిష్యత్తులోకి చూపు సారిద్దాం, గతంలోకి అంతగా చూడవద్దు, గతాన్ని ఉపేక్షిద్దాం' అని రాజ్‌మోహన్ గాంధీ ప్రసంగాన్ని ముగించారు. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991ను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న వ్యక్తే స్వయంగా బలహీనపరిచిన నేపథ్యంలో రాజ్‌మోహన్ గాంధీ వివేకశీల మాటలను మనం మళ్లీ గుర్తు చేసుకుందాం, వాటి స్ఫూర్తిని ఆవాహన చేసుకుందాం.

వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో గత కాలపు హిందూ దేవతా ప్రతిమలు ఉన్నాయని, వాటిని ఆరాధించే హక్కు తమకు ఉందని, పూజలకు అనుమతినివ్వాలని కోరుతూ ఆగస్టు 2021లో కొంత మంది హిందువులు తొలుత స్థానిక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ మేరకు జ్ఞానవాపి మసీదును సర్వే చేయాలని ఆ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. దీనిపై అభ్యంతరం తెలిపినవారు మే 2022లో సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం అధ్యక్షుడుగా ఉన్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఇలా వ్యాఖ్యానించారు: ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం–1991 గత యుగాలలోని ఏ కాలానికి చెందిన ప్రార్థనా స్థలం మత పర స్వభావాన్ని నిర్ధారించడాన్ని అడ్డుకోదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే చారిత్రక తప్పు-లను సరిదిద్దే ప్రయత్నాలను ప్రోత్స-హించాలని కింది న్యాయస్థానాలు, హైకోర్టు న్యాయమూర్తులు కోరుకుంటే అందుకు అనుగుణమైన ఆదేశాలు జారీ చేసేందుకు వారికి స్వేచ్ఛ ఉన్నది'. దీనిపై మానవహక్కుల ఉద్యమ నేత హర్ష్ మందర్ ఇలా వ్యాఖ్యానించారు: 'సంభాల్‌లో ఆరుగురు వ్యక్తుల మరణా-నికి కారణమైన సివిల్ జడ్జి ఉత్తర్వును సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు అనుమ-తించాయి. ప్రార్థనాస్థలాల మత పర స్వభావం విషయమై అనేక సవాళ్లకు సీజేఐ వ్యాఖ్యలు దారితీస్తున్నాయన్న సుప్రీంకోర్టు అబ్జర్వర్ వ్యాఖ్యలో సత్యం ఉన్నది'.

1998–2004 సంవత్సరాల మధ్య ఎన్డీఏ పాలనా కాలంలో బీజేపీ అగ్రనాయకులు అరుదుగా మాత్రమే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం జరిగింది. 1990లో ఎల్‌కె అద్వాణీ రథయాత్ర సందర్భంగా రక్తపాతం చోటు-చేసుకున్నప్పటికీ, ఎన్డీఏ ప్రభుత్వంలో హోం మంత్రిగా ఆయన ప్రకటనలు సంయమనంతో ఉండేవి. ఇతర కేబినెట్ మంత్రులు, ప్రధానమంత్రి కూడా చాలా సంయమనంతో మాట్లాడేవారు. ఇప్పుడు హిందువులు కాని భారతీయుల పట్ల విద్వేషపూరిత వ్యతిరేకతతో తమ హిందూ అస్తిత్వాన్ని నిర్వచించుకుంటున్న వారిలో చాలా శక్తిమంతమైన, అత్యు-న్నతస్థాయి రాజకీయ నాయకులు కూడా ఉంటున్నారు. కేంద్ర హోంమంత్రి, ఉత్తరప్రదేశ్, అసోం ముఖ్యమంత్రులు తమ ఉపన్యాసాలలో తరచుగా భారతీయ ముస్లింలపై తీవ్ర అపవాదులు వేయడం పరిపాటి అయిపోయింది. ప్రధానమంత్రి సైతం అప్పుడప్పుడూ ఇటువంటి వైఖరి చూపుతున్నారు. అధికార లాలసులు అయిన హిందూత్వ-వాదులు తమ ముస్లిం విద్వేష వైఖరులను సరిదిద్దుకోగల-రని ఆశించలేము. అయితే భారతీయ ధర్మ స్ఫూర్తిని రక్షిం-చుకోవాలనే వివేక వాణిని వినేందుకు సుముఖంగా ఉన్న హిందువుల కోసం మహాభారతం పఠనం నుంచి రాజ్‌మోహన్ గాంధీ తెలుసుకున్న సత్యాన్ని ఈ వ్యాసానికి ముగింపుగా మరొకసారి ఉటంకిస్తాను: "చారిత్రక తప్పు-లను ప్రతీకార వైఖరితో సరిదిద్దేందుకు ప్రయత్నించేవారు కేవలం విధ్వంసాన్ని, మరింత విధ్వంసాన్ని, మరెంతో వినాశనాన్ని మాత్రమే సృష్టిస్తారు'.

గాంధీ, రాజాజీల మనవడు అయిన రాజ్‌మోహన్ మరో చోట చేసిన ఒక వివేకశీల వ్యాఖ్యను కూడా ఉటంకిస్తాను: 'మన చరిత్రను మహాభారతం సహాయంతో దర్శించదలు-చుకోవడం, ఆ ఇతిహాస కావ్యానికి జ్ఞానదాయక భాష్యం చెప్పడానికి ప్రయత్నించడం అనుమతించదగిన కర్తవ్యమే కాకుండా, అది ఒక నిర్దేశిత విధ్యుక్త ధర్మం'.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

యాభై వసంతాల అరుణోదయం

ఏభై ఏళ్లు ఆషామాషీ కాదు, అది ఒక మైలురాయి. సంస్థని ప్రారంభించినవారు, ఆ సంస్థని నడిపిన-వారు, నేటిదాకా దానికొక ఆలంబనగా నిలిచిన వ్యక్తులు, శక్తులు ఎవరైనా వారికి అభినందనలు తెలపవలసిందే. ఇదొక విలువైన సందర్భం. సమాజానికి అవసరమైన వేడుక. 50 ఏళ్ళ పండగ – గతాన్ని మననం చేసుకుంటూ, భవిష్యత్తును తీర్చి-దిద్దే ఆవశ్యకత. ప్రజా జీవితంలో, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక రంగంలో అది ఒక కొండగుర్తు. కొన్ని విజయాలు, మరికొన్ని ప్రయత్నాలు ఏవైనా గాని వాటిని పాఠాలుగా ఆత్మ విమర్శతో ముందడుగు వేయడానికి ఉపయోగపడే ఇంధనం వంటిది ఏభైయవ వసంతం.

అనేక ప్రజా సమూహాలు కలగలిసిన సంస్థ గురించి ఆలోచిం-చినప్పుడు ఏభై ఏళ్ళ కాలం పెద్దదే. దీనిని చాలా మంది గుర్తిస్తారు. ఒక మహోత్సవంగా జరపాలని ఆశిస్తారు. ఏభై ఏళ్ళ సందర్భాన్ని 'స్వర్ణోత్సవాలు' అంటారు. ఆ పదాన్ని ఇష్టపడని-వారు 'సింపుల్'గా 50 ఏళ్ళు అంటారు. పండగ అనో, వేడుక అనో అంటారు. అరుణోదయ మాత్రం '50 వసంతాల సభలు' అంటున్నది. ప్రజలకు సంబంధించిన ఏ సంస్థ అయినా 50 ఏళ్ళు పూర్తి చేసుకోవడం పండగే. ముఖ్యంగా ఇప్పుడున్న పరిస్థితులలో.. ప్రజల కోసమే పుట్టిన సంస్థ ప్రజల చైతన్యంలో భాగమై ప్రజా జీవితాల కోసం కంకణబద్ధమైన ఆలోచనలను వెదజల్లుతూ నిలబడడం ప్రజావిజయంగా భావించాలి.

1974 ఏప్రిల్ 14న పలు సంప్రదింపులతో జంపాల చంద్రశేఖర ప్రసాద్ చొరవతో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మే 12, 1974న లాంఛనంగా ఏర్పడింది. చలపతి, కానూరి వంటివారు, తదనంతరం గొప్ప కవిగాయక సుప్రసిద్ధుల నిర్వాహణతో దూసుకుపోయింది. ఎన్ని అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా కదం తొక్కుతూ, పదం పాడుతూ పోదాం ముందుకే... అంటూ తన ప్రయాణం సాగించింది. ఈ ప్రస్థానంలో ఎంతో మంది కవిగాయకులు, కళాకారులు ఎన్నో ఆంక్షలు ఎదుర్కొన్నారు, జైళ్ళకు వెళ్ళారు. ప్రజా కళారంగాన్ని ఉవ్వెత్తున ఉద్యమంగా, ఉద్యమాలకు బాసటగా నిలిపారు. వామపక్ష భావాలతో భూమి, భుక్తి, గూడు కోసం వర్గపోరాటాలను రాశిలోనూ, వాసి-లోనూ తీర్చిదిద్దారు. ఈ క్రమంలో ఎందరో అమరులయ్యారు. గత ప్రభుత్వం హయాంలో కూడా అరుణోదయ కళాకారులను వేధింపులకు గురి చేశారు. సాంస్కృతిక సంస్థ కార్యాలయానికి తాళాలు వేశారు. కళాకారుల మీద కేసులు పెట్టారు. అయినా ప్రజల కోసం ప్రజాబాణీలను, ప్రజా సంగీతాన్ని ఆసరా చేసుకొని ప్రజల మధ్య రాగాలై, బాణీలై, గానాలై కళారూపాలై తమవంతు పాత్ర పోషించారు.

ప్రజలకు దూరమైన భావాలూ, జీవితాలూ, రాజకీయాలూ కాకుండా వారిని కేంద్రంగా చేసుకుని వారి సమస్యల కోసం వారు నిలిచిన నేలలోంచి నిలబడి కళారూపాలను సృష్టించడంలో అరుణోదయ తనదైన ముద్ర వేసింది. ముఖ్యంగా కుల, వర్గ పోరాటాలను ఎజెండాపైకి తేవడంలోనూ, ఆ అంశాలను సాహిత్యంలో, కళల్లో, కళారూపాలలో ప్రదర్శించిన అరుణోదయ ముందు నిలిచింది.

నిజానికి విద్యార్థి సంఘాలు, అరుణోదయ సంస్థలు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఐక్య సాంస్కృతిక కార్యాచరణ అవసరం ప్రజలు గుర్తించారు. కానీ ఎలాంటి రాజకీయ, నిర్మాణ సమస్యల వల్ల ఐక్యం కాలేకపోయాయో తెలియదు. కానీ,

ఇప్పుడు బహిరంగంగా ప్రజా ఉద్యమాలు అవసరం. వాటి రూపకల్పన, పని విధానం ప్రజల మధ్య, విశాలాకాశం కింద పురుడు పోసుకోవాలి. కవిత్వం, గానం, గీతం వంటి వాటిని జన జీవితాల్లోంచి వెలికి తీసి ప్రజల భాషలో వినిపించాలి. అరుణోదయ తన పాత ప్రణాళికను మరింత లో చూపుతో ఇతర ప్రగతిశీల సంస్థల కన్నా గుణాత్మకంగా కొత్త చూపుతో తీసుకురావాలి.



సాంస్కృతిక పోరాటం మాత్రం తీవ్రంగా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నిజానికి దేశీయ ప్రజాస్వామ్యం అభివృద్ధి చెంది, ఆయా ప్రజలలో ఐక్యత తీసుకురావాల్సి వుండగా గ్రూపులు, పార్టీలు విడనాడి ప్రజలను విడదీయడం జరుగుతుంది. కులాన్ని గుర్తించని ప్రగతిశీల రాజకీయవాదం ఎంత గొప్పదైనా ప్రజలను కలిపే ప్రయత్నాలలో, ఆలోచనలలో వెనుకబడిపోయారు. వివిధ వర్గాల, కులాల, ఉపకులాల మధ్య గల చిన్న చిన్న వైరుధ్యాలను రూపుమాపలేని విధంగా ప్రణాళికలను తయారు చేసుకున్నారు. ఒకవైపు కుల, మత భావన, ఆధిపత్యం సజావుగా కొనసాగు-తుంటే ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చేదెవరు?

ప్రజల సాంస్కృతిక రూపాలు, కళారంగాన్ని, శ్రమ సాంస్కృ-తిక రంగాన్ని పట్టించుకోకపోవడం ఎందువల్ల జరుగుతోంది? ఇలాంటి చాలా ప్రశ్నలకు ప్రజలకు జవాబు లభించడం లేదు. అందుకే ఈ సంక్లిష్ట సమయంలో సాంస్కృతిక రంగంపై పెను-భారం పడింది. ఈ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఒక్కో సమస్యను ప్రజలకు విడమరుస్తూ అనేక వేదికల మీద వాటిని ప్రచారం చేస్తున్న అరుణోదయ కళాకారులను అభినందించవల-సిందే. ఈ సంస్థను విమలక్క తన భుజస్కంధాలపై మోస్తూ భారమైనప్పటికీ ఆగకుండా సాగుతున్నందుకు అభినందించాలి.

అరుణోదయ తమ కళాకారులను, కార్యకర్తలను తామే కష్టపడి తయారు చేసుకోవడం గమనార్హం. గాలికి వచ్చేవాళ్లు... అలా వచ్చి ఇలా వెళతారు. కానీ, అరుణోదయ స్థిరంగా కార్య-కలాపాలను కొనసాగిస్తున్నదంటే కళాకారులను ప్రజలలోంచి వెతికి తమలో భాగం చేయడమే. ప్రజా రాశుల నుండి చేరవలసిన వాళ్ళను వెతుక్కోలేనితనం ఓటమికి దారితీస్తుంది. ప్రజాతంత్ర జనస్వామ్యం గుర్తించని సంస్థలు డీలా పడిపోతాయి. ప్రజలలో పనిచేయని రచయిత, మేధావి కృత్రిమ భావాలకు కాల్పనిక ఆలోచనలకు దగ్గరవుతారు. నాణ్యమైన ఫలితాలను సాధించలేని వ్యక్తుల వల్ల చిన్న ఉద్యమాలు కూడా విజయవంతం కావు. అవును, ఇప్పుడు బహిరంగంగా ప్రజోద్యమాలు అవసరం. వాటి రూపకల్పన, వాటి పని విధానం ప్రజల మధ్య, విశాలాకాశం కింద పురుడు పోసుకోవాలి. కొత్త కొత్తగా ఏర్ప-డిన సమస్యలు మారుతున్న సాంకేతిక అభివృద్ధి, సామాజిక చల-నాలు, ప్రజా ఆకాంక్షలను అధ్యయనం చేసి, మార్కెట్‌ను, మతాన్ని, కొత్త దోపిడీ రూపాలను మనం అర్థం చేసుకోవాలి.

విశాల హృదయంతో ప్రజా సమూహాలను వారి సమస్యల పరిష్కారానికి వారినే సిద్ధం చేయాలి. అలాంటి కృషిని అరుణోదయ కొంత చేయగలుగుతున్నందుకు సంతోషించాలి. సాంస్కృతిక కళారంగం తల్లిలా ప్రజలను చేరదీయాలి. రాజకీయ రంగం చేసే పనికన్నా ఎక్కువ శ్రమపడాలి. రాజకీయ పదజాలం ఎక్కువగా ఉపయోగించడం పాత పద్ధతి. కవిత్వం, గానం, గీతం వంటి వాటిని జీవితాల్లోంచి వెలికి తీసి ప్రజల భాషలో వినిపించాలి. ఏ నిర్మాణానికి అయినా ఒక లక్ష్యం వుంటుంది. దాని లక్ష్యాల కోసం అది పనిచేస్తుంది. ఆ స్వేచ్ఛను ఇతర వేదికలవారు హరించకూడదు. తాము చేయవలసిన పనిని ఇతరులు చేయాలని చెప్పడం సరైనది కాదు.

అరుణోదయ తన పాత ప్రణాళికను మరింత లో చూపుతో ఇతర ప్రగతిశీల సంస్థల కన్నా గుణాత్మకంగా కొత్త చూపుతో తీసుకురావాలని ఆశ. కుల సమస్యను గుర్తించ నిరాకరించిన సంస్థలు కుల సమస్యను రూపుమాపలేవు. అందుకే అరుణోదయ మీద ఆ భారం వుంది. దానిని తమ సుదీర్ఘ కాలపు అనుభవం, ప్రత్యక్ష పరిశీలన, అన్ని కులాల కళాకారులతో కలిసిపోయి ఐక్యంగా పనిచేసే తీరు భవిష్యత్తులో మార్గదర్శి కావాలి. మన దేశంలోని కుల సమస్య దోపిడీ, ప్రజాస్వామ్య భావాలను క్రమ విధానంలో పెంచి పోషించే ఆలోచనల దిశగా ప్రయాణించాలి. బతుకమ్మ పేరుతో మహిళల సమస్యలను పర్యావరణాన్ని కాపాడుకోవాలనే పిలుపు ఇచ్చి, ఊరూరా తిరిగి పాటలు పాడి, ఆటలు ఆడటం సరికొత్త విధానం. ఇక్కడ బతుకమ్మని కాపా-డుకోవడానికి పర్యావరణ ఉద్యమాలు అవసరం. మహిళలపై జరిగే లైంగిక దోపిడీని, కార్పొరేట్లకోసం అడవిని, ఆదివాసీలను తరలించే ఆలోచనలకు అడ్డుకట్ట వేసే అడ్డుకునే ప్రచారం చేయడం జరుగుతోంది. పాత సమస్యలను కొత్త ఆలోచనలతో కొత్త ఎత్తుగడలతో ఎదుర్కోవడం అవసరం. అరుణోదయ ఈ విషయంలో ఆగకుండా తన ప్రయాణం కొనసాగిస్తోంది. అందుకు 50 ఏళ్ళ సభలు జరుపుకుంటున్న సందర్భంలో అరు-ణోదయకు అభినందనలు.

■ జయధీర్ తిరుమలరావు

(డిసెంబర్ 14న హైదరాబాద్‌లోని వీఎస్టీ ఫంక్షన్ హాలులో, 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల సభలు)

'కెఎస్ సంపూర్ణ రచనలు' ఆవిష్కరణ సభ


భారత కమ్యూనిస్టు విప్లవ మహో-పాధ్యాయుడు కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనలు (రెండు సంపుటాలు) ఆవిష్కరణ సభ రేపు జరగనున్నది. హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో సాయంత్రం 5.30 గం.లకు జరిగే సభకు డాక్టర్ శ్రీనివాస్ సభాధ్యక్షులు, టి.కృష్ణాబాయి ఆవిష్కర్త. సిహెచ్. శివారెడ్డి, అల్లం నారాయణ, ఎ.కె. ప్రభాకర్, డాక్టర్ సూరేపల్లి సుజాత, హర్ష ఠాకూర్, సుధాకర్, ఎస్.మూర్తి, తాయమ్మ కరుణ, 'మాభూమి' సంధ్య, డాక్టర్ బి.వై. వెంకటేశ్వర్లు, సాంబ-మూర్తి ఉపన్యసిస్తారు.

–కె.ఎస్. మెమోరియల్ కమిటీ

సహకారోద్యమ యోధుడి అభినందన సభ


దక్షిణ భారతదేశంలో విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకును అగ్రస్థా-నంలో నిలపడంలో సుప్రసిద్ధ సహకా-రవేత్త, మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు విశేష కృషి చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఆ బ్యాంకుకు వివిధ హోదాలలో సేవ-లందించారు. కార్మిక సంఘాల కార్య-క్రమాలలో పాల్గొంటూ వివిధ ఉద్య-మాలకు నాయకత్వం వహించారు. పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యు-నిగా జనం మెచ్చిన కమ్యూనిస్టు నేత ఆయన. సహకార వ్యవస్థ బలోపేతా-నికి కృషి చేశారు. నాఫ్‌కాబ్ డైరెక్టర్‌గా, ఉపాధ్యక్షుడిగా జాతీయ స్థాయిలో సేవలందించారు. నేడు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని పిల్లర్ నెం. 737, పీఎన్ఆర్ ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉదయం పది గంటలకు మానం ఆంజనేయులు అభినందన సభ జరగ-నున్నది. దాసరి శ్రీనివాసులు, వేమిరెడ్డి నరసింహారెడ్డి, పి.ఆర్.వి.పి.ఎస్ రంగ-రాజు విశిష్ట అతిథులు. రమేష్‌కుమార్ బంగ్, ఆర్.వి. రామారావు, ప్రమోద్-కుమార్ కెడియ, పొట్లూరి పాండురంగారావు ఆత్మీయ అతిథులు.

–చలసాని రాఘవేంద్రరావు
అభినందన సభ నిర్వహణ కమిటీ



నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు

- డోకిపర్రు, పోరంకిలో పర్యటన



మచిలీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు సాయంత్రం 4.00 గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. 4.10 గంటలకు డోకిపర్రులోని శ్రీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం సాయంత్రం 5.10 గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి విజయవాడ ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 5.40 గంటలకు పోరంకిలోని మురళీ రీసార్ట్‌కు రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు అక్కడ జరిగే ఎన్టీఆర్ వజ్రోత్సవం వేడుకల కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8.30 గంటలకు రోడ్డుమార్గం ద్వారా ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళతారు.



జల్సాల కోసం బైక్ చోరీలు

పొరుగు జిల్లాల నుంచి నగరానికి వస్తున్న నేరగాళ్లు

8లో

గౌతంరెడ్డి ఇంట్లో పోలీస్ సోదాలు

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్‌తో హత్యాయత్నం చేయించిన వైసీపీ నేత గౌతంరెడ్డి ఇంట్లో ఏడీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఈ కేసులో గౌతంరెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా ఎదురుదెబ్బ తగిలింది. హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో గౌతంరెడ్డి నగరం నుంచి పారిపోయాడు. ఇంట్లోనే ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మొత్తం ఇంటిని తనిఖీ చేయగా అతడి ఆచూకీ లభించలేదు. కోర్టులో పిటిషన్ డిస్మిస్ అయినప్పటి నుంచి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. అతడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

8లో

చంద్రబాబు : ఏమ్మా బాగున్నారా.. ఏం చదువుతున్నారు?
విద్యార్థినులు : బాగున్నాం సార్.. పదో తరగతి చదువుతున్నాం సార్
చంద్రబాబు : ఎక్కడి నుంచి వచ్చారు
విద్యార్థినులు : నున్న జెడ్పీ హైస్కూల్ నుంచి వచ్చాం సార్
చంద్రబాబు : త్వరలో పబ్లిక్ పరీక్షలు ఉన్నాయి... భయం వేయడం లేదా?
విద్యార్థినులు : ఏమాత్రం భయం లేదు సార్.. మా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు పెట్టి చదివిస్తున్నారు సార్
చంద్రబాబు : శభాష్.. ఆత్మవిశ్వాసం విజయానికి చిహ్నం. ఆల్ ద బెస్ట్

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగంగా స్టేడియంలో 'పది సూత్రాలు ఒక విజన్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు..



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

శభాష్.. ఆల్ ద బెస్ట్

'స్వర్ణాంధ్ర' స్టాల్ వద్ద పదో తరగతి విద్యార్థినులతో సీఎం చంద్రబాబు

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు అభినందనలు

విజన్ డాక్యుమెంట్‌పై జిల్లా ప్రజాప్రతినిధుల సంతకాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఎగ్జిబిషన్‌లో ఈ స్టాల్‌ను పదో తరగతి విద్యార్థినులు గాజుల సంధ్య, పానకాల భవ్యశ్రీ, జ్ఞానప్రసూన ఏర్పాటు చేశారు. వీరిలో సంధ్య, భవ్యశ్రీ నున్న జెడ్పీ హైస్కూల్‌లో చదువుతుండగా జ్ఞానప్రసూన పటమట జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుతోంది. స్టాల్‌ను సందర్శించిన సమయంలో విద్యార్థినులతో చంద్రబాబు మాట్లాడారు. విద్యార్థినులు పదో తరగతి చదువుతున్నారని తెలుసుకుని, వచ్చే ఏడాది మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారని చంద్రబాబు వారిని ఆరా తీశారు. పరీక్షలకు బాగా ప్రిపేర్ అవుతున్నామని, పాఠశాలలో ఉపాధ్యాయులు తమకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని విద్యార్థినులు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతోనూ మాట్లాడి విద్యార్థినులను పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయిస్తున్నారో తెలుసుకున్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం బాగా పనిచేసిందని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

జిల్లా యంత్రాంగానికి సీఎం ప్రశంసలు

రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలివచ్చినప్పటికీ ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారంటూ అభినందించారు. విజన్ డాక్యుమెంటులోని పది సూత్రాల దార్శనికతను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయడం, ప్రణాళిక ప్రకారం పార్కింగ్ ఏర్పాట్లు చూడటం వంటి వాటిని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లా అధికారులను మెచ్చుకున్నారు.

స్వర్ణాంధ్రలో జిల్లా నేతల సందడి

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, శ్రీరాం తాతయ్య, కొలికలపూడి శ్రీనివాస్, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్‌తోపాటు స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తదితరులు పాల్గొన్నారు. వీరంతా విజన్ డాక్యుమెంట్‌పై సంతకాలు చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ఒక చారిత్రక ఘట్టంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ప్రాంగణానికి విచ్చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన స్వాగతం పలికారు. వారిద్దరితో కలిసి విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచిన పది సూత్రాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే విజన్ డాక్యుమెంట్ ప్రధాన ఉద్దేశమన్నారు.

మిగతా 6లో..



స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, కలెక్టర్ లక్ష్మీశ

నగరంలో ట్రాఫికర్

రామవరప్పాడు రింగ్ నుంచి పీసీఆర్ వైపు వెళ్లాల్సిన వాహనదారులు మామూలు రోజుల్లో మూడు, నాలుగు స్టాప్‌ల తర్వాత గమ్యానికి చేరుకుంటారు. ఈ రోజు ఈ మార్గంలో వెళ్లాల్సిన వాహనదారులు ఏడెనిమిది స్టాప్‌ల్లో ఆగాల్సి వచ్చింది.

బెంజ్‌సర్కిల్ నుంచి పీసీఆర్ వరకు ఆటోల్లో వెళ్లాల్సిన ప్రయాణికులు వారధి వరకు ఒక ఆటో, అక్కడి నుంచి కృష్ణలంక పోలీస్‌స్టేషన్ వరకు మరో ఆటో ఎక్కి అక్కడికి చేరుకోవాల్సి వచ్చింది.

ఇదీ విజయవాడ నగరంలో శుక్రవారం పరిస్థితి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 కార్యక్రమం కారణంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎంజీ రోడ్డులో రాకపోకలను పూర్తిగా బంద్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భారీ, మధ్యతరహా వాహనాలను దారి మళ్లించారు. ఎక్కువ ట్రాఫిక్ ఉండే ఎంజీ రోడ్డులో ఆంక్షలు అమలు చేయడంతో ఆ భారం మొత్తం మిగిలిన రహదారులపై పడింది. దీంతో నగరంలోని అన్ని రహదారులపై వాహనాల రద్దీ తీవ్రంగా కనిపించింది. వివిధ జిల్లాల నుంచి వాహనాలు అధికంగా రావడంతో ఈ రద్దీ మరింత ఎక్కువైంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు మొత్తం 560 బస్సుల్లో జనాన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. ఇవి కాకుండా 2వేల కారులు ఆయా జిల్లాల నుంచి వచ్చాయి. ఈ వాహనాలను పార్కింగ్ చేయడానికి పోలీసులు నగరంలో మొత్తం 24 ప్రదేశాలను కేటాయించారు. (ఆంధ్రజ్యోతి, విజయవాడ)



'స్వర్ణాంధ్ర-2047' నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

- ఏలూరు రోడ్డుపై పడిన వాహనాల భారం
- రద్దీగా మారిన నగరంలోని ప్రధాన జంక్షన్లు
- అంతర్గత రహదారుల్లో వాహనచోదకుల అవస్థలు

రామవరప్పాడు నుంచి పీసీఆర్ వరకు వాహనాల క్యూ

నగరంలోకి వివిధ జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను రామవరప్పాడు రింగ్ నుంచి పీసీఆర్ వైపునకు మళ్లించారు. అక్కడి నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కువ బస్సులను ఈ మార్గంలోకి మళ్లించడం, ఎంజీ రోడ్డులోని ట్రాఫిక్ మొత్తం ఏలూరు రోడ్డులోకి వెళ్లడంతో ఇక్కడ ట్రాఫిక్ భారం పెరిగింది. ఈ రోడ్డుకు అనుబంధంగా ఉన్న కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, స్వర్ణప్యాలెస్, సీతారామపురం జంక్షన్, చుట్టుగుంట, విశాలాంధ్ర రోడ్డు, మాచవరం డౌన్ ప్రాంతాల్లో వాహనాలు నిలిచిపోయాయి. దీనితోపాటు బీఆర్టీఎస్ రోడ్డులోను రద్దీ తీవ్రంగా కనిపించింది. పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిండిపోవడంతో కొన్ని బస్సులను రహదారుల పై నిలుపుదల చేశారు. నేతాజీ బ్రిడ్జి ప్రదేశంలో బస్సులను సర్వీసు రోడ్డులో ఒక వైపున నిలుపుదల చేశారు. ఫ్లైఓవర్ల పైన ఒక వైపున బస్సులను పార్కింగ్‌కు ఇచ్చారు. సర్వీసు రహదారుల్లో బస్సులను నిలుపుదల చేయడంతో ఆ మార్గంలో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. మరోపక్క కాస్తంత ఖాళీగా కనిపించే ఆంధ్ర లయోలా కళాశాల వాహనాలతో బిజీగా మారిపోయింది. ఈ ప్రభావం రమేష్ ఆస్పత్రి కూడలిపై పడింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బెంజ్‌సర్కిల్, రమేష్ ఆస్పత్రి, మహానాడు జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులకు ఊపిరాడలేదు. రమేష్ ఆస్పత్రి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో వాహనాలు, రామవరప్పాడు వైపు వెళ్లే వాహనాలు ఒకేచోట కలవడంతో గ్రీన్‌సిగ్నల్ పడినప్పుడు వెళ్లే వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ద్విచక్ర వాహనదారులు ప్రధాన రహదారులపై ప్రయాణాన్ని వదులుకుని అంతర్గత

మిగతా 6లో..

పేర్ని ఎక్కడ?

పీడీఎస్ బియ్యం మాయం కేసులో ముందస్తు బెయిల్‌కు పేర్ని సతీమణి పిటిషన్

- వైసీపీ రైతు ధర్నాలో కనిపించని నాని, ఆయన కుమారుడు
- అరెస్టు భయంతోనే అజ్ఞాతంలోకి అంటూ సోషల్ మీడియాలో చర్చ



మచిలీపట్నం, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యం మాయం కేసులో చిక్కుకున్న మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని ఎక్కడ? అంటూ సర్వత్రా చర్చ జరుగుతోంది. వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ పిలుపు మేరకు రైతు సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వైసీపీ అధికారం కోల్పోయాక తొలిసారిగా ఆ పార్టీ నాయకులు రోడ్డుపైకి వచ్చారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉన్న పేర్నినాని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పేర్ని నాని కుమారుడు పేర్ని కిట్టు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్నినానికి చెందిన గోడౌన్ నుంచి 187 టన్నుల పీడీఎస్ బియ్యం మాయం కావడంపై పౌరసరఫరాలశాఖ అధికారులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పేర్ని నాని భార్య పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం కోర్టులో పేర్ని నాని భార్య జయసుధ పిటిషన్ కూడా వేశారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఇరుక్కున్న పేర్ని నాని గత రెండు, మూడు రోజులుగా కనిపించడంలేదు. ఈ అంశంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీజీపీఎస్ రోవర్లు!

6లో



బైపాస్ పనులు ఆగిన ప్రాంతం

పెద్ద స్కెచ్చే వేశారు!?

రెండేళ్ల కిందట మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టు

- దీనికి ఇప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందట..
- డ్యామేజీ కింద రూ.12 కోట్లు ఇవ్వాలని ఎన్‌హెచ్‌కు ల్యాంకో సరికొత్త ప్రతిపాదన
- అసలు పనిచేయని ప్రాజెక్టుకు డ్యామేజీ ఏమిటని రైతుల సూటి ప్రశ్న

ప్రజాధనం కొట్టేయడానికి పెద్ద స్కెచ్చే వేశారు. రెండేళ్ల కిందట మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ విద్యుత్ ఉత్పత్తి జరగటం లేదు. కానీ విజయవాడ వెస్ట్ బైపాస్ కోసం ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయం కారణంగా ల్యాంకో సంస్థకు డ్యామేజీ వాటిల్లిందని, దీనికి రూ.12 కోట్లు కట్టాలని ఎన్‌హెచ్‌కు ఆ సంస్థ ప్రతిపాదించింది. వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన తమ ప్లాంట్‌కు టవర్ల మార్పిడి వల్ల జరుగుతున్న నష్టాన్ని యూనిట్ల వారీగా లెక్కించి మరీ భారీ మొత్తాన్ని చెల్లించేందుకు ల్యాంకో డిమాండ్ చేయడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మూడు యూనిట్లు కలిగిన ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ ప్లాంట్‌ను సదరు యాజమాన్యం రెండేళ్ల కిందటే మూసివేసింది. యూనిట్లను స్క్రాప్‌గా విక్రయించటానికి ఆక్షన్ నిర్వహించింది. సింగపూర్‌కు చెందిన ఓ సంస్థ రెండు యూనిట్లను కొనుగోలు చేసి యంత్ర సామగ్రిని ఊడదీసుకుని వెళ్లిపోయింది. రాధా టీఎంటీ సంస్థ మాత్రం తాను కొనుగోలు చేసిన యూనిట్‌ను ఇంకా తొలగించలేదు. ఆ సంస్థ ఈ యూనిట్‌ను తిరిగి ఇక్కడే పునరుద్ధరించాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై ఆ సంస్థకు ఉన్న ఆసక్తిని తెలుపుతూ 350 కేవీ విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. ఈ తాజా ప్రతిపాదనను బట్టి చూసినా ఇప్పటి వరకు కూడా ల్యాంకో పవర్ ప్రాజెక్టులో ఎలాంటి విద్యుదుత్పత్తి జరగటం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది. ఇలాంటపుడు ల్యాంకో సంస్థకు రూ.12 కోట్లు ఎన్‌హెచ్ ఎందుకు కట్టాలన్నది ప్రశ్న. ఈ ప్రశ్న వేయాల్సిన ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారులు కిమ్మనకుండా రూ.12 కోట్లు చెల్లించేందుకు సుముఖంగా ఉండటం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ల్యాంకో సంస్థకు, ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు ఉన్నతాధికారుల నడుమ వాటాల డీల్ కుదరిందన్న రైతుల ఆరోపణలకు రూ.12 కోట్ల అంశం బలాన్ని చేకూరుస్తోంది.

సూపర్‌వైజేషన్ చార్జీల విషయంలోనూ గోల్‌మాల్ ?

ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి సూపర్ వైజేషన్ చార్జీల కింద రూ.45 లక్షలు చెల్లించాల్సిందిగా తమ ప్లాంట్ మూతపడక ముందు ల్యాంకో ఎన్‌హెచ్‌కు లేఖ రాసింది. ప్లాంట్ మూత పడిన నేపథ్యంలో రూ.45 లక్షలను

మిగతా 6లో..



సానా సతీష్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

సానా సతీష్‌కు కేశినేని చిన్ని శుభాకాంక్షలు

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సానా సతీష్ మర్యాదపూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిశారు. రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సతీష్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కారదర్శి గన్నే ప్రసాద్ (అన్న), టీడీపీ నాయకులు మాదిగాని గురునాథం, సూరపనేని సురేష్‌లు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ చాంపియన్ తేజేష్‌కు అభినందన



ఇటీవల తమిళనాడు పొలాచ్చిలో జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొని పతకాలను సాధించిన విజయవాడ అరండల్‌పేటకు చెందిన పి.తేజేష్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. అతడికి ప్రోత్సాహాన్నిచ్చిన తండ్రి బాలసుబ్రహ్మణ్యం కూడా ప్రశంసించారు. రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో క్వార్టర్స్ షో గ్రూపుల్లో బంగారు పతకాలు, పెయిర్ స్కేటింగ్‌లో, కపుల్ డ్యాన్సింగ్, ఇన్‌లైన్ స్కేటింగ్, సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో రజత పతకాలు పొందారు. ఈ సందర్భంగా ఎంపీకి తేజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అరెస్ట్‌కు బ్యాంక్ అధికారుల చెక్

» బ్యాంకు అధికారులకు సీపీ అభినందన



బ్యాంక్ అధికారులను అభినందిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్ డిజిటల్ అరెస్ట్ జరగకుండా చెక్ పెట్టడంలో బ్యాంక్ అధికారులు కీలక పాత్ర పోషించాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు అన్నారు. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు నగర పోలీసులు రూపకల్పన చేసిన తీరుకు ఫలితం దక్కింది. ఖాతాదారులు కంగారుగా బ్యాంక్‌కు వచ్చి పెద్ద మొత్తంలో ఆన్‌లైన్ ట్రాన్‌శాక్షన్ చేస్తుంటే అటువంటి వారిని గుర్తించి వారికి కొన్ని ప్రశ్నలు సంధించాలని పోలీసులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈనెల 12న ప్రజాశక్తినగర్ బ్రాంచ్ ఎస్‌బీఐకు వెళ్లిన ఓ వ్యక్తి తన ఖాతా నుంచి డబ్బులు వేరొకరి కరెంటు అకౌంట్‌కు తరలించాలని బ్యాంక్ అధికారులను కోరడం జరిగింది. దీంతో సిబ్బంది పిచ్చయ్యకు అనుమానం వచ్చి సదరు విషయాన్ని బ్యాంక్ మేనేజర్ రామేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కస్టమర్‌ను పోలీసులు చెప్పిన విధంగా ప్రశ్నలు సంధించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఖాతాను బ్లాక్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్వరం స్పందించి నేరం జరగకుండా చేసిన ప్రజాశక్తినగర్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రామేశ్వర్, పిచ్చయ్యలను శుక్రవారం సీపీ తన చాంబర్లో సత్కరించారు. భవిష్యత్తులో మరెవరూ ఇలా మోసపోకుండా బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే డిజిటల్ అరెస్టులను పూర్తిగా కట్టడి చేయవచ్చని సీపీ తెలిపారు. ఎవరికైనా డిజిటల్ అరెస్టులు చేశామని, మీ పేరుమీద నిషేధిత పదార్థాలు కొరియర్ చేశారని మీరు వెంటనే డబ్బులు కట్టాలని బెదిరిస్తే వెంటనే దగ్గరలోని సైబర్ క్రైమ్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



విశ్వవిరాసత్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వెంకయ్య

భారతీయ సంస్కృతి చదువుతో వృద్ధి

» స్కాట్‌స్పైన్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

పెనమలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి అభివృద్ధి కేవలం చదువుతోనే సాధ్యమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కానూరు స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన విశ్వ విరాసత్2024-25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చదువుతోనే సమస్తం సాధించగలమని అన్నారు. పాఠశాలలో ఆటలను తప్పనిసరి చేయడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. వివిధ అంశాల్లో నైపుణ్యత సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఎన్నో విషయాలను నేర్పే విధంగా, సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయని వెంకయ్యనాయుడు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, ప్రత్యేక అతిథి కొడాలి శేషాద్రి, అకడమిక్ హెడ్ రమా, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, వైస్‌ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇగ్నో దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో 2025 జనవరి నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పీజీ, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లమో, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 31వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడవ సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు, రీ రిజిస్ట్రేషన్ ఫీజును జనవరి 31వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా దర్శించి కాని లేదా 0866-2565253 ఫోన్‌లోగాని తెలుసుకోవచ్చన్నారు.

శభాష్.. ఆల్ ద బెస్ట్

(5వ పేజీ తరువాయి)

విద్యార్థినుల ప్రతిభను గుర్తించి..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌ను నిర్వహించారు. అదే విధంగా నున్న జెడ్పీ పాఠశాలలో జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఆ సమయంలో పలువురు విద్యార్థినులతో మాట్లాడిన లక్ష్మీశ ఈ విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించారు. చురుగ్గా ఉండటం.. బెరుకు లేకుండా మాట్లాడుతుండటంతో వారికి స్వర్ణాంధ్ర కార్యక్రమంలో స్టాల్‌ను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. విద్యార్థినులకు ఉపాధ్యాయులు సూరపనేని రవిప్రసాద్, పి.నాగేశ్వరరావు, సుబ్బారావు దిశానిర్దేశం చేసి స్టాల్ ఏర్పాటులో భాగస్వాములయ్యారు.



పాడైన న్యూకోన డ్రెయినేజీ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు



పొలాలను ముంచేస్తున్న..
ఉప్పు నీరు!

» కోన-వాడపాలెం గ్రామాల వద్ద కొట్టుకుపోయిన స్లూయిస్ గేట్లు
» ఖరీఫ్‌లో రెండుసార్లు వరినాట్లు వేసిన తీరప్రాంత రైతులు
» గేట్లు పాడవడంతో 12 గ్రామాల్లోని పంట పొలాలకు పొంచి ఉన్న ముప్పు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

బందరు తీరప్రాంత గ్రామాల రైతులను న్యూకోన డ్రెయినేజీ నష్టాలపాలు చేస్తోంది. కోన-వాడపాలెం గ్రామాల మధ్య కరకట్ట కింద ఉన్న రెండు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు కొట్టుకుపోవడంతోపాటు ఈ డ్రెయిన్ ఏళ్లతరబడి కనీస మరమ్మతులు లేక పూడుకుపోయింది. దీంతో సముద్రపునీరు పంటపొలాల్లోకి చొచ్చుకువస్తోంది. వరిపొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకురావడం, భారీ వర్షాలు కురిసిన సమయంలో రోజులతరబడి పంటపొలాలు నీటమునిగి పైరు చనిపోతోంది. రైతులు ఏడాదిలో రెండుసార్లుగా వరినాట్లు వేస్తున్నారు. 12 గ్రామాల రైతులు నాట్లు వేయడం, ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకు వచ్చి వరిపైరు చనిపోవడం ఆనవాయితీగా మారింది.

న్యూకోన డ్రెయినేజీ పరిస్థితి ఇదీ..

భోగిరెడ్డిపల్లి వద్ద న్యూకోన డ్రెయినేజీ ప్రారంభమవుతుంది. నెలకుర్రుగొల్లపాలెం, తుమ్మలచెరువు, తుమ్మలపాలెం, చిన్నాపురం, కోన, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, కొత్తపల్లె తుమ్మలపాలెం, వెంకటదుర్గాంబపురం, పెదయాదర. కమ్మవారిచెరువు గ్రామాల్లోని మురుగునీటిని సముద్రంలో కలిపే డేగలకోడు, మంగల్లంకకోడు, మధ్యకాలువ డ్రెయినేజీలను కలుపుకుని కోన-వాడపాలెంగ్రామాల మధ్య సముద్రపు కరకట్ట వద్ద అవుట్ ఫాల్ స్లూయిస్‌లద్వారా మురుగునీటిని సముద్రానికి అనుబంధంగా ఉన్న శింకులో కలుపుతుంది. కోన-వాడపాలెం గ్రామాల మధ్య కరకట్ట కింద ఆరుఖానాలతో న్యూకోనడ్రెయిన్‌కు పాత అవుట్‌ఫాల్ స్లూయిస్ ఉంది. ఏడేళ్ల క్రితం కరకట్టను నూతనంగా నిర్మాణం చేసే సమయంలో పాతఅవుట్‌ఫాల్ స్లూయిస్‌ను యథాతథంగా ఉంచి, దానిపక్కనే నూతన అవుట్ ఫాల్ స్లూయిస్‌ను నిర్మాణం చేశారు. పాత అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు ఎప్పుడో కొట్టుకుపోగా, నూతనంగా నిర్మాణం చేసిన అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లు పాడై కొట్టుకుపోయాయి. దీంతో ఈ రెండింటినుంచి పొలాల్లోని మురుగునీరు ఎంత వేగంగా సముద్రంలో కలుస్తుందో, సముద్రపుపోటు సమయంలో అంతే వేగంగా ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకువస్తోంది.

ఈ ఏడాది 2,500 ఎకరాల్లో రెండుసార్లు వరినాట్లు వేసిన రైతులు

న్యూకోన డ్రెయినేజీ పరిధిలోని 12 గ్రామాల రైతులు 2,500ఎకరాల్లో ఈ ఏడాది మొదటిసారి నాట్లు వేయగా ఉప్పునీరు, మురుగునీరు పొలాలను ముంచెత్తడంతో వరిపైరు చనిపోయింది. దీంతో రెండోసారి నాట్లు వేశారు. ప్రస్తుతం ఈ డ్రెయినేజీ పరిధిలోని అధికశాతం పొలాల్లోని వరిపైరు పొట్టదశలో ఉంది. జనవరి నెలాఖరుకు గాని పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. రెండు సార్లుగా వరినాట్లు వేయడంతో కనీసంగా కోటి రూపాయలకుపైగా ఖర్చుచేయాల్సి వచ్చిందని తీరప్రాంతగ్రామాల రైతులు చెబుతున్నారు. గత నాలుగేళ్లుగా న్యూకోన డ్రెయిన్ ఉప్పునీరు, లేదా మురుగునీటి బారిన పడి వరిపైరు చనిపోతోందని రైతులు అంటున్నారు.

పాత అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను మూసివేయాలి

న్యూకోన డ్రెయినేజీకి కోన-వాడపాలెం గ్రామాల మధ్య ఉన్న పాత అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలావస్థకు చేరిందని, దీనిని పూర్తిగా మూసివేయాలని రైతులు కోరుతున్నారు, కొత్త అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు ఉన్న ఆరు ఖానాలకు అమర్చిన గేట్లు కొట్టుకుపోయాయని, నూతన గేట్లు ఏర్పాటు చేస్తేనే సముద్రపుపోటు సమయంలో ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకురాకుండా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ విషయంపై పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ అవుట్‌ఫాల్‌స్లూయిస్‌లను పరిశీలించి ఈ వేసవిలో గేట్లు అమర్చి, సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వైభవంగా డోకిపర్రు వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జిల్లా అధికారులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గుడ్లవల్లేరు, డిసెంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ఉత్సవమూర్తులకు విశేష స్నపన, తిరుమంజన సేవలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు పి.వీ రారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌లు డోకిపర్రు ఆలయం, గెస్ట్ హౌస్, హెలీపాడ్‌లను పరిశీలించారు. ఏర్పాట్లపై నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా అధికారుల బృందాన్ని ఆలయ నిర్వాహకులు బాపిరెడ్డి సన్మానించారు. కలెక్టర్ బాలాజీతో పాటు జేసీ గీతాంజలీ శర్మ, వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గీతాబాయి, డీఆర్వో శ్రీదేవి, ఇన్‌చార్జ్ ఆర్డీవో వి.ఎస్ హెలా షారోన్ పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు

గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్, రామోజీ పేరు పెట్టాలి

» ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతి

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్-రామోజీ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయాలని విమానాశ్రయ ఎయిర్‌పోర్టు అడ్వయిజర్ కమిటీ వైస్‌చైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు జి.దీక్షా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీని దీక్షాప్రసాద్ కలిసి వినతి పత్రం అందజేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, అదేవిధంగా తెలుగు జర్నలిజానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన 'ఈనాడు' అధినేత చెరుకూరి రామోజీరావు పేరును కలిపి గన్నవరం విమానాశ్రయానికి పెట్టాలని ఇటీవల ఒక తీర్మానం చేసినట్టు ఎంపీకి ఆయన వివరించారు. ప్రతిపాదనపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతి పత్రం అందచేసినట్టు తెలిపారు.

నగరంలో ట్రాఫికర్

(5వ పేజీ తరువాయి)

రహదారులపై సాగించారు. దీనితో జాతీయ రహదారికి రెండు వైపుల ఉన్న సర్వీసు రహదారులు, కృష్ణవేణి రోడ్డు, రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్, కృష్ణలంక సర్వీసు మార్గాల్లో వాహనాలు నత్తనడకన సాగాయి. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోల్లో ఎంజీ రోడ్డులో ప్రయాణాలు సాగించే వారు జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది. బందరు రోడ్డు నుంచి పీసీఆర్ కూడలి వరకు ఆటోలు వెళ్తాయి. వాటిలో నిత్యం వందలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. ఎంజీ రోడ్డులోకి ఆటోలను సాయంత్రం వరకు అనుమతించలేదు. దీనితో ఎన్టీఆర్ సర్కిల్ వైపు నుంచి పీసీఆర్ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులను బెంజ్ సర్కిల్ వద్ద దింపేశారు. వారు అక్కడి నుంచి కనకదుర్గ వారధి వరకు ఆటోల్లో వెళ్లాల్సి వచ్చింది. మొత్తంగా ఇతర జిల్లాల నుంచి వాహనాలతో నగరంలో ట్రాఫిక్ రద్దీ వాహనాలను ఇబ్బందులు పెట్టింది.

సమస్యలు పరిష్కరించండి

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) పీఎఫ్ ట్రస్టులో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ అగ్రనాయకత్వం శుక్రవారం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వైశ్రీనివాసరావులు ఆయనకు ఒక లేఖను అందజేశారు. రివైజ్డ్ పేస్కేల్స్-2013 ప్రకారం ఉద్యోగి నుంచి రికవరీ చేసిన వేతన వివరాలను ఈపీఎఫ్ఓకు పంపి ఉద్యోగుల పెన్షన్ మంజూరులో తగ్గుదల లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని, చోరీసొత్తును కొనుగోలు చేసిన మరో వ్యక్తిని విశాఖపట్నంలోని గాజువాక క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. క్రైం డీసీపీ కె.లతామాధురి తెలిపిన వివరాలిలావున్నాయి. గాజువాక సింహగిరి కాలనీలోని పి.కుసుమకుమారి ఇంట్లో ఈ నెల 5న 20 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, నిందితుడు వినియోగించిన ద్విచక్రవాహనం ఆధారంగా దర్యాప్తు చేయగా కృష్ణా జిల్లా గుడివాడ జగనన్న కాలనీకి చెందిన పాత నేరస్థుడు ముద్దాని జగదీష్ అలియస్ జగన్ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శుక్రవారం గాజువాక బీసీ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగదీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్టు అంగీకరించాడు. పోలీసులు జగదీష్, చోరీ సొత్తును కొనుగోలు చేసిన జ్యోతిశివశ్రీని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 25.7 తులాల బంగారు ఆభరణాలు, 50.5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే 14 కేసులున్నాయని, గుడివాడ వన్‌టౌన్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటుందని, పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ లతామాధురి

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయని, వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి నిలిపి పరిష్కరించాల్సిందిగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుకు ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు శుక్రవారం లేఖ రాశారు. రెండు దశాబ్దాలుగా ఆర్టీసీలో మహిళల సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని తెలిపారు. గృహాలలో టాయ్‌లెట్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయని, సంస్థలో పనిచేసే మహిళలకు మాత్రం టాయ్‌లెట్స్ కరువయ్యాయని చెప్పారు. బస్‌స్టేషన్, టెర్మినల్ పాయింట్స్‌లో మహిళల కోసం ప్రత్యేక టాయ్‌లెట్స్ నిర్మాణానికి పూనుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. డిపోలు, స్టేషన్ల దగ్గర మంచినీటి సదుపాయం లేకపోవటం వల్ల మహిళలు కిడ్నీ, లివర్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులు ఎక్కువగా క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలతో బాధ పడుతున్నారని చెప్పారు. సంస్థలో మహిళా సిబ్బంది రిక్రూట్‌మెంట్ జరిగి 28 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ చాలా డిపోలలో రెస్ట్‌రూమ్స్, సరిపడా బెడ్స్, రెస్ట్ రూమ్ అటాచ్డ్ టాయ్‌లెట్స్ వంటివి లేవన్నారు. మహిళలకు ఉన్న ఇబ్బందుల రీత్యా డిపోలలో వారికి ప్రత్యేక డ్యూటీలు విధించాల్సిందిగా అభ్యర్థించారు. మహిళా సిబ్బంది డ్యూటీలో ఉన్నపుడు బస్సు మధ్యలో ఆగిపోతే వారిని అక్కడే ఉంచకుండా డిపోలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవులను అమలు చేయాలని కోరారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 5 క్యాజువల్ లీవులు, ప్రత్యేక సెలవులు, ప్రతి నెలా 3 రోజుల లీవు సదుపాయం వంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీజీపీఎస్ రోవర్లు!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భూముల సర్వేకు సంబంధించి ఖచ్చితత్వంతో కూడిన నివేదికలను ఇచ్చేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు అత్యంత సాంకేతిక వ్యవస్థలైన డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్) రోవర్స్ సేవలు పొందున్నారు. భూముల సర్వే వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వ సర్వేయర్ల మీదనే ఆధారపడకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా కూడా సేవలను పొందవచ్చు. సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ సర్వేయర్లు రావటానికి నెల రోజులకు పైగా సమయం పడుతుంది. సర్వేయర్లపై పనిభారం ఒకటైతే.. నిత్యం క్షేత్రస్థాయిలో తిరగాల్సి ఉంటుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందబాటులో ఉన్నా ఖచ్చితత్వం ఉండదన్న అపోహలతో వారిని ఆశ్రయించటానికి చాలామంది సంకోచిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఎవరు నివేదికలు ఇచ్చినా ఖచ్చితత్వంగానే ఉంటాయి. శాటిలైట్ ఆధారితంగా పనిచేసే డీజీపీఎస్ రోవర్ యంత్రాలు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అస్త్రాలుగా మారాయి. డీజీపీఎస్ రోవర్ల ద్వారా టోపో సర్వే, కాంటూర్ సర్వే, రోడ్ సర్వే, కెనాల్ సర్వే, రైల్వే సర్వే, ఇంటి లే అవుట్ ప్లాట్ మార్కింగ్, ఫీల్డ్/సరిహద్దు సర్వే, ఎలివేషన్స్ లెవల్స్ సర్వే, నేలపై డ్రాయింగ్, మెరక మార్కింగ్ వంటి పనులు చేపడతారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

» కలెక్టరేట్ వద్ద వైసీపీ నేతల ఆందోళన

మచిలీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యంకు మద్దతు ధర కల్పించాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసీపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్ వద్ద రైతులను ఆదుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధరను కల్పించాలని, ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థను తొలగించాలని, రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు అందించాలని, తేమశాతం లెక్కలు చూపి రైతులను ఇబ్బందులపాలు చేయడం మానుకోవాలని ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వహయాంలో 22-ఏలో ఉన్న భూములను రైతులకు పట్టాలు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 22-ఏ భూములకు పట్టాలుఇచ్చే అంశాన్ని పక్కనపెట్టిందన్నారు. గత ఏడాది డిసెంబరునెలలో మించౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలకు ధాన్యం తడిసి, పాడైనా, వైసీపీప్రభుత్వం కొనుగోలుచేసి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకుందన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ, కూటమిప్రభుత్వం ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందన్నారు. ధాన్యంలో తేమశాతంను సాకుగాచూపి మద్దతుధరలో కోతపెడుతోందన్నారు. దళారులు నిర్ణయించిన ధరకే రైతులు ధాన్యం విక్రయించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో పెడన వైసీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము, పెనమలూరు వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ గేటువద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ధాన్యంకు గిట్టుబాటుధర కల్పించాలని, కొనుగోలులో నిబంధనలను సడలించాలని కోరుతూ డీఆర్వో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.



ధర్నాచౌక్ వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పెద్ద స్కెచ్చే వేశారు!?

(5వ పేజీ తరువాయి)

సూపర్ వైజేషన్ చార్జీల కింద ల్యాంకోకు చెల్లించాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ల్యాంకోకు ఎన్‌హెచ్ రూ.45 లక్షలు చెల్లింపు వ్యవహారాలపైనా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో కూడా ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు, ల్యాంకో మధ్యన వాటాల డీల్ కుదిరిందని రైతులు ఆరోపిస్తున్నారు.

టవర్ స్క్రాప్ మెటీరియల్ తరుగు చూపకపోవడంలోనూ వాటాలు?

ల్యాంకో పవర్ ప్లాంట్ మూత పడక ముందు .. ఆ సంస్థ తరఫున ట్రాన్స్ మిషన్ టవర్లను మార్చటానికి రూ.32.58 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించి ఎన్‌హెచ్‌కు ఇచ్చింది. విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అలైన్‌మెంట్ తయారు చేసి రూ. 32.58 కోట్ల అంచనాలను రూపొందించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ ఆ ప్రతిపాదనే నిజమనుకున్నా.. ఇందులో ఇంకో తప్పు జరిగింది. వాస్తవానికి మెటీరియల్ స్క్రాప్‌ను ఈ అంచనాలో తీసి వేయాలి. ఇదే విజయవాడ బైపాస్ వెంబడి ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి రూ. 3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు మెటీరియల్ స్క్రాప్‌గా చూపారు. ల్యాంకోకు సంబంధించి రూ. 32.58 కోట్ల వ్యయంతో చేపడుతున్న 11 ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి రూ.10 కోట్ల పైనే టవర్ల స్క్రాప్ కింద చూపించాల్సి ఉంటుందన్నది అంచనా. టవర్ల స్క్రాప్ మెటీరియల్ తరుగు చూపించకపోవటం వెనుక కూడా ల్యాంకో, ఎన్‌హెచ్ ఆర్వో కార్యాలయ ఉన్నతాధికారుల నడుమ వాటాల డీల్ కుదిరిందని రైతులు ఆరోపణలు చేస్తున్నారు.

1000 మెగావాట్లా ? 350 మెగా వాట్లా ?

మూత పడక ముందు ల్యాంకో పవర్ ప్లాంట్ లిమిటెడ్ సామర్థ్యం 1000 మెగా వాట్లుగా ఉంది. మూతపడ్డాక.. రెండు యూనిట్లలోని మెషినరీ స్క్రాప్‌గా తరలి వెళ్లిపోయిన తర్వాత మిగిలిన ఒక యూనిట్ సామర్థ్యం 1000 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయగలదా అన్నది ప్రశ్నగా ఉంది. ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి ద్వారా 1000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవాంతరం ఏర్పడటం వల్ల రూ.12 కోట్లు డ్యామేజీ చార్జీల కింద చెల్లించాలని ల్యాంకో తరఫున ఎన్‌హెచ్‌కు ప్రతిపాదించటం జరిగింది. ల్యాంకో అసలు యాజమాన్యం ఇది ప్రతిపాదించిందా ? ఇందులో ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాథా టీఎంటీ సౌజన్యంతో ప్రతిపాదించారా అన్నది తేలాల్సి ఉంది. ఇందులో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. మిగిలిన ఒక యూనిట్‌లో 350 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తామని కేంద్రానికి ల్యాంకో తరఫున ప్రతిపాదించటం జరిగింది. కేంద్రానికి రాసిన లేఖలో 350 మెగావాట్లను ప్రతిపాదించి.. 1000 మెగా వాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం పేరుతో రూ. 12 కోట్లు డిమాండ్ చేయటం చూస్తే ఈ వ్యవహారంలో ఏదో కిరికిరి ఉందనిపిస్తోంది.



నేడు దుర్గగుడిలో కలశజ్యోతి ఉత్సవం

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21నుంచి ప్రారంభం కానున్న భవానీ దీక్షల విరమణలను పురస్కరించుకుని దేవస్థానంలో శనివారం కలశ జ్యోతి ఉత్సవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5.45 గంటలకు సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రం వద్ద నుంచి భవానీ భక్తుల కలశ జ్యోతి ఉత్సవ ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. బీఆర్టీఎస్ రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, అలంకార్ సెంటర్, బీసెంట్ రోడ్డు, ఏలూరు రోడ్డు, పాతబస్టాండ్, బందరు రోడ్డు, కంట్రోల్ రూమ్, ఫ్లై ఓవర్, కెనాల్‌రోడ్డు, వినాయకుడి గుడి, రథం సెంటర్ మీదుగా కొండ మీదకు చేరుకుంటుందని తెలిపారు.

అసాంఘిక శక్తులకు అడ్డాగా.. బెంజిసర్కిల్ ఫుట్‌బ్రిడ్జి

- మందుబాబులకు స్థావరం
- విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్న ఆకతాయిలు
- ఫుట్‌బ్రిడ్జి కనపడకుండా బ్యానర్లు ఏర్పాటు

(పటమట- ఆంధ్రజ్యోతి)

బెంజిసర్కిల్ వద్ద సర్వోత్తమ గ్రంథాలయం నుంచి పటమటలంకకు వెళ్లే ప్రధాన రహదారిని కలుపుతూ నిర్మించిన ఫుట్‌బ్రిడ్జి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సుమారు పదేళ్ల క్రితం బెంజిసర్కిల్ వద్ద గల సర్వోత్తమ గ్రంథాలయం నుంచి పటమటలంకకు వెళ్లే ప్రధాన రహదారిని కలుపుతూ వీఎంసీ అధికారులు ఒక ఫుట్‌బ్రిడ్జిని నిర్మించారు. ఈ ప్రాంతం రద్దీ ప్రదేశం కనుక పాదచారులు రోడ్డు దాటటానికి ఈ ఫుట్‌బ్రిడ్జి ఉపయోగపడుతుంది. సర్వోత్తమ గ్రంథాలయం నుంచి పాఠకులు రోడ్డు దాటటానికి వీలుగా ఈ ఫుట్‌బ్రిడ్జి ఉంది. ఈ ఫుట్‌బ్రిడ్జి నిర్మాణానికి సర్వోత్తమ గ్రంథాలయం తమ భూమిని కొంత ఉదారంగా ఇచ్చారు. పలు కళాశాలలు విద్యార్థులు ఈ ఫుట్‌బ్రిడ్జ్‌మీద నుంచి నడుచుకుంటూ బందరురోడ్డులోని బస్టాప్‌కు చేరుకుంటారు. రాజకీయ నాయకుల అభిమానులు తమ నాయకుల ప్రమాణ స్వీకారాలకు, పుట్టినరోజు వేడుకలకు, పండుగలకు వారిని అభినందిస్తూ పెద్ద పెద్ద బ్యానర్లను ఫుట్‌బ్రిడ్జికి ఇరువైపులా కడుతున్నారు. ఫుట్‌బ్రిడ్జ్ మీద ఇక ఏం జరిగినా ఎవరికి కనబడదు. దీన్ని అవకాశంగా తీసుకుని కళాశాలల నుంచి వచ్చే విద్యార్థినులను కొందరు ఆకతాయిలు ర్యాగింగ్ చేస్తున్నారు. మూడు రోజుల క్రితం విద్యార్థినులను ఒక ఆగంతుకుడు బెదిరించడంతో వారు సర్వోత్తమ గ్రంథాలయంలోకి వెళ్లి తలదాచుకున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు ఇక్కడ యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. ఈ ప్రదేశాన్ని యువతీ, యువకులు అసాంఘి కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు. రాత్రి వేళల్లో పోలీస్ సిబ్బంది ఇక్కడ గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



బెంజిసర్కిల్ వద్ద ఫుట్‌బ్రిడ్జికి కట్టిన బ్యానర్లు

రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు



ఫుట్‌బ్రిడ్జిపై రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కళాశాలల విద్యార్థినులు ఫుట్‌బ్రిడ్జి మీద నడవాలంటే భయపడుతున్నారు. పోలీస్ సిబ్బంది ఇక్కడ నిఘా పెడితే పరిస్థితులు చక్కబడతాయి.

- మోతుకూరి అరుణ్‌కుమార్, స్థానికుడు

గ్రంథాలయాల పునర్వికాసానికి మరో ఉద్యమం ప్రారంభం నేడు

ఆటోనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పునర్వికాసానికి మరో ఉద్యమం శనివారం నుంచి ప్రారంభమవుతోందని గ్రంథాలయ పునర్వికాసా ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ తెలిపారు. శనివారం విజయవాడలోని తెలుగు తల్లి విగ్రహం నుంచి గవర్నర్‌పేటలోని లెనిన్ విగ్రహం వరకు ప్రదర్శన అనంతరం సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. స్వతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గ్రంథాలయాలు రోజురోజుకు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి నిధులను కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రచయితలు, పుస్తక ప్రియులు, విద్యావేత్తలు గ్రంథాలయ అభిమానులు, రచయిత సంఘాల నేతలు హాజరవుతారని తెలిపారు.

మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటులో నిర్లక్ష్యం



భారతీనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలనీ పెద్దలు, కార్పొరేషన్ సహకారంతో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఇటీవల నాల్గో డివిజన్ పరిధిలోని ఫిలింకాలనీలోని మెయిన్, అంతర్గత రోడ్లలో మొక్కలు నాటారు. ఈ మొక్కలకు రక్షణగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫెన్సింగ్‌ను సరిగా ఏర్పాటు చేయకపోవడంతో మొక్కలపై పడుతున్నాయి. దీంతో మొక్కలు నాశనం అయిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్టేడియం వద్ద డీజీపీ ప్రత్యేక పర్యవేక్షణ

గుణదల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యక్రమంలో ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బందోబస్తును స్వయంగా పరిశీలించారు. సభా వేదిక వద్దకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎవరికి కేటాయించిన సీట్లలో వారు కూర్చునే విధంగా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. మహాత్మాగాంధీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పాల్కాన్ వాహనం ద్వారా బందోబస్తును పర్యవేక్షించారు. అదే సమయంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి సిబ్బందితో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఎప్పటికప్పుడు సిబ్బందిని చైతన్యం చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం పట్ల డీజీపీ సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతంగా జరగడానికి పోలీసు సిబ్బంది ఎంతగానో కృషి చేశారని డీజీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ తోపాటు సీపీ రాజశేఖరబాబు, ఐజీలు అశోక్ కుమార్, రవి ప్రకాష్, డీఐజీలు గోపీనాథ్, సి.హెచ్.విజయరావు, కమాండెంట్ కె.వి .మురళీకృష్ణ, మల్లికా గార్గ్ పాల్గొన్నారు.



బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు



సభావేదికను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

హోరాహోరీగా జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న నాదెళ్ల బసవ పూర్ణయ్య(ఎన్‌బీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తమిళనాడు క్రీడాప్రాధికార సంస్థ, జీఈపీఏఐఆర్ యూనివర్సిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ యూనివర్సిటీ జట్లు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో తలపడతున్న విషయం తెల్సిందే. శుక్రవారం సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పలు మ్యాచ్‌లు జరిగాయి. జేఈపీఏఐఆర్ యూనివర్సిటీ- వైకేఆర్ జట్ల మధ్య మ్యాచ్‌ను ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తమ్, విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే, జాతీయ మాజీ నేషనల్ ప్లేయర్ గణబాబు, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, టీడీపీ నేత వర్ల రామయ్యలు ప్రారంభించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మజీరావు, వీఆర్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, సిద్ధార్థ విద్యాసంస్థల సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు, ఎంవీ రవిచంద్ పాల్గొన్నారు.



టీమ్‌లతో ఏపీవోఏ అధ్యక్షుడు పురుషోత్తమ్, ఎమ్మెల్యేలు గణబాబు, కుమార్ రాజా

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- ట్రాఫిక్‌కు అంతరాయం

ఆటోనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంటకాల్వ రోడ్డు నుంచి ఆటోనగర్ వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్ఫా హోటల్, ఎస్‌వీడీ వైన్‌షాపు వద్ద ద్విచక్ర వాహనాలను రోడ్డుపైన నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. టీ తాగడానికి అని కొంతమంది, మందు కోసం మరి కొంత మంది తమ వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో అటుగా వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. ఇటు ట్రాఫిక్ సిబ్బంది, పటమట స్టేషన్ సిబ్బంది కన్నెత్తి చూసిన పాపానపోలేదు. వాహనాలు నిలపకుండా కట్టడి చేస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపారులు పోలీసులకు ఎంతో కొంత ముట్టచెపుతున్నారనిస్థానికులు అంటున్నారు. రహదారి ఆక్రమణ తొలగిస్తున్న పోలీసులు రాత్రిపూట చేసే వ్యాపారుల వద్ద కూడా ట్రాఫిక్ నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.



అల్ఫా హోటల్ సమీపంలో రహదారిపైనే వాహనాలు



ఖోఖో క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

ఖోఖోలో పీబీ సిద్ధార్థకు రన్నరప్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాలలో టీఎస్ఆర్ అండ్ ఈఆర్ఆర్ జీడీసీ పామర్రు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఖోఖో పురుషుల టోర్నీలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల టీమ్ రన్నరప్ సాధించింది. ఈ పోటీల్లో సత్తా చాటిన ముగ్గురు క్రీడాకారులు బి. పవన్, బి మణికంఠ, పి. అభిషేక్‌లు కృష్ణా యూనివర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు అభినందించారు.

దర్గా సందర్శకులకు నిత్యాన్నదానం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపాలిటీలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబు ఖారిబాబా ఆస్థానంలోని నిత్యాన్నదాన లంగర్‌ఖానాలో గత 17 ఏళ్లుగా నిత్యాన్నదానం చేస్తున్నామని లంగర్‌ఖానా నిర్వాహకులు అల్తాఫ్ బాబా చెప్పారు. శుక్రవారం పుణ్యక్షేత్ర దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా దర్గా దర్శనానికి భక్తులు శుక్రవారం వేల సంఖ్యలో వస్తుంటారన్నారు. ప్రతి రోజూ 100 నుంచి 200 మంది భక్తులకు అన్నదానం చేస్తామని చెప్పారు. జనవరి 10,11 తేదీల్లో నిర్వహించే ఉరుసు మహోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని, లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి భోజనం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

శ్రీవాహినిలో ఫిట్ ఇండియా పోటీలు

తిరువూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు ఫిట్ ఇండియా క్రీడాపోటీలు నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, ఎన్టీఆర్ జిల్లా నెహ్రూయువకేంద్రం, వాహిని కాలేజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, షటిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కాలేజీ ఎన్ఎస్ ఎస్ అధికారి ప్రసాద్, పీడీ సురేష్‌లు బహుమతులు అందించారు.

అలరించిన కూచిపూడి నృత్యం

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదికపై శాంతినగర్, పైపులరోడ్డుకి చెందిన రాజరాజేశ్వరి నృత్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఏకదంతాయా, అదిగో అల్లదిగో, జతికశబ్దం, గురుబ్రహ్మ, అలివేలు మంగ, కృష్ణ కలాపం, రాధా సమేత తదితర కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. 25 మంది కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అలరించారు. ఆలయ డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులను అభినందించి వారికి ప్రశంసాపత్రం, ప్రసాదం అందజేశారు.



అన్నిదానాల్లో అన్నదానం మిన్న

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనురాధ

పటమట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పేర్కొన్నారు. గత 45 రోజుల నుంచి అయ్యప్పనగర్‌లో శ్రీ అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో అయ్యప్పలకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ, యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్‌లు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి సేవ చేసిన వారికి కమిటీ అందించిన నూతన వస్త్రాలను గద్దె అనురాధ చేతుల మీదుగా అందజేశారు. గద్దె అనురాధ మాట్లాడుతూ అయ్యప్పనగర్ పేరును సార్థకం చేస్తూ గత 21ఏళ్ల నుంచి అయ్యప్ప భజనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు గురుస్వామి శాయన సత్యనారాయణ, గద్దె హేమాన్షు, డోకుపర్తి ఉమామహేశ్వరరావు, డోకుపర్తి యుగంధర్, జోగి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చలసాని రమణలు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గద్దె అనురాధ, గురుస్వామి సత్యనారాయణ

నందీశ్వర స్వామికి అభిషేకార్చనలు



విజయవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోషకాలంలో శ్రీ మహానందీశ్వర స్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షించారు. శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ సంగా నరసింహారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.భవానీ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

విజయవాడ: బందరు కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు శుక్రవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసు స్టేషన్ పరిధిలోని ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న బందరు కాల్వలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 55 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఒంటిపై ఎరుపు, కాఫీ రంగుల చొక్కా, బ్లాక్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్





స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా వేదికపై కూచిపూడి నృత్యం, తప్పెటగుళ్ల ప్రదర్శన



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మామిడికాయలు అందజేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

'స్వర్ణాంధ్ర' డాక్యుమెంట్ ఆవిష్కరణలో

సాంస్కృతిక సందడి

వన్‌టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వ బాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. గణపతి వందనం కూచిపూడి నృత్యంతో ప్రారంభమైన సాంస్కృతిక ప్రదర్శనలు 2 గంటల సేపు అలరించాయి. రమణ, రాజేష్‌ల బృందం విజన్-2047పై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయం ప్రధాన అంశంగా పదిమంది నృత్య కళాకారులు చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. బాబూరావు చేసిన మిమిక్రీ ప్రేక్షకుల హర్షధ్వానాలను అందుకుంది. ఏసుప్రసాద్ బృందం గరగ నృత్యం ఆకట్టుకుంది. రాజీవ్ బృందం డప్పుల ప్రదర్శన విశేష స్పందనను పొందింది. హాస్యవల్లరి కార్యక్రమంలో హరిబాబు బృందం ప్రేక్షకులను నవ్వించింది. దేవీ బృందం బుర్రకథ, సత్యరాజ్ బృందం తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి. ప్రాచీన కళారూపాలను కళ్లకు కట్టినట్టు గుర్తుచేశాయి. హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, ఎనికేపాడు విజ్ఞాన విహార్ హైస్కూల్ చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభకు వచ్చిన వారందరినీ ఆకట్టుకున్నాయి.



సంతకం చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



వాటర్ ట్యాంకు రోడ్డులో నుంచి ఐజీఎం స్టేడియానికి తరలివస్తున్న ప్రజలు



గన్నవరం భువనేశ్వరీ పీఠంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ధార్మిక మార్గాన్ని అనుసరిస్తేనే

మంచి సమాజ నిర్మాణం

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత సమాజంలో పాశ్చాత్య అనుకరణ, భోగలాలస పెరుగుతోంది. ఫలితంగా అశాంతి నెలకొంటోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలన్నా, మంచి సమాజం సాధ్యం నిర్మితమవ్వాలన్నా ప్రజలు ధార్మిక మార్గాన్ని అనుసరించాలి.' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న సచిదానంద ఆశ్రమంలోని భువనేశ్వరీ పీఠా న్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భువనేశ్వరీ పీఠం విశిష్టతను పీఠాధిపతి కమలానంద భారతీస్వామి వివరించారు. పూజల అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడారు. క్రమశిక్షణ, దైవభక్తి, మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలితో మంచి సమాజం నిర్మితమవుతుందని, కుటుంబాలు శక్తిమంతం కావడం ద్వారా సమాజం, దేశం శక్తిమంతమవుతాయని ఆయన పేర్కొన్నారు. భువనేశ్వరీ పీఠం ఆశ్రమానికి తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ నుంచి రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. కమలానంద భారతీ స్వామి అనుగ్రహభాషణ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

» యువతకు వెంకయ్యనాయుడు సూచన

ఉంగుటూరు: మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు తెలుగురాష్ట్రాల్లో పెద్ద సమస్యగా పరిణమించాయని, వాటికి యువత దూరంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఆత్కూరు స్వర్ణ భారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత్‌ను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో పాకిస్థాన్ మనదేశంలోకి సరిహద్దుల వెంబడి మాదక ద్రవ్యాలను చొప్పిస్తోందన్నారు. పాకిస్తాన్ దుశ్చర్యతో పంజాబ్ మాదకద్రవ్యాల ప్రభావానికి గురైందన్నారు. క్రమంగా ఇతర రాష్ట్రాలకు ఈ భూతం వ్యాపిస్తోందన్నారు. ఎన్‌ఆర్‌ఐ నిమ్మగడ్డ రవి, ట్రస్ట్ ప్రతినిధులు, వివిధ శిక్షణ కేంద్రాల డైరెక్టర్లు, శిక్షణార్థులు పాల్గొన్నారు.



గన్నవరం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తా

» గన్నవరం సీహెచ్‌సీ కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన సీహెచ్‌సీ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్టుకు దగ్గరలో ఉన్న ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడానని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు. సీహెచ్‌సీలో తక్షణమే మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు చేయాలని ఎంపీడీవో టి.స్వర్ణలతకు ఆయన సూచించారు. గన్నవరం పంచాయతీ నుంచి రూ.5 లక్షలు ఆస్పత్రికి ఇవ్వాలని సూచించారు. కేడీసీసీ బ్యాంకు సీజీఎఫ్ ఫండ్ నుంచి కొంత నగదు వచ్చేలా చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో మాట్లాడి సీహెచ్‌సీలో ఫర్నిచర్ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కమిటీ సభ్యులుగా దేవినేని సులోచన, బుస్సే నాగప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ శారమ్మ పాల్గొన్నారు.



ఇటీవల పటమట పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

జల్సాల కోసం

బైక్ చోరీలు

పొరుగు జిల్లాల నుంచి నగరానికి వస్తున్న నేరగాళ్లు

జల్సాల కోసం ఒకరు.. విలాసాల కోసం మరొకరు.. ప్రియురాళ్ల కోరికలను తీర్చడానికి ఇంకొకరు అన్నట్టుగా నేరగాళ్లు బైక్ చోరీల బాట పడుతున్నారు. సెంట్రల్ జోన్‌ను టార్గెట్ చేసుకుని, ఆ జోన్ పరిధిలో బైక్‌లు కనిపిస్తే చాలు మాయం చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి రెక్కీలు నిర్వహించుకుంటున్నారు. అనంతరం కంటికి కనిపించిన బైక్‌ను అక్కడి నుంచి మాయం చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను టార్గెట్ చేసుకుని నేరగాళ్లు వ్యవహారాలు నడుపుతున్నారు. విజయవాడలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువగా సెమీ కల్చర్ ఉండే ప్రాంతాలు ఉంటాయి. ఈ ప్రాంతాలను నేరగాళ్లు ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవల సీసీఎస్ పోలీసులు, పటమట పోలీసులు వాహనాల చోరీ కేసుల్లో కొంతమంది నిందితులను అరెస్టు చేశారు. వాళ్లంతా గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి చోరీలు చేసినట్టు గుర్తించారు.

(విజయవాడ/ఆటోనగర్, ఆంధ్రజ్యోతి): నగరంలో చాలా ప్రాంతాల్లో వాహనదారులు తమ వాహనాలను ఇంటి బయట నిలిపి ఉంచుతారు. వీధుల్లో ఇళ్లన్నీ పక్కన పక్కనే ఉండడం, ఇంటి లోపల పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వీధిలో వరుసగా ఇళ్ల ముందు వాహనాలను నిలుపుతారు. ఇక రైతుబజార్లు, శుభకార్యాలు జరిగినప్పుడు కల్యాణ మండపాల్లో ద్విచక్రవాహనాలు ఎక్కువగా ఉంటాయి. బజార్లకు వచ్చేవారు కొనుగోళ్ల హడావుడిలో, కల్యాణ మండపాల్లో శుభకార్యాలకు వెళ్లిన వారు కార్యక్రమాల సందడిలో ఉంటారు. ఇలాంటి ప్రాంతాలను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి బస్సుల్లో వచ్చిన నేరగాళ్లు పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉంటున్నారు. రాత్రి అక్కడే పడుకుని ఉదయం రెక్కీకి వెళ్తున్నారు. చోరీకి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాక వాహనాలను మాయం చేస్తున్నారు. వాహనాలకు నంబరు ప్లేట్లు మార్చి వేర్వేరు వ్యక్తులకు అమ్మేస్తున్నారు. ఒక్కో బైక్ నాలుగైదు చేతులు మారుతోంది. కొన్ని చోరీ కేసుల్లో సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను తీసుకెళ్లి పోలీసులకు అందజేస్తున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుటేజీల్లో స్పష్టత లేకపోవడంతో నిందితులను సరిగ్గా గుర్తించలేకపోతున్నామని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

గంజాయి విక్రయదారులకు బైక్‌లు ఇచ్చి..

నేరాల ద్వారా డబ్బులు సంపాదించి విలాసాలకు అలవాటు పడిన నేరగాళ్లు ఆ బాట నుంచి బయటకు రావడం లేదు. కొంతమంది నేరగాళ్లు బైక్‌లను నేరుగా ఉత్తరాంధ్రలోని మన్యం ప్రాంతానికి తీసుకెళ్తున్నారు. అక్కడ గంజాయి విక్రయించేవారికి ఈ బైక్‌లు ఇచ్చేసి గంజాయిని తెచ్చుకుంటారు. కొద్దినెలల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలో గంజాయి బ్యాచ్‌ను ఏరేసే క్రమంలో పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిసా సరిహద్దుల్లోని కొండ ప్రాంతాల్లో దొంగిలించిన బైక్‌లను తాకట్టు పెట్టారని, ఆ బైక్‌లను కొండల నుంచి కిందికి తీసుకురావడానికి నానాపాట్లు పడాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. ఒక్క సెంట్రల్ జోన్‌లోనే గడచిన ఏడాది 128 బైక్‌లు చోరీకాగా, ఈ ఏడాది 85 బైక్‌లు మాయమయ్యాయి.

చోరీల నియంత్రణకు ఏం చేయాలంటే..

- పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలి
- అన్ని పోలీస్‌స్టేషన్లలో క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలి.. జైళ్ల నుంచి వస్తున్న నేరగాళ్లపై నిరంతర నిఘా కొనసాగించాలి



గన్నవరం విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతున్న ముప్పాళ్ల సర్పంచ్ వీరమ్మ

రాష్ట్రపతి అవార్డుతో

బాధ్యత మరింత పెరిగింది

» ముప్పాళ్ల సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ

గన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవటంతో బాధ్యత మరింత పెరిగిందని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ అన్నారు. ముప్పాళ్ల గ్రామ పంచాయతీ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికవడంతో సర్పంచ్ వీరమ్మ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలో ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకుని శుక్రవారం ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. ఆమెకు గ్రామస్థులు స్వాగతం పలికారు. ఇప్పటికే తమ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని సర్పంచ్ వీరమ్మ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో పంచాయతీలు ఉన్నా, తమ పంచాయతీ ఎంపికవడం, అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. రూ.కోటి తమ పంచాయతీ ఖాతాలో జమయ్యాయని, మరిన్ని వసతులు గ్రామంలో కల్పిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు కల్పి స్తామని తెలిపారు. ఉపసర్పంచ్ నల్ల రవి, పంచాయితీ కార్యదర్శి సాయిరాం పాల్గొన్నారు.



భవానీలు వేచి ఉండేందుకు సిద్ధమవుతున్న షెడ్లు

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణలకు ఏర్పాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. భవానీలకు ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు, భద్రతా చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆలయ ప్రాంగణంతో పాటు, ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. భవానీలు వేచి ఉండేందుకు కనకదుర్గానగర్‌లో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భవానీల దీక్షల విరమణ సందర్భంగా కనకదుర్గానగర్, మహామండపం సమీపంలో మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తున్నారు. దుర్గాఘాట్, పద్మావతి ఘాట్, సీతమ్మవారి పాదాలు, తదితర ఘాట్లలో ప్రత్యేక షవర్లు ఏర్పాటు చేస్తున్నారు.

కనకదుర్గమ్మకు కానుకగా మంగళసూత్రాలు



కనకదుర్గమ్మ అలంకరణ నిమిత్తం 25 గ్రాముల బంగారు మంగళసూత్రాలను విశాఖపట్నం హెచ్‌బీ కాలనీకి చెందిన ఎ.వి.శ్రీనివాస్ కానుకగా అందజేశారు. శుక్రవారం ఆలయానికి కుటుంబసభ్యులతో కలిసి విచ్చేసి, అధికారులను కలిసి కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అధికారులు అందజేశారు. వేద పండితులు ఆశీస్సులు అందించారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ ఏర్పడింది. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. భక్తులు పలు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.



అథ్లెట్ లోకేశ్‌ను సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ కోటేశ్వరరావు

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

- అథ్లెట్ లోకేశ్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందన

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని, సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమని అథ్లెట్ లోకేశ్ విభిన్న ప్రతిభావంతుల యూత్ గేమ్స్-2024లో సత్తా చాటి నిరూపించాడని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. థాయ్‌లాండ్‌లో ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహించిన పోటీల్లో హైజంప్‌లో స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజతం సాధించిన లోకేశ్‌ను గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి శాప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అభినందించారు. లోకేశ్ భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. శాప్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పారా స్పోర్ట్సు క్రీడాకారులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి బాలుడి మృతి

విజయవాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కృష్ణానదిలో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. కృష్ణలంక భ్రమరాంబపురానికి చెందిన ముక్కాల మణికంఠ(14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి స్వర్ణపురి వైపు నుంచి కృష్ణానదిలోకి వెళ్లాడు. రిటైనింగ్ వాల్ పక్క నుంచి ఇసుకతిన్నెలు ఉండడంతో సరదాగా నడుచుకుంటూ అర కిలోమీటరు ముందుకు వెళ్లారు. అక్కడ నీరు ఉండడంతో స్నానం చేద్దామని నిర్ణయించుకున్నారు. మిగిలిన స్నేహితులు దిగకపోవడంతో మణికంఠ ఒక్కడే నీళ్లలో దిగాడు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో స్నేహితులు ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా మణికంఠ మునిగిపోయాడు. కృష్ణలంక పోలీసులు ఈతగాళ్లతో మణికంఠ మృతదేహాన్ని బయటకు తీయించారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి తల్లిదండ్రులు ముందుకు రాలేదు. తర్వాత పోలీసులు వారికి విషయాన్ని వివరించి ఫిర్యాదు తీసుకున్నారు.

విదర్భకు విజయం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ పర్యవేక్షణలో మూలపాడు వేదికగా నిరహించిన విజయ్ మర్చంట్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో జమ్మూ, కశ్మీర్‌పై విదర్భ టీమ్ 204 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. కర్ణాటక-ఝార్ఖండ్ మ్యాచ్ డ్రా అయ్యింది. విదర్భ-జమ్మూ, కశ్మీర్ మ్యాచ్‌లో విదర్భ టీమ్ 409/7 పరుగులు చేసింది. జమ్మూ, కశ్మీర్ టీమ్ తొలి ఇన్నింగ్స్‌లో 56కు ఆలౌటైంది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో పేలవమైన ఆటతో 149 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. విదర్భ బౌలర్ కుష్‌శర్మ 23.5 ఓవర్ల బౌలింగ్ చేసి 49 పరుగులిచ్చి ఏడు వికెట్లతో సత్తా చాటాడు. కర్ణాటక-ఝార్ఖండ్ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ కాగా, కర్ణాటక భారీ స్కోర్‌తో చివరి రోజున 441/4 పరుగుల వద్ద నిలవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ టోర్నీలో తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు 800కు పైగా పరుగులు చేయడంతో రెండో ఇన్నింగ్స్‌కు అవకాశం లేకుండా పోయింది. కర్ణాటక బ్యాటర్లు ధృవ్‌కృష్ణన్(122), అయాజ్‌గౌడ(104) సెంచరీలతో కదం తొక్కారు.



ఏడు వికెట్లు తీసిన విదర్భ బౌలర్ కుష్ శర్మ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 14 డిసెంబరు 2024

బానపొట్ట బాధిస్తోందా?

బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడంవల్ల పొట్ట గుండ్రంగా పెద్దగా కనిపిస్తుంది. దీనినే బానపొట్టగా పరిగణిస్తుంటారు. దీనివల్ల శరీరాకృతి అందంగా కనిపించదు. అంతేకాకుండా గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. యాంటీ ఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు అధికంగా ఉన్న పండ్లు తరచూ తినడంవల్ల బానపొట్టను మెల్లగా తగ్గించవచ్చు. ఆ పండ్ల వివరాలు...

యాపిల్



యాపిల్ పండులో చాలా తక్కువ క్యాలరీలు, అత్యధికంగా పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి పొట్టలోని కొవ్వులను కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ ఒక యాపిల్ పండు తినడం వల్ల అందులోని పెక్టిన్ సమ్మేళనాలు జీర్ణక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తాయి. దీనివల్ల ఆకలి తగ్గి ఆహారం తినాలనిపించదు. దీంతో పొట్టలోని కొవ్వు కరగడం మొదలవుతుంది.

నల్ల ద్రాక్ష



నల్ల ద్రాక్ష, స్ట్రాబెర్రీ, రాస్ బెర్రీ పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు, సి విటమిన్, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఈ పండ్లను రోజూ తినడం వల్ల కొవ్వులకు సంబంధించిన జీవక్రియలు వేగంగా జరుగుతాయి. దీనివల్ల కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

నారింజ



ఈ పండులో క్యాలరీలు ఉండవు. సి విటమిన్, బీటా కెరొటిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి పొట్టలోని అన్ని రకాల కొవ్వులను వేగంగా కరిగిస్తాయి. ప్రతిరోజూ కనీసం రెండు నారింజ పండ్లు తినడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

అవకాడో



దీనిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు కడుపులో ఇన్‌ఫ్లమేషన్‌ని నివారిస్తాయి. కొవ్వులను కరిగించే హార్మోన్లను ఉత్తేజితం చేస్తాయి. అవకాడోలోని విభిన్నమైన పీచుపదార్థాలు పొట్టను పరిశుభ్రం చేస్తాయి. ప్రతిరోజూ ఈ పండు తినడం వల్ల బానపొట్ట నుంచి విముక్తి పొందవచ్చు.

బొప్పాయి



ఈ పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేసి కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. కడుపులో ఎటువంటి పదార్థాలు నిల్వ ఉండకుండా చేస్తుంది. బొప్పాయిలోని పీచు పదార్థాలు ప్రేగులను పరిశుభ్రం చేస్తాయి. ప్రతిరోజూ ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలు తినడం వల్ల పొట్టలోని కొవ్వులు క్రమంగా కరిగిపోతాయి.

పంపర పనస




ఈ పండులో కూడా సిట్రస్ జాతి ఎంజైమ్‌లు, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి రక్తంలో చక్కెరలు పెరగకుండా చేస్తాయి. దీనివల్ల శరీరం పూర్తిస్థాయిలో శక్తిని వినియోగించుకుంటుంది. పంపర పనస పండు రసం తాగడం వల్ల ఉదరంలో నిల్వ ఉన్న కొవ్వులు క్రమంగా కరిగి బానపొట్ట తగ్గుతుంది.

పుచ్చపండు



దీనిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ పండు తిన్న వెంటనే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పుచ్చపండులో ఉండే ఆర్జినైన్ అనే అమైనోయాసిడ్ కొవ్వులను వేగంగా కరిగిస్తుంది. రోజుకి రెండు కప్పుల ముక్కలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన తేమ అందుతుంది. ఆకలి నియంత్రణలో ఉండి బానపొట్ట కరుగుతుంది.

దానిమ్మ



దానిమ్మ గింజల్లో పాలిఫెనాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. దీంతో కడుపులోని కొవ్వులు కూడా కరిగిపోతాయి.

అనాస



ఈ పండులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది పొట్టలో పేరుకున్న కొవ్వులను కరిగిస్తుంది. జీర్ణాశయం పనితీరుని మెరుగుపరుస్తుంది. కడుపులో తయారయ్యే వాయువులను బయటికి పంపుతుంది. ఈ పండు తిన్నపుడు దీనికి ఉన్న అరుదైన తీయదనం వల్ల కొన్ని రోజుల వరకు ఇతర తీపి పదార్థాలను తినాలనిపించదు. శరీర బరువు క్రమంగా తగ్గి పొట్ట పరిమాణం మామూలు స్థాయికి వస్తుంది.

అరటి



అరటి పండులో అధికంగా పొటాషియం ఉంటుంది. ఇది శరీరంలో అదనంగా నీరు నిల్వ ఉండకుండా చేస్తుంది. దీనివల్ల శరీర భాగాల్లో చేరిన కొవ్వులన్నీ కరిగిపోతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే రెండు అరటిపండ్లు తింటే ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీరమంతా తేలికగా ఉన్న భావన కలుగుతుంది.



శీతాకాలం చికెన్!

శీతాకాలంలో సాధారణం కన్నా ఎక్కువ రోగ నిరోధకశక్తి అవసరమవుతుంది. దీన్ని పెంపొందించుకోవటంలో ప్రొటీన్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ ప్రొటీన్‌ను మనకు అధికంగా అందించేది చికెన్. అందుకే చికెన్‌తో ఎలాంటి వంటలు చేసుకోవచ్చో చూద్దాం.

మెంతి చికెన్

కావాల్సిన పదార్థాలు

ఎముకలు లేని చికెన్ ముక్కలు- అరకేజీ, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, టమోటా ముక్కలు- ఒక కప్పు, తరిగిన మెంతికూర- ఒక కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు స్పూనులు, నిమ్మరసం- ఒక చెంచా, ఎర్ర కారం- ఒక చెంచా, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక చెంచా, పెరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, నూనె- పావు కప్పు, ఏలకులు- నాలుగు, దాల్చిన చెక్క- అర ఇంచు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

జాగ్రత్తలు

- మెంతికూర అందుబాటులో లేకపోతే ఎండబెట్టిన మెంతికూర (కసూరి మేతి) షాపుల్లో దొరుకుతుంది. దానిని వాడవచ్చు.
- తాజా చికెన్‌తో చేస్తే మంచి రుచి వస్తుంది.

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలను తీసుకొని నిమ్మరసం, ఎర్రకారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేసి కలపాలి. దీనిపై మూత పెట్టి 20 నిమిషాలు ఉంచాలి.
- మరొక గిన్నెలో పెరుగు, ఎర్రకారం, ధనియాల పొడి, ఉప్పు వేసి కలపాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేయించాలి. ఈ ముక్కలు చల్లారిన తర్వాత మిక్సీ గిన్నెలో వేసి ముద్దగా చేయాలి.
- ఉల్లిపాయ ముక్కలు వేయించిన మూకుడులోనే నానబెట్టిన చికెన్ ముక్కలను వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించాలి. వాటిని బయటకు తీసి చల్లార్చాలి.
- ఈ మూకుడులోనే ఏలకులు, దాల్చిన చెక్క, టమోటా ముక్కలు, మెంతికూర, పచ్చి మిర్చి ముక్కలు వేయాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముద్దను కూడా వేయాలి. ఈ మిశ్రమంలో వేయించిన చికెన్ ముక్కలు వేసి తగినంత ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి.

చికెన్ నీంబూ ధనియా షోర్బా



కావాల్సిన పదార్థాలు:

చికెన్ ముక్కలు- 50 గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- పావు చెంచా, ధనియాలు- ఒక చెంచా, నిమ్మరసం- ఒక చిన్న కప్పు, క్రీమ్- రెండు చెంచాలు, వెన్న- అర చెంచా, పసుపు- పావు చెంచా, పచ్చి మిర్చి పేస్ట్- అర చెంచా, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- సూప్ కన్నా షోర్బా చిక్కగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ నీళ్లు పోయకూడదు.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ అందుబాటులో లేక వేయకపోయినా మంచి రుచి వస్తుంది.

తయారీ విధానం

- ఒక గిన్నెలో మూడు పెద్ద కప్పుల నీళ్లు తీసుకొని సన్నని సెగపై మరిగించాలి. నీళ్లు పొంగిన తర్వాత వాటిలో చికెన్ ముక్కలు వేయాలి.
- చికెన్ ముక్కలు కొద్దిగా మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ధనియాలు, పచ్చిమిర్చి పేస్ట్, క్రీమ్, వెన్న, నిమ్మరసం వేసి ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేయాలి. దగ్గర పడిన తర్వాత దింపేయాలి.

ఆలూ చికెన్ పులుసు



కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు: ఒక కేజీ, తెల్ల వెనిగర్ - నాలుగు చెంచాలు, బంగాళదుంప ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, అల్లం ముక్కలు- ఒక చెంచా, పచ్చిమిరపకాయ ముక్కలు- రెండు చెంచాలు, ఏలకులు- నాలుగు, లవంగాలు- నాలుగు, దాల్చిన చెక్క- ఒక ఇంచు, కొబ్బరి పాలు- రెండు కప్పులు, కరివేపాకు- ఒక రెబ్బ, నూనె- పావు కప్పు, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- ఈ పులుసు దోసెలలో తింటే బాగుంటుంది.
- పోపు పెట్టే సమయంలో కేవలం కరివేపాకు మాత్రమే వేయాలి. ఆవాలు, మెంతులు వంటివి వేయకూడదు.

తయారీ విధానం

- కుక్కర్‌లో చికెన్ ముక్కలు, బంగాళదుంప ముక్కలు, తెల్ల వెనిగర్, ఉప్పు వేసి ఒక కూత వచ్చే దాకా ఉడికించాలి.
- ఒక మూకుడులో నాలుగు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి వేయించాలి. ఇవి బాగా వేగిన తర్వాత ఏలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి వేయించాలి.
- ఈ మిశ్రమంలో చికెన్ ముక్కలు, బంగాళ దుంప ముక్కలు, కొబ్బరి పాలు పోసి ఉడకబెట్టాలి.
- ఈ మిశ్రమం బాగా ఉడికిన తర్వాత ఉప్పు వేయాలి. వేరే చిన్న మూకుడులో కొద్దిగా నూనెను వేడి చేసి కరివేపాకు వేయించి. మిశ్రమంలో పోపు పెట్టాలి.

క్యాన్సర్‌ను జయించి... వ్యాపారంలో రాణించి

ఆమె ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడింది. అంతలోనే భర్తకూ అదే వ్యాధని తెలిసింది. అయినా కుంగిపోలేదు. వ్యాపకంగా ఉన్న పచ్చళ్ల తయారీని విస్తరించింది. పిల్లల భవిష్యత్తు కోసం మనోధైర్యంతో ముందుకు సాగుతూ ఒక సంస్థను నెలకొల్పింది. తద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించి... వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న లవీనా జైన్ అంతరంగం ఇది.

"మాది మీరట్. మా ఆయన సందీప్ జైన్. మాకు ఇద్దరు పిల్లలు. బాబు కిన్షుక్, పాప కృతిక. నలుగురం సొంత ఇంట్లో సంతోషంగా ఉండేవాళ్లం. పచ్చళ్లు పెట్టడం, స్క్వాష్‌లు తయారు చేయడమంటే నాకు చాలా ఇష్టం. వీటిని నిల్వ చేసే విధానాలకు సంబంధించి చిన్న కోర్సు కూడా పూర్తిచేశా. పచ్చళ్లు, ఊరగాయలు, జామ్‌లను విభిన్న రుచుల్లో రకరకాలుగా తయారుచేసి బంధువులకు, స్నేహితులకు పంచుతుండేదాన్ని. రుచి అమోఘమని, చిన్నపాటి వ్యాపారాన్ని ప్రారంభిస్తే మంచి పేరు, డబ్బు వస్తాయని చెబుతుండేవారు. వాళ్ల పొగడ్తలకు చాలా ఆనందం వేసేది.

బాధను భరిస్తూ...

"అంతా సంతోషంగా సాగుతుందని అనుకుంటుండగానే జీవితం అనుకోని మలుపు తిరిగింది. అనారోగ్యంగా అనిపిస్తే నేను, ఆయన ఆసుపత్రికి వెళ్లాం. ఇద్దరికీ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు వైద్యులు. కాళ్ల కింద భూమి కదులుతున్నట్లు అనిపించింది. పిల్లలు గుర్తుకువచ్చి కన్నీళ్లు ఆగలేదు. ఎలాగైనా ఈ కష్టం నుంచి గట్టెక్కాలని బలంగా నిర్ణయించుకున్నాం. బంధువులంతా ఇంటిని అమ్మేయమన్నారు. దానికి నా మనసు అంగీకరించలేదు. మావద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతోనే కీమోథెరపీ చేయించుకోవాలనుకున్నాం. చాలా బాధ అనుభవించాం. సరిగ్గా ఈ సమయంలోనే ప్రభుత్వం 'ఫుడ్ ప్రిజర్వేషన్ ట్రెయినింగ్‌'ను ప్రారంభించింది. వెంటనే అందులో చేరా. కీమోథెరపీ సెషన్ పూర్తయిన వెంటనే తరగతులకు హాజరయ్యా.

నోటి మాటతోనే...

"క్రమంగా క్యాన్సర్ నుంచి ఇద్దరం కోలుకున్నాం. నాకున్న పరిజ్ఞానంతో పచ్చళ్లు, జామ్‌ల వ్యాపారాన్ని ప్రారంభించాలనుకున్నా. అప్పుడు నా దగ్గర 1500 రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఆ డబ్బుతోనే మొదట లెమన్ స్క్వాష్, తండాయి తయారు చేశా. పిల్లల సహకారంతో పాత గాజు సీసాల్లో వీటిని నింపాను. ఆ రోజుల్లో మహిళలు ఎక్కువగా కిట్టీ పార్టీలు చేసుకునేవాళ్లు. అక్కడికి ఈ సీసాలు తీసుకెళ్లి అమ్మకానికి పెట్టేదాన్ని. ఇంట్లో తయారు చేసినవి అనగానే వాళ్లు ఆసక్తి చూపేవారు. రుచి కూడా నచ్చడంతో విరగబడి కొనేవాళ్లు. క్రమంగా ఊరగాయలు, స్క్వాష్‌లు కూడా తయారుచేసి నా ఉత్పత్తులను పరిచయం చేసేందుకు స్టాల్స్ ప్రారంభించా. మొదట వచ్చిన పెద్ద ఆర్డర్... రెండు కిలోల మామిడికాయ పచ్చడి. ఆ నోటా ఈ నోటా విని ఆర్డర్లు పెరిగాయి."





ప్రపంచ వ్యాప్తంగా...

మేము కష్టాల్లో ఉన్నపుడు అందరూ వెన్ను చూపినవాళ్లే. కొద్దిమంది మాత్రమే నాపై నమ్మకంతో మద్దతుగా నిలిచారు. వారి సహకారంతోనే ప్రస్తుతం 39 లక్షల టర్నోవర్ సాధించా. త్వరలో 50 లక్షల మార్క్ దాటాలనే లక్ష్యంతో ఉన్నా. కొనుగోలుదారులకు ఎప్పటికప్పుడు కొత్త రుచులు పరిచయం చేయడమంటే నాకు చాలా ఇష్టం. ఇదే నా గెలుపు సూత్రం కూడా! మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా విభిన్న ఉత్పత్తుల తయారీ కోసం రోజూ ప్రయోగాలు చేస్తుంటా. ప్రపంచవ్యాప్తంగా మా ఉత్పత్తులు విస్తరించాలన్నదే నా ఆశయం.

నాణ్యతకే పెద్ద పీట...

"వ్యాపారం విస్తరిస్తుండడంతో ఇంట్లోనే 'తృప్తి ఫుడ్స్' పేరుతో ఒక యూనిట్ ప్రారంభించా. పిల్లలు, భర్త పూర్తి సహకారం అందించారు. యూనిట్ పనుల్లో సహాయం కోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలను నియమించుకున్నా. ఇప్పటికీ అందరం కలిసి ఒకే కుటుంబంలా పనిచేస్తాం. కాలానుగుణంగా లభించే పండ్లు, కాయలతో ఉత్పత్తులను నిర్ణయించి తయారుచేస్తాం. అందుకు స్థానిక మార్కెట్ల నుంచి తాజాగా ఉన్నవాటిని మాత్రమే ఎంచుకుని కొనుక్కొస్తాం. ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారమే సోడియం బెంజోయేట్‌ని కలుపుతాం. కృత్రిమ రంగులు అసలు కలపం. పెద్ద ఆర్డర్లు వచ్చినపుడు వాటి తయారీ, నిల్వ, ప్యాకింగ్ అంశాల్లో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రస్తుతం మా యూనిట్ నుంచి 70 రకాలు తయారు చేస్తున్నాం. కారం, ఇతర మసాలా పొడులను సంప్రదాయ పద్ధతుల్లోనే సిద్ధం చేసుకుంటాం. ఇక్కడ పనిచేయడానికి వచ్చే మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తాం. ప్రతి ఉత్పత్తినీ నిర్దేశించిన కొలతల ప్రకారం మాత్రమే తయారయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటాం. అందుకే మేం పెట్టిన పచ్చళ్లు, ఊరగాయలు తిన్నవాళ్లు 'అచ్చం అమ్మమ్మ చేసినట్లే ఉన్నాయి' అంటుంటారు. ఇది మాకెంతో సంతృప్తినిస్తుంది.

అదే అందరికీ ఇష్టం...

మా ఉత్పత్తుల్లో 'హింగ్ అచార్' బాగా ప్రాచుర్యం పొందింది. యూనిట్ మొత్తం అమ్మకాల్లో మూడొంతులు దీనిదే. లీచీ స్క్వాష్, యాపిల్ జామ్, కీవీ జామ్, పైనాపిల్ క్రష్, స్ట్రాబెర్రీ స్క్వాష్‌లకు మంచి ఆదరణ ఉంది. స్థానికంగా నిర్వహించే ఎగ్జిబిషన్లు, ప్రత్యేక ఈవెంట్లలో స్టాల్స్ పెడుతుంటాం. మీరట్‌లో నాలుగు రిటైల్ అవుట్‌లెట్లు ప్రారంభించాం. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో కూడా మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. అమెజాన్ నుంచి కూడా కొనుక్కోవచ్చు. విదేశాలకు వెళ్లే కుటుంబాలు మా ఉత్పత్తులను వెంట తీసుకెళుతుంటే మాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంటుంది."

తెలుగు నాట పులగానికి సాటి లేదు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

తెలుగు నేలకు సంబంధించినంతవరకూ పెసలు మన మొదటి పప్పు ధాన్యం. ఆ సమయంలో పెసర చేనుని పైరు అనేవారు. తరువాతి కాలంలో అన్ని పంటచేలనూ పైరు అనటం మొదలుపెట్టారు. పెసల తర్వాతే మనకు కందిపప్పు తదితర పప్పుధాన్యాలు తెలిశాయి. మొదట్లో అన్నంలో పెసరపప్పును కలుపుకొని తినేవారు. వరి బియ్యాన్ని, పెసరపప్పును కలిపి వండటం ఆ సమయంలో ఒక కొత్త ప్రయోగం. దేవుడికి మహానివేదన పెట్టే సమయంలో ప్రతి రోజూ పంచ భక్ష్య పరమాన్నాలు పెట్టలేరుగా! దానికి బదులుగా పెసర



పప్పు అన్నం నివేదనగా పెట్టేవారు. ఈ పెసరపప్పు అన్నంను సంస్కృత పాకశాస్త్ర గ్రంథాల్లో, వైద్య గ్రంథాల్లో- కృశర అని పిలుస్తారు. కొన్ని చోట్ల ముద్గౌదనం (పప్పన్నం) అని కూడా కనిపిస్తుంది. ఇక పెసరపప్పు పసిడి వర్ణంలో ఉంటుంది కాబట్టి దీనిని తెలుగులో పులగం అని పిలవటం మొదలుపెట్టారు.

'భోజన కుతూహలం' గ్రంథంలో ఈ కృశర గురించి "తండులా దాలిసంయుక్తా లవణార్ద్రకహింగుభి.. యుక్తాశ్చ సలిలె సిద్ధా కృశరా కథితా బుధై" అని పేర్కొంటారు. తండులా దాలిసంయుక్తా అంటే పెసరపప్పు, బియ్యం కలిపి వండినది అని.. "లవణార్ద్రక హింగుభి" అంటే సైంధవలవణం, అల్లంముక్కలు, ఇంగువ వగైరా కలిపినది అని.. "సలిలె సిద్ధా కృశరా కథితా బుధై" అంటే చాలినంత నెయ్యి వేసి వండితే దాన్ని కృశరా అని మేధావులు పిలుస్తారని.. "శుక్రలా" అంటే పురుషుల్లో జీవకణాలను పెంచే సమర్థత దీనికి ఉందని.. "బల్యా గురు పిత్త కఫప్రదా" అంటే బలకరం, ఆలస్యంగా అరిగి ఎక్కువ సేపు ఆకలి వెయ్యకుండా.. కఫదోషాన్ని పోగొడుతుందని.. "బహువిష్టంభ" అంటే నీళ్లవిరేచనాలను, అతిమూత్రాన్ని ఆపుతుందని.. "మలమూత్రకరీ" అంటే మలమూత్రాలు సులభంగా అయ్యేలా చేస్తుందని.. "బుద్ధివివర్థక" అంటే జ్ఞాపకశక్తిని పెంచేదిగా ఉంటుందని అర్థం.

పిల్లలకు...

ఎదిగే పిల్లలకు పులగాన్ని మించిన ఆహార పదార్థం ఇంకొకటి లేదు. తల్లి దండ్రులు తమ పిల్లలకు ఉదయాన్న ఈ కమ్మని కృశరా అనే పులగాన్ని పెట్టి పంపిస్తే పిల్లలు చురుకుగా ఉంటారు. కడుపులో మంట, అల్సర్లు, అమీబియాసిస్, కడుపు ఉబ్బరం లాంటి బాధల్ని ఈ పులగం తగ్గిస్తుంది. దీనిని తిన్న తరువాత బెల్లం పానకం గానీ నిమ్మరసం షర్బత్తు గానీ మజ్జిగ గానీ తాగితే తేలికగా అరుగుతుంది. ఇక ఈ పులగాన్ని రెండు రకాలుగా చేసుకోవచ్చు. మొదటిది కారం (కట్టు) పులగం. రెండోది తీపి పులగం. ఇక్కడ ఒక మరో విషయాన్ని కూడా చెప్పాలి. పులగం, పొంగలి ఒకటి కావు. ఒక కప్పు బియ్యం, ఒక కప్పు పెసరపప్పును రెండు కప్పుల నీటిలో ఉడికించి చేసేది పులగం. ఒక కప్పు బియ్యపు పిండి, ఒక కప్పు పెసరపప్పులను రెండు కప్పుల నీళ్లలో వేసి చేసేది పొంగలి. దీనిలో ఎవరికి కావాల్సినంత నెయ్యి వారు వేసుకోవచ్చు. ఇక తీపి పులగం విషయానికి వస్తే- బియ్యం, పెసరపప్పు, బెల్లం, కొబ్బరి, మిరియాలు, నెయ్యి, ఆవుపాలు వీటిని తగుపాళ్లలో కలిపి సన్నని సెగపై ఉడికించాలి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. తినటానికి చాలా రుచిగా కూడా ఉంటుంది.

మేకప్

కనువిందైన అందం

మేకప్‌లో భిన్నమైన పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. కాలానుగుణంగా మారిపోతున్న ఈ పోకడలను సందర్భానికి తగ్గట్టు అనుసరిస్తూ ఉండాలి. ప్రస్తుతం వాడుకలో ఉన్న మేకప్ పోకడలు ఇవే!

గ్లామర్ మేకప్

మందపాటి పెదవులు, మెరుపులీనే చర్మం, తీర్చిదిద్దిన కళ్లు ఈ మేకప్ రహస్యాలు. ప్రత్యేకించి సంప్రదాయ వస్త్రధారణకు అద్భుతంగా నప్పే ఈ తరహా మేకప్‌లో ఐషాడోల కోసం భిన్నమైన రంగులను ఎంచుకుంటూ ఉంటారు. ఎమరాల్డ్ గ్రీన్, శాఫైర్ బ్లూ, రూబీ రెడ్ రంగుల ఐషాడోలు ఈ తరహా మేకప్‌లో ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. అయితే కళ్లలోని లోపలి కొలకులకు బంగారం లేదా రాగి రంగు ఐషాడో అద్దుకోవడం వల్ల గ్లామర్ రెట్టింపవుతుంది.

లిప్ కలర్స్

ముదురు రంగు లిప్‌స్టిక్స్ ఊపందుకున్నాయి. డీప్ ప్లమ్, క్లాసిక్ రెడ్, వైబ్రెంట్ కోరల్ రంగుల లిప్‌స్టిక్‌లతో మేకప్‌కు రెట్టింపు ఆకర్షణ దక్కుతుంది. సంప్రదాయ వేడుకలకు బోల్డ్ లిప్‌స్టిక్స్ చక్కగా నప్పుతాయి. అంతకంటే సున్నితమైన రంగులను ఇష్టపడేవారు టింటెడ్ లిప్‌బామ్ లేదా గ్లాస్ వాడుకోవచ్చు.

కోల్ రిమ్మ్‌డ్ ఐస్

నల్లని కాటుక కళ్లకు రోజులు చెల్లాయి. టీల్, పర్పుల్, గోల్డ్ లైనర్ల హవా మొదలైంది. ఈ లైనర్లకు మందపాటి కృత్రిమ కనురెప్పలను జోడించి కవ్వించే కళ్లను తీర్చిదిద్దుకునే ధోరణి మొదలైంది. అయితే ఈ లైనర్ల అందం చెక్కుచెదరకుండా ఉండడం కోసం తడికి కారిపోకుండా ఉండే ఐలైనర్స్‌నే ఎంచుకోవాలి.



సీనియర్లకు టెస్టు

రోహిత్, విరాట్‌లపై తీవ్ర ఒత్తిడి

నేటి నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు



జైస్వాల్, గిల్

ఉదయం 5.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అత్యంత కీలక మ్యాచ్‌కు అంతా సిద్ధం. ఆరంభ టెస్టులో భారత్.. ఆ తర్వాత అడిలైడ్‌లో ఆసీస్ విజయాలతో సిరీస్ ప్రస్తుతానికి 1-1తో సమంగా ఉంది. ఈనేపథ్యంలో శనివారం నుంచి ఇరు జట్ల మధ్య స్థానిక గాబా మైదానంలో మూడో టెస్టు జరుగనుంది. నాలుగేళ్ల క్రితం ఇదే మైదానంలో రిషబ్ పంత్ వీరోచిత ఆటతీరు అభిమానులకు గుర్తుండే ఉంటుంది. మూడు దశాబ్దాల తర్వాత ఆసీస్‌కు ఓటమి రుచి చూపించింది. ఆ విజయంతో సిరీస్‌నే పట్టేసింది. ఆ గెలుపు ఉత్సాహంతోనే టీమిండియా ఈసారి కూడా బరిలోకి దిగాలనుకుంటోంది. ఎందుకంటే.. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సిరీస్ దక్కించుకునే అవకాశాలు మరింత మెరుగవుతాయి. అయితే ఇప్పటిదాకా సాగిన రెండు మ్యాచ్‌లకన్నా ఈ వేదికపై బంతి ఎక్కువ పేస్, బౌన్స్‌తో బ్యాటర్లకు సవాల్ విసరనుంది. మరోవైపు గాబాలో భారత్‌కు మెరుగైన రికార్డేమీ లేదు. ఇక్కడ ఆడిన ఏడు టెస్టుల్లో ఒక్కటే (2020-21) గెలిచి ఐదింట్లో ఓడింది. అటు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశించాలన్నా ఈ టెస్టులో కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది.

రో-కో మెరిసేనా?

కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేలవ ఫామ్ అభిమానులనే కాకుండా టీమ్ మేనేజ్‌మెంట్‌ను కూడా ఆందోళనలో పడేస్తోంది. జట్టును ముందుండి నడిపించాల్సిన ఈ జోడీ ఎలాంటి పోరాటమూ లేకుండా ఆసీస్ బౌలర్లకు దాసోహం కావడం బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తోంది. కేవలం రెండు టెస్టుల అనుభవం కలిగిన యువ బ్యాటర్ నితీశ్ కుమార్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తున్న చోట అపార అనుభవం కలిగిన రో-కో తమకు ఆటే తెలీదన్నట్టు పెవిలియన్‌కు చేరడం జట్టుకు ఏమాత్రం మంచిది కాదు. ఈ ఏడాది సీజన్‌లో రోహిత్, కోహ్లీ తొలి ఇన్నింగ్స్ సగటు వరుసగా 6.88, 10గా ఉండడం గమనార్హం. పెర్త్‌లో సెంచరీతో కోహ్లీ కాస్త టచ్‌లోకి వచ్చినట్టు కనిపించినా.. రోహిత్ నుంచి కెప్టెన్ ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. అది జరిగితే జట్టుకే కాదు అతడి నాయకత్వ పటిమకు కూడా నిదర్శనంగా నిలుస్తుంది. వీరిద్దరికీ ఇదే చివరి ఆసీస్ పర్యటనగా భావిస్తున్న తరుణంలో ఈ సిరీస్‌ను కచ్చితంగా భారత్ ఖాతాలో వేయాల్సిన అవసరం ఉంది. తమ బలహీనతల్ని అధిగమిస్తూ తాజా టెస్టులో చెలరేగాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు. అయితే రోహిత్ ఓపెనర్‌గానా లేక మిడిలార్డర్‌లో వస్తాడా? అనే విషయంలో స్పష్టత లేదు. ఇక జైస్వాల్, పంత్‌తో పాటు గిల్ కూడా నిలకడగా ఆడితే భారీ స్కోరు సాధించగలుగుతుంది. స్పిన్ విభాగంలో అశ్విన్ స్థానంలో సుందర్, జడేజాలలో ఒకరిని తీసుకోవచ్చు. మూడో పేసర్‌గా ఆకాశ్‌దీప్‌ను ఆడిస్తారనే కథనాలు వినిపిస్తున్నాయి. కానీ రోహిత్ మాత్రం రాణా వైపే మొగ్గుచూపిస్తున్నట్టు సమాచారం. బుమ్రా, సిరాజ్‌లపై పేస్ భారం పడనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, పంత్, రాహుల్, నితీశ్ కుమార్, సుందర్/అశ్విన్, ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: ఖవాజా, మెక్‌స్వీనే, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

జట్టులోకి హాజెల్‌వుడ్

భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియా బ్యాటింగ్ మెరుగ్గానే ఉంది. ట్రావిస్ హెడ్ టీమిండియా బౌలర్లపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే రెండు టెస్టుల్లో 19 పరుగులు మాత్రమే చేసిన వెటరన్ స్టీవ్ స్మిత్ ఆకట్టుకోలేకపోతున్నాడు. గత 24 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క శతకం కూడా నమోదుచేయలేకపోయాడు. లబుషేన్ పింక్ బాల్ టెస్టులో హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్నాడు. ఓపెనర్ మెక్‌స్వీనే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాడు. కొత్త బంతితో బుమ్రా తొలి స్పెల్‌ను జాగ్రత్తగా ఆడి, మిగతా బౌలర్లపై ఎదురుదాడికి దిగాలని ఆసీస్ భావిస్తోంది. గాబాలో పేసర్లు స్టార్క్ 47, కెప్టెన్ కమిన్స్ 40 వికెట్లు తీయడం విశేషం. ఇక హాజెల్‌వుడ్ రాకతో ఆసీస్ పేస్ బలం మరింత పెరగనుంది.



పిచ్, వాతావరణం

గాబా సహజంగా పేసర్లకు అనుకూలిస్తుంటుంది. ఈసారి కూడా బౌన్సీ పిచ్‌ను సిద్ధం చేసినట్టు క్యూరేటర్ తెలిపాడు. అయితే టెస్టుకు వరుణుడి నుంచి ముప్పు పొంచి ఉంది. తొలి మూడు రోజులు ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. అలాగే నేడు వర్షం కురిసే అవకాశం 88 శాతంగా ఉండనుంది.

ట్రీసా-గాయత్రి జోడీ అవుట్

హాంగ్జౌ: వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి జోడీ పోరాటం ముగిసింది. శుక్రవారం గ్రూప్ 'ఎ'లో జరిగిన చివరి మ్యాచ్‌లో నమీ మట్సుయమ-చిహరు (జపాన్) చేతిలో 17-21, 13-21 తేడాతో భారత్ జోడీ ఓటమిపాలై సెమీస్ బెర్త్ కోల్పోయింది. ట్రీసా జాలీ-గాయత్రి మాత్రమే భారత్ నుంచి ఈ టోర్నీకి అర్హత సాధించగా.. తొలి మ్యాచ్‌లో ఓడిన వీరు రెండో మ్యాచ్‌లో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోగలిగారు. కానీ కీలక పోరులో ఓటమితో ఇంటిముఖం పట్టారు.

అఫ్ఘాన్ ఘనవిజయం

హరారే: అఫ్ఘానిస్థాన్ జట్టు జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 153 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వే 17.4 ఓవర్లలో కేవలం 103 పరుగులకే ఆలౌటైంది. నవీనుల్ హక్, రషీద్‌ఖాన్ మూడేసి వికెట్లు తీశారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి వన్డేలో జింబాబ్వే నెగ్గింది.

చిత్తుగా ఓడిన బెంగళూరు

పుణె: పుణెరి పల్టన్‌తో జరిగిన ప్రొ కబడ్డీ మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ ఘోర పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పల్టన్ 56-18 పాయింట్ల తేడాతో బుల్స్‌ను చిత్తుచేసింది. ఆడిన 18 మ్యాచ్‌ల్లో 15 ఓడిన బెంగళూరు పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-38 పాయింట్లతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది.

ట్రోఫీ అందుకున్న గుకేష్

ఎదురు చూపులు ఫలించాయి



సింగపూర్: సరికొత్త వరల్డ్ చెస్ చాంపియన్ గుకేష్ శుక్రవారం సగర్వంగా ట్రోఫీని అందుకున్నాడు. సాయంత్రం ఆహ్లాదకరంగా సాగిన ముగింపు కార్యక్రమంలో ఫిడే అధ్యక్షుడు అర్కేడి వోర్కోవిచ్ గోల్డ్ మెడల్‌తో పాటు ట్రోఫీని ప్రదానం చేశాడు. ఆ వెంటనే దీన్ని గుకేష్ తన తల్లిదండ్రులకు అప్పగించాడు. గురువారమే ముగిసిన ఈ టోర్నీలో 18 ఏళ్ల గుకేష్ చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించిన విషయం తెలిసిందే. తద్వారా అతిపిన్న వయస్సులోనే జగజ్జేతగా నిలవడంతో పాటు ఆనంద్ తర్వాత ఈ రికార్డు సాధించిన మరో భారత చెస్ ఆటగాడయ్యాడు. 'ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. ప్రతీ రోజు ఉదయం చాంపియన్ కావాలన్న కలతోనే లేచేవాణ్ణి. ఎట్టకేలకు సాధించగలిగాను. ట్రోఫీని పట్టుకుని నిలిచిన ఈ క్షణాన.. జీవితంలో ఇంతకుమించి ఇంకేం కావాలనిపిస్తోంది' అని గుకేష్ అన్నాడు. అటు ఎన్నో త్యాగాల తర్వాత తమకు దక్కిన అద్భుతమైన ఆనంద క్షణాలివి అంటూ గుకేష్ తల్లి పద్మాకుమారి భావోద్వేగానికి గురయ్యారు. విజేతగా నిలిచాడనే వార్త తెలిశాక నమ్మలేకపోయానని, పది నిమిషాలపాటు ఆనందంతో ఏడ్చేశానని తెలిపారు. కుమారుడు ట్రోఫీని అందుకునే మధురక్షణాల్ని తనివితీరా చూసేందుకు ఆమె హుటాహుటిన సింగపూర్ బయల్దేరి వెళ్లారు. మరోవైపు అత్యున్నత శిఖరాన్ని అధిరోహించేందుకు ఎదురైన అడ్డంకులను చిన్నవయస్సులోనే గుకేష్ అధిగమించాడని మాజీ చాంపియన్ కాస్పరోవ్ కొనియాడాడు. అంతకుముందు గుకేష్ చాంపియన్ హోదాలో శుక్రవారం ఉదయం నుంచి బిజీ బిజీగా గడిపాడు. రాత్రంతా నిద్ర లేకపోవడంతో కళ్లు ఎర్రగా మారినా.. చెదరని చిరునవ్వుతో అభిమానులకు ఆటోగ్రాఫ్‌లివ్వడం కనిపించింది.



అమ్మానాన్నలతో..

గుకేష్‌కు రూ.5 కోట్లు


తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేష్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ. 5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజేతగా నిలిచిన గుకేష్‌కు రూ. 11.45 కోట్ల ప్రైజ్‌మనీ లభించిన విషయం విదితమే.

ఫైనల్లో ముంబై, ఎంపీ

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో మధ్యప్రదేశ్, ముంబై జట్లు ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యాయి. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో వెటరన్ ఆటగాడు అజింక్యా రహానె (98) అదరగొట్టడంతో ముంబై 6 వికెట్లతో బరోడాను ఓడించింది. తొలుత బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. శివాలిక్ (36 నాటౌట్), శాశ్వత్ రావత్ (33), కెప్టెన్ క్రునాల్ (30) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో రహానెకు తోడు సారథి శ్రేయాస్ అయ్యర్ (46) ఆకట్టుకోవడంతో ముంబై 17.2 ఓవర్లలో 164/4 స్కోరు చేసి గెలిచింది. ఫైనల్ ఆదివారం జరగనుంది. ఇక మరో సెమీస్‌లో ఎంపీ 7 వికెట్లతో ఢిల్లీపై గెలిచింది. మొదట ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 146 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (33 నాటౌట్) టాప్ స్కోరర్. ఛేదనలో కెప్టెన్ రజత్ పటీదార్ (66 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో సత్తా చాటడంతో ఎంపీ 15.4 ఓవర్లలో 152/3 స్కోరు చేసి గెలిచింది. హర్‌ప్రీత్ సింగ్ (46 నాటౌట్), హరీశ్ గావ్లీ (30) రాణించారు.



రహానె (98)

అదరగొట్టిన జంగూ

● బంగ్లాపై విండీస్ గెలుపు
● 3-0తో సిరీస్ కైవసం

సెయింట్‌కిట్స్: వికెట్‌కీపర్ బ్యాటర్ ఆమిర్ జంగూ (83 బంతుల్లో 104 నాటౌట్) అరంగేట్రంలోనే సెంచరీతో అదరగొట్టడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలో వెస్టిండీస్ విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను విండీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 321 రన్స్ చేసింది. ఛేదనలో వెస్టిండీస్ 45.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 325 పరుగులతో విజయం సాధించింది. కార్టీ 95 పరుగులు చేశాడు. ఇక ఆమిర్ కేవలం 80 బంతుల్లోనే శతకం పూర్తిచేసి అరంగేట్రంలో వేగంగా సెంచరీ చేసిన వెస్టిండీస్ ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. అలాగే వెస్టిండీస్ తరపున ఓపెనర్ డెస్మండ్ హేన్స్ (1978లో) తర్వాత అరంగేట్రంలో సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు.

అన్వయ్ ద్రవిడ్ అజేయ శతకం



మూలపాడు (ఆంధ్రప్రదేశ్): బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ (100 నాటౌట్) విజయ్ మర్చంట్ ట్రోఫీలో అజేయ శతకంతో విజృంభించాడు. జార్ఖండ్‌తో శుక్రవారం ఇక్కడ ముగిసిన మూడ్రోజుల మ్యాచ్‌లో కర్ణాటక తరపున నాలుగో నెంబర్ ఆటగాడిగా బరిలోకి దిగిన అన్వయ్ 10 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ సాధించాడు. ఫలితంగా కర్ణాటక 123.3 ఓవర్లలో 441/4 స్కోరుతో చివరిరోజును ముగించింది. అంతకుముందు జార్ఖండ్ 387 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది.



ప్రపంచ సంపన్నుల్లో

అంబానీ కుటుంబం

రూ.8.44 లక్షల కోట్లతో ఎనిమిదో స్థానం

షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికీ చోటు: బ్లూమ్‌బర్గ్

న్యూయార్క్: ప్రపంచ కుబేర కుటుంబాల సంపద ఏటికేటికీ పెరిగి పోతోంది. అమెరికా రిటైల్ దిగ్గజం 'వాల్‌మార్ట్' వ్యవస్థాపకులు వాల్టన్ కుటుంబం ఈ విషయంలో 43,240 కోట్ల డాలర్ల (సుమారు రూ.36.65 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న కుటుంబంగా నిలిచింది. ఇది ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద (44,700 కోట్ల డాలర్లు) కంటే కొద్దిగా తక్కువ. పశ్చిమాసియాలోని రాజ కుటుంబాల అందరి సంపదలతో పోలిస్తే మాత్రం వాల్టన్ కుటుంబ ఆస్తులే ఎక్కువ. దీనికి సంబంధించి బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తాజాగా 'ప్రపంచ సంపన్న కుటుంబాలు, 2024' పేరుతో ఒక జాబితా విడుదల చేసింది.

అంబానీలకూ చోటు: ఈ జాబితాలో మన దేశానికి చెందిన రెండు కుటుంబాలకు చోటు దక్కింది. అంబానీ కుటుంబం 9,960 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.44 లక్షల కోట్లు) సంపదతో ఎనిమిదో స్థానం సంపాదించింది. ఆ తర్వాత 4,140 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.5 లక్షల కోట్లు) సంపదతో షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన మిస్త్రీ కుటుంబం 23వ స్థానంలో నిలిచింది.

ప్రజలు శాట్‌ను ఆశ్రయించకుండా

జాగ్రత్తపడాల్సింది సెబీనే

ఈడీ సుందరేశన్



ముంబై: ప్రజలు విభేదించలేని విధంగా, తన నిర్ణయాలను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్)లో సవాలు చేయాల్సిన అవసరం లేకుండా నియమావళిని రూపొందించాల్సిన బాధ్యత మార్కెట్ నియంత్రణ మండలి సెబీదేనని ఈ నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) వీ సుందరేశన్ అన్నారు. సెబీకి మూడు దశాబ్దాలకు పైగా సేవలందిస్తోన్న సుందరేశన్.. ప్రపంచ హిందూ ఎకనామిక్ ఫోరమ్‌లో శుక్రవారం ప్రసంగించారు. మూలధన పెట్టుబడుల రాకకు తోడ్పడటంతో పాటు ఇన్వెస్టర్లలో భరోసా నింపడమే సెబీ ప్రాథమిక బాధ్యతని ఆయన ఈ సందర్భంగా అన్నారు. "సెబీ మైదానంలోని అంపైర్. కాగా, శాట్ థర్డ్ అంపైర్. మైదానంలోని అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ థర్డ్ అంపైర్‌ను ఆశ్రయించకుండా చూడాల్సిన బాధ్యత మైదానంలోని అంపైర్‌దే"నని ఆయన అభిప్రాయపడ్డారు. అంపైర్ (సెబీ) నిష్పక్షపాతంగా వ్యవహరిస్తేనే ఆట (మార్కెట్లో కార్యకలాపాలు) సజావుగా సాగుతుంది. తత్ఫలితంగా మన మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో భరోసా పెరుగుతుందన్నారు. గడిచిన కొన్ని త్రైమాసికాల్లో సెబీ జారీ చేసిన పలు ఆదేశాలపై శాట్ స్టే విధించడం లేదా రద్దు చేయడం జరిగిన నేపథ్యంలో సుందరేశన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆల్గో ట్రేడింగ్‌లోకి రిటైల్ మదుపరులు

ఆల్గోరిథమిక్ ట్రేడింగ్‌లో రిటైల్ మదుపరులు సైతం తగిన భద్రతతో పాల్గొనేందుకు అనుమతించాలని సెబీ ప్రతిపాదించింది. ఇందులో స్టాక్ బ్రోకర్లు, ఎక్స్ఛేంజీల పాత్ర, బాధ్యతలను నిర్దేశిస్తూ నియంత్రణ నియమావళితో కూడిన చర్చా పత్రాన్ని విడుదల చేసింది. తాజా ప్రతిపాదనలపై వచ్చే నెల 3 నాటికి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది. ఆల్గో ట్రేడింగ్‌లో వేగంగా ఆర్డర్ల ఎగ్జిక్యూషన్‌తో పాటు లావాదేవీల వ్యయం తగ్గి, ద్రవ్య లభ్యత కూడా మెరుగుపడుతుంది. మార్కెట్ దక్షతతోపాటు పారదర్శకతను పెంచేందుకు డైరెక్ట్ మార్కెట్ యాక్సెస్ (డీఎంఏ) వసతి ద్వారా సెబీ 2008లో ఆల్గో ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ వసతి సంస్థాగత ఇన్వెస్టర్లకు మాత్రమే అందుబాటులో ఉంది.

బిజినెస్



శక్తిమంత నిర్మల

ఫోర్బ్స్ అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక మంత్రి

కిరణ్ మజుందార్ షా, రోష్ని నాడార్‌కూ స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచ సంపన్నుల జాబితాలోనే కాదు, అత్యంత శక్తిమంతులైన మహిళల జాబితాలోనూ భారతీయులు దూసుకుపోతున్నారు. ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన ప్రపంచంలో అత్యంత శక్తిమంతులైన మహిళల తాజా జాబితాలో ముగ్గురు భారతీయులకు స్థానం దొరికింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్, హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ రోష్ని నాడార్ మల్హోత్రా, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఈ జాబితాలో స్థానం సంపాదించారు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతులైన మహిళల్లో నిర్మలా సీతారామన్‌కు 28వ స్థానం, రోష్ని నాడార్ మల్హోత్రాకు 81వ స్థానం, కిరణ్ మజుందార్ షాకు 82వ స్థానం దక్కాయి. ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రెసిడెంట్ క్రిస్టినా లగార్డె, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ జాబితాలో అగ్రస్థానం సంపాదించారు.

ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసాల కష్టాలు

సగానికి తగ్గిన వీసాల ఆమోదం

న్యూఢిల్లీ: భారత ఐటీ కంపెనీలు అమెరికాలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. దేశంలోని ఏడు అగ్రశ్రేణి ఐటీ సంస్థలకు హెచ్-1బీ వీసాల జారీని అమెరికా కఠినం చేసింది. దీంతో ఈ వీసాలపై తక్కువ జీతాలకు తమ ఉద్యోగులను అమెరికా పంపించి ప్రాజెక్టులు పూర్తి చేయడం భారత కంపెనీలకు కష్టంగా మారింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం ఈ కంపెనీలకు 14,792 హెచ్-1బీ వీసాలు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఇది ఏకంగా 7,299కు పడిపోయింది. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం అమెరికా ఆమోదించిన మొత్తం హెచ్-1బీ వీసాల్లో భారతీయుల వాటా కేవలం 5.2 శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అమెరికా ఉద్యోగుల్లో హెచ్-1బీ వీసాలపై పని చేస్తున్న భారతీయుల శాతం కేవలం 0.004 శాతం మాత్రమే. డొనాల్డ్ ట్రంప్ రెండో జమానాలో హెచ్-1బీ వీసాల జారీని కఠినం చేస్తే ఇది మరింత పడిపోతుందని భావిస్తున్నారు. దీంతో అమెరికాలో ప్రాజెక్టులు చేపడుతున్న భారత కంపెనీలు అధిక జీతాలు ఇచ్చి స్థానికుల్ని ఉద్యోగాల్లో నియమించుకోక తప్పడం లేదు. ప్రాజెక్టులు సన్నగిల్లిన తరుణంలో ఇది తమపై అదనపు భారం మోపడమేనని కంపెనీలు వాపోతున్నాయి.

-1,207 నుంచి +924 వరకు

ఇంట్రాడేలో 2,131 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడిన సెన్సెక్స్

ముంబై: వారాంతంలో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీ ఒడుదుడుకులకు లోనయ్యాయి. శుక్రవారం నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒక దశలో 1,207.14 పాయింట్లకు వరకు క్షీణించి 80,000 స్థాయికి జారుకుంది. ఆ దశలో టెలికాం, ఐటీ, టెక్, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లో వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో సూచీలు భారీ నష్టాల నుంచి పూర్తిగా తేరుకుని లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒక దశలో 924 పాయింట్ల మేర వృద్ధి చెంది 82,214 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో సూచీ 843.16 పాయింట్ల లాభంతో 82,133.12 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 2,131 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడింది. నిఫ్టీ విషయానికొస్తే, ఆరంభ సెషన్‌లో 368 పాయింట్ల వరకు పతనమైన సూచీ మళ్లీ లాభాల్లోకి చేరుకుని 219.60 పాయింట్ల వృద్ధితో 24,768.30 వద్ద ముగిసింది. దాంతో మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.1.27 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.459.42 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 రాణించాయి. ఎయిర్‌టెల్ షేరు 4.39 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఐటీసీ, కోటక్ బ్యాంక్ స్టాక్స్ రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.29 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో టెలికాం 2.13 శాతం ఎగబాకగా.. టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా పెరిగాయి. బ్యాంకింగ్, ఐటీ సూచీలు అర శాతానికి పైగా లాభపడ్డాయి.

● డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు పెరిగి రూ.84.80 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో లాభాలు, ధరల సూచీ తగ్గుదల వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి.

● ఈ నెల 6తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 323.5 కోట్ల డాలర్ల మేర తగ్గి 65,485.7 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

మొబిక్విక్ ఐపీఓకు 120 రెట్ల స్పందన

ఫిన్ టెక్ కంపెనీ మొబిక్విక్ సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఈ రూ.572 కోట్ల ఐపీఓకు ఏకంగా 119.38 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించిన షేర్లకు అత్యధికంగా 134.67 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీల వాటా షేర్లకు 119.50 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 108.95 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

● విశాల్ మెగామార్ట్ ఐపీఓ సైతం చివరి రోజు నాటికి 27.28 రెట్ల బిడ్లను ఆకర్షించగలిగింది. హైదరాబాద్‌కు చెందిన సాయి లైఫ్ సైన్సెస్ ఇష్యూ 10.26 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

● ప్యాకేజింగ్ యంత్రాల తయారీదారు మమత మెషినరీ రూ.179 కోట్ల ఐపీఓ ఈ నెల 19న ప్రారంభమై 23న ముగియనుంది. ఐపీఓ షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.230-243గా నిర్ణయించింది.

మెడికల్ టెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

» మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ

ఉక్కునగరం (ఆంధ్రజ్యోతి): మెడికల్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో దేశాల మధ్య పరస్పర అవగాహన ఉంటే మంచి ఫలితాలు వస్తాయని మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లోని కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ సెంటర్‌లో జరుగుతున్న వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం-2024 సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మెడ్‌టెక్ జోన్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారవుతున్నాయన్నారు. మెడికల్ టెక్నాలజీపై లోతుగా పరిశోధనలు జరుగుతున్నాయని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సదస్సుకు సుమారు వంద దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడ్‌టెక్ జోన్‌లో తయారైన ఎయిర్‌పోర్టు స్కానర్‌ను ప్రదర్శించారు.

● టయోటా కిర్లోస్కర్ మోటార్ మార్కెట్లోకి సరికొత్త క్యామ్రే హైబ్రిడ్ ఎలక్ట్రిక్ కారును తీసుకువచ్చింది. ఐదోతరం హైబ్రిడ్ టెక్నాలజీతో దీన్ని రూపొందించింది. ఈ కారు ధర రూ.48 లక్షలు.

● ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. కంపెనీ ఇప్పటి వరకు జారీ చేసిన క్రెడిట్ కార్డుల సంఖ్య 2 కోట్ల మార్కును అధిగమించింది. ఎస్‌బీఐ కార్డ్స్ 1998లో క్రెడిట్ కార్డు విభాగంలోకి ప్రవేశించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,870 ▼	72,300 ▼	1,01,000 ▼
విజయవాడ	79,500 ▼	73,300 ▼	92,500 ▼
విశాఖపట్నం	77,330 ▼	70,890 ▼	90,900 ▼
రాజమండ్రి	78,870 ▼	72,300 ▼	92,900 ▼
ప్రొద్దుటూరు	79,200 ▼	73,340 ▼	93,000 ▼
ముంబై	76,922 ▼	70,461 ▼	89,976 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	99
కరీంనగర్	91	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	87
కర్నూలు	91	నెల్లూరు	87
విశాఖపట్నం	103	అనంతపురం	87
గోదావరి	99		

ముందస్తు బెయిల్ ఇవ్వండి

▸ రేషన్ బియ్యం మాయం కేసులో కోర్టును ఆశ్రయించిన పేర్ని జయసుధ

మచిలీపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని మాయం చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధ కోర్టును ఆశ్రయించారు. శుక్రవారం కృష్ణా జిల్లాలోని 9వ అదనపు జిల్లా కోర్టులో ఆమె ముందస్తు బెయిల్ దరఖాస్తు దాఖలు చేశారు. జయసుధ పేరిట ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యంలో 187 టన్నులు కనిపించకుండా పోయాయని పౌరసరఫరాల శాఖ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై బీఎన్ఎస్ 316(3), 316(5), 61(2), రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద మచిలీపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోసం పేర్ని జయసుధ జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుంటే, వైసీపీ హయాంలో నియమించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జిల్లా కోర్టులో పనిచేస్తుండటంతో ఆమెకు బెయిల్ వచ్చే అంశంలో ఏం జరుగుతుందో వేచి చూడాలని సీనియర్ న్యాయవాదులు వ్యాఖ్యానిస్తున్నారు.

'పునరుత్పాదక' పెట్టుబడుల కేంద్రంగా ఏపీ: గొట్టిపాటి

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక విద్యుత్తురంగంలో పెట్టుబడుల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పునరుత్పాదక విద్యుదుత్పత్తి సంస్థల యాజమాన్య ప్రతినిధులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీపై చర్చ జరిగింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు రంగంలో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామిక విధానంపై చర్చించారు. సాయెల్ సోలార్ ప్రతినిధులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'మేం రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుదుత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేస్తాం. దేశంలోని 12రాష్ట్రాల్లో పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఇప్పటికే స్థాపించాం. మేం సోలార్ ప్యానెళ్ల తయారీలోనూ కీలక భూమిక పోషిస్తున్నాం' అని ఆ ప్రతినిధులు వివరించారు. వీరితోపాటు నార్వే, బ్రెజిల్, రష్యా, చైనా దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తల బృందమూ రవికుమార్‌ను కలిసింది. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ... 'రాష్ట్రం పెట్టుబడులకు స్థావరంగా మారుతోంది. ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీని పారిశ్రామికవేత్తలకు సానుకూల ధోరణితో రూపొందించాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలను అందిస్తుంది' అని మంత్రి రవికుమార్ చెప్పారు.

ఏపీలో 9 లక్షల కేసులు పెండింగ్

▸ లోక్‌సభలో మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కోర్టుల్లో లక్షల సంఖ్యలో సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్రం లోక్‌సభకు తెలిపింది. శుక్రవారం టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 'ఏపీ హైకోర్టు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో గత మంగళవారం (డిసెంబరు 10 వరకూ) వరకు 8,99,895 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ హైకోర్టు అందించిన సమాచారం ప్రకారం అక్టోబరు 31 వరకు ఒక్క ఏలూరు జిల్లాలో 65,848 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి' అని తెలిపారు.

ఒంగోలుకు విజయ్‌పాల్ తరలింపు

▸ ఆరున్నర గంటల పాటు విచారణ.. నేడూ విచారించనున్న పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు రెండు రోజుల పాటు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో విచారణాధికారిగా ఉన్న ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన్న విచారించారు. కోర్టు ఆదేశాల ప్రకారం విజయ్‌పాల్ న్యాయవాది సమక్షంలో ఆరున్నర గంటల పాటు విచారణ కొనసాగింది. ఉదయం 10గంటలకు గుంటూరు జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు విజయపాల్‌ను భారీ భద్రత మధ్య ఒంగోలు తరలించారు. తాలూకా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అక్కడ నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి మధ్యాహ్నం ఒంటిగంటకు తీసుకెళ్లారు. అక్కడ రాత్రి 7.30 వరకు విచారించారు. అప్పట్లో రఘురామరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి కారణం ఎవరు? మెడికల్ రిపోర్టును మార్పు చేయడానికి ఎవరు ఒత్తిడి చేశారు? అనే అంశాలపై విచారణ కొనసాగినట్లు తెలిసింది. శనివారం కూడా విజయ్‌పాల్‌ను పోలీసులు విచారించనున్నారు.

జత్వానీపై కేసు.. గత సీఎంవో కుట్ర

▸ పోలీసు ఉన్నతాధికారులు భాగస్వాములు
▸ పిటిషనర్లు పోలీసు ఉన్నతాధికారులు
▸ బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు
▸ వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్
▸ నిందితురాలే కేసు పెడితే ఎలా: పిటిషనర్లు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జత్వానీపై కేసు నమోదు, అరెస్టుకు సంబంధించి గత ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) వేదికగానే కుట్ర జరిగిందని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ శుక్రవారం హైకోర్టుకు తెలిపారు. కుట్రలో పోలీసు ఉన్నతాధికారులు భాగస్వాములు అయ్యారన్నారు. "కుక్కల విద్యాసాగర్ నుంచి ఫిర్యాదు అందకముందే జత్వానీని కేసులో ఇరికించేందుకు పోలీసులు ఉన్నతాధికారులు ప్రణాళిక రచించారు. విజయవాడ డీసీపీగా పనిచేస్తూ విశాఖకు బదిలీ అయిన విశాల్ గున్నీని రిలీవ్ చేయకుండా జత్వానీ కేసును పర్యవేక్షించేందుకు ముంబైకి పంపించారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాతే రిలీవ్ చేస్తామని గున్నీకి అప్పటి విజయవాడ కమిషనర్ కాంతి రాణా తాతా స్పష్టం చేశారు. క్రమశిక్షణ సంఘం ముందు విశాల్ గున్నీ ఇచ్చిన వాంగ్మూలం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. సీఎంవో స్థాయిలో జరిగిన కుట్రను వెలికితీసేందుకు పిటిషనర్లను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉంది. ఫోర్జరీ డాక్యుమెంట్‌తో జత్వానీ తన భూమిని విక్రయించేందుకు ప్రయత్నించారని కుక్కల విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేశారు. అదే రోజు ఉదయం 6 గంటలకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు అందడానికి ఒకరోజు ముందే పోలీసులు ముంబైకి వెళ్లేందుకు వీలుగా టికెట్లు బుక్ చేయాలని అప్పటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా తాతా.. తన క్యాంప్ క్లర్క్‌ను ఆదేశించారు. కేసు నమోదయ్యే సమయానికి ముంబైకి వెళ్లేందుకు ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని, ఇతర పోలీసు అధికారులు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. జత్వానీని కేసులో ఇరికించేందుకు పిటిషనర్లు కుట్ర చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. కేసు దర్యాప్తు కీలక దశలో ఉంది. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా పిటిషనర్లను అదుపులోకి తీసుకుని కుట్రకోణాన్ని వెలికి తీయలేకపోయాం. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు. నకిలీ డాక్యుమెంట్ ఎవరు సృష్టించారు? జత్వానీపై కేసు నమోదు వెనుక ఎవరున్నారు? ఎవరి పాత్ర ఏమిటి? అనేవి వెలికితీసేందుకు పిటిషనర్ల కస్టోడియల్ విచారణ అవసరం. పిటిషనర్ల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి" అని ఏజీ కోరారు.



గతంలో ఇలా లేదు: జత్వానీ

జత్వానీ తరఫు న్యాయవాది వాసిరెడ్డి ప్రభునాథ్, నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. "రాష్ట్రంలో గతంలో ఎన్నడూ ఇలాంటి కేసు నమోదు కాలేదు. నిఘా విభాగాధిపతి డీజీ స్థాయి పోలీసు ఉన్నతాధికారి నుంచి కానిస్టేబుల్ వరకు నేరంలో భాగస్వాములయ్యారు. జత్వానీపై కేసు నమోదు చేయడంలో అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులది కీలకపాత్ర. ఆయన ఇచ్చిన మౌఖిక ఆదేశాలతోనే జత్వానీని అరెస్ట్ చేసి రాష్ట్రానికి తెచ్చేందుకు పోలీసులు ముంబైకి వెళ్లారు. కేసులో నిందితులుగా ఉన్న ప్రతి అధికారి పాత్ర గురించి ప్రాథమిక ఆధారాలున్నాయి" అని కోర్టుకు తెలిపారు. శుక్రవారం కోర్టు సమయం ముగియడంతో బాధితురాలు జత్వానీ తరఫు వాదనలు కొనసాగింపు, పిటిషనర్ల తరఫు రిప్లై వాదనల కోసం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు. పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. జత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా, విశాల్‌గున్నీ, అప్పటి విజయవాడ ఏసీపీ హనుమంతురావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది వెంకటేశ్వర్లు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు వచ్చాయి.

ఆమె పెట్టిన కేసు చెల్లదు: పిటిషనర్లు

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, పట్టాభి, వినోద్‌కుమార్ దేశ్‌పాండే వాదనలు వినిపిస్తూ.. "నకిలీ డాక్యుమెంట్‌తో భూమిని విక్రయించేందుకు ప్రయత్నించారని జత్వానీపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదైంది. ఆ కేసు విచారణను పూర్తిచేసిన పోలీసులు.. చార్జ్‌షీట్ దాఖలు చేయలేదు. నిందితురాలిగా ఉన్న జత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులపై కేసు పెట్టారు. ఇది చెల్లుబాటు కాదు. ఒకే అంశంపై నమోదైన కేసు విచారణ పూర్తికాకుండా రెండో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడానికి వీల్లేదు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి" అని కోర్టుకు వివరించారు.

విద్యారంగంలో సంస్కరణలు తప్పవు

▸ ఇప్పుడు అమలు చేయకపోతే విద్యావ్యవస్థ మనుగడకే ప్రమాదం
▸ ఉపాధ్యాయ సంఘాలతో భేటీలో లోకేశ్

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించడం లక్ష్యంగా సంస్కరణలు అమలుకావాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సంస్కరణలు ఇప్పుడు అమలుచేయలేకపోతే రాబోయే పదేళ్లలో విద్యావ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఉపాధ్యాయ సంఘాలతో ఆయన మొదటి సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యలోనే అనేక అంశాలపై దాదాపు నాలుగు గంటలపాటు వారితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉన్నట్టుగా తమకు ఎలాంటి పరదాలు ఉండవని, సీఎం నుంచి ఎమ్మెల్యే వరకూ అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. సంస్కరణల అమలులో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని వెనక్కి తీసుకుంటామని పేర్కొన్నారు. అపార్ ఐడీల రూపకల్పనలో ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూ వస్తోందని, డ్రాపౌట్లు కూడా పెరుగుతున్నారని ఈ నేపథ్యంలో సంస్కరణలు అమలుచేయక తప్పదని స్పష్టం చేశారు. ఫలితాల విషయంలో ప్రైవేటు పాఠశాలలో పోటీపడాలని నిర్దేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలపై మరింత శ్రద్ధ అవసరమన్నారు. రాష్ట్రంలో 20 కంటే తక్కువ మంది విద్యార్థులున్న బడులు 30 శాతం ఉన్నాయని, 300 పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు వచ్చాయని తెలిపారు. యువగళం పాదయాత్రలో జీవో 117 తన దృష్టికి వచ్చిందని, చిన్నపిల్లలు నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లడం కష్టమని, అందుకే ఆ జీవోను రద్దుచేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని వివరించారు. టీచర్లపై యాప్‌ల భారం తగ్గించామని, ఇంకా అమలులో ఉన్న విద్యేతర యాప్‌లను కూడా తొలగించే ప్రయత్నం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఆంధ్రా మోడల్ విద్యా విధానం టీచర్లతోనే సాధ్యమని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్క పాఠశాల కూడా మూతపడకూడదని మంత్రి లోకేశ్ ఆదేశించారని తెలిపారు. ఫలితాల సాధన, హాజరుశాతం పెంపునకు టీచర్లు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఉన్నతాధికారులు వి.విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి, ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, పీవీ రమణ, వి.శ్రీనివాసరావు, జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, సీహెచ్.మంజుల, కె.భానుమూర్తి ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ ఎ.ఎం.గిరిప్రసాద్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

కడప జైలు నుంచి వర్రాను కస్టడీలోకి తీసుకోండి!

▸ విశాఖ జైల్లో ఉన్న రవీందర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై జడ్జి ఆదేశాలు
▸ విశాఖ జైలును ఆదేశించాలని ఏపీపీ వినతి
▸ వీలు పడదన్న జడ్జి... రివిజన్ పిటిషన్ దాఖలు

కడప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కో కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డిని రెండు రోజుల పాటు(13, 14 తేదీలు) పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ గురువారం ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అదనపు జిల్లా కోర్టు) జడ్జి దీనబాబు ఆదేశాలు జారీచేశారు. అయితే.. విశాఖపట్నం సెంట్రల్‌లో ఉన్న వర్రాను ఈ ఆదేశాలతో కస్టడీలోకి తీసుకోవడం సాధ్యం కాదని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) జడ్జికి తెలిపారు. అయినప్పటికీ తన ఆదేశాలను పాటించాలని జడ్జి కోరడంతో ఆయన ఆదేశాల ప్రకారం వర్రాను పోలీసు కస్టడీకి అప్పగించాలని కడప సెంట్రల్ జైలు అధికారులను పోలీసులు కోరారు. కానీ, వర్రా తమ జైలులో లేరని వారు పేర్కొన్నారు. దీంతో పోలీసుల అభ్యర్థన మేరకు కడప జైలు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ విషయం అదేరోజు జడ్జి దీనబాబుకు ఏపీపీ తెలిపారు. ఈ క్రమంలో విశాఖ జైలు అధికారులకు డైరెక్షన్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి వీలుపడదని స్పష్టం చేసిన జడ్జి.. వేరే పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించారు. దీంతో గురువారం రాత్రి ఏపీపీ హుటాహుటిన రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. కానీ, శుక్రవారం ఈ పిటిషన్ విచారణకు రాలేదు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం విచారణకు రానుంది.

డాక్టర్ ప్రభావతికి ముందస్తు బెయిల్ నో!

గుంటూరు (లీగల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఎంపీగా ఉన్న సమయంలో కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన కేసులో 5వ నిందితురాలుగా ఉన్న డాక్టర్ ప్రభావతికి గుంటూరు జిల్లా కోర్టు షాకిచ్చింది. ఆమె దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి వై. నాగరాజు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేయకుండా తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగిశాయి. మెడికల్ బోర్డు చైర్మన్‌గా ఉన్న తాను ఈ కేసుకు సంబంధించిన బోర్డులోని ఇతర వైద్యులిచ్చిన రిపోర్టుల ఆధారంగా నివేదిక ఇచ్చానని ఆమె పేర్కొన్నారు. తాను నిర్దోషినని అనారోగ్యంతో ఉన్నానని తెలిపారు. ఈ క్రమంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కాగా, బాధితుడైన రఘురామ తన న్యాయవాదులు వినాలని ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఆయన తరఫున న్యాయవాదులు వీవీ లక్ష్మీ నారాయణ, కావూరి గోపీనాథ్ వాదనలు వినిపించారు. కస్టడీలో తనపై జరిగిన హత్యాయత్నం కేసులో డాక్టర్ ప్రభావతి భాగస్వామి అయ్యారని, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్య బృందం ఇచ్చిన నివేదికను ఆమె దురుద్దేశంతో ట్యాంపరింగ్ చేశారని పేర్కొన్నారు. ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేయరాదని కోర్టును కోరారు. మరోవైపు, ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ప్రభావతి రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సింది పోయి మిగిలిన నిందితులతో కుమ్మక్కయ్యారని కోర్టుకు తెలిపారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ప్రభావతికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

కొత్త కబురు



తమిళ హీరో విక్రమ్ నటిస్తున్న కొత్త చిత్రం ఖరారైంది. శాంతి పిక్చర్స్ సంస్థ అధినేత అరుణ్ విశ్వ నిర్మించే ఈ చిత్రానికి మడోన్ అశ్విన్ దర్శకుడు. కొత్త తరహా కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో విక్రమ్ పాత్ర వినూత్నంగా ఉండబోతోందని దర్శకుడు అశ్విన్ చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాత అరుణ్ మాట్లాడుతూ 'హీరోగా విక్రమ్ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించిన ఆయనతో సినిమా తీయడం ఆనందంగా ఉంది. అలాగే 'మండేలా', 'మా వీరన్' చిత్రాల దర్శకుడు అశ్విన్‌తో కలసి మరో సారి పని చేస్తున్నాం. త్వరలో షూటింగ్ ప్రారంభమవుతుంది' అని చెప్పారు.

ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ..



తమిళ హీరో సూర్య నటించే 45వ చిత్రం ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ పొల్లాచ్చిలో జరుగుతోంది. ఇందులో హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నట్లు చిత్ర నిర్మాతలు ఎస్.ఆర్. ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్. ప్రభు చెప్పారు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ సూర్య, త్రిష ఇందులో జంటగా నటిస్తుండడం విశేషం. పేరు నిర్ణయించని ఈ సినిమాలో సూర్య, త్రిష ఇద్దరూ లాయర్ పాత్రలు పోషిస్తుండడం మరో విశేషం. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆర్జే బాలాజీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

రామ్‌చరణ్‌కు 'రంగస్థలం'... నరేశ్‌కి 'బచ్చలమల్లి'

నిర్మాత రాజేశ్ దండా



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'బచ్చలమల్లి', సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత రాజేష్ దండా మీడియాతో ముచ్చటిస్తూ' బచ్చలమల్లి 80వ దశకంలోని కథ. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథను మూడేళ్ల క్రితమే విన్నాను. సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశాను. ఇది ఫ్యామిలీ యాక్షన్ డ్రామా. క్యారెక్టర్ డ్రివెన్ సినిమా ఇది. ఈ మూవీ డైరెక్టర్ ఊరు తుని. ఆ ఊర్లో బచ్చలమల్లి అనే వ్యక్తి ఉండేవాడు. అతని రియల్ లైఫ్‌లో జరిగిన ఒక సంఘటనను మాత్రమే తీసుకుని అల్లిన కథ. మిగతాదంతా ఫిక్షన్. రామ్‌చరణ్‌కి 'రంగస్థలం' ఎలాగో, నరేశ్‌కి 'బచ్చలమల్లి' అలాంటి సినిమా అవుతుంది. కథ ప్రకారం సహజమైన లొకేషన్లలో తీయాలని అన్నవరం, తుని చుట్టుపక్కల గ్రామాల్లో చిత్రీకరించాం. మూర్ఖత్వం హద్దులు దాటితే ఎలా ఉంటుందో.. అలాంటి పాత్రలో నరేశ్ నటించారు. జీవితంలో తప్పులు చేయొచ్చు. సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే ఏంటీ అనేది చిత్ర కథ' అని చెప్పారు.

భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్టు చేస్తారా?



అల్లు అర్జున్ అరెస్టుపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తూ నాలుగు ప్రశ్నలు వేశారు. అవి ఏమిటంటే..
1. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల తోపులాటలో భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్టు చేస్తారా? 2. ఎన్నికల ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా మరణిస్తే రాజకీయ నాయకులని అరెస్టు చేస్తారా?
3. సినిమాల ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎవరైనా చనిపోతే హీరో, హీరోయిన్లని అరెస్టు చేస్తారా? 4. భద్రత ఏర్పాట్లను పోలీసులు, నిర్వాహకులు తప్ప హీరోలు, నాయకులు ఎలా కంట్రోల్ చేస్తారు?

నవ్య | చిత్రజ్యోతి

అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేయడం సరికాదంటూ మొదట బాలీవుడ్ నుంచి వరుణ్ ధావన్ స్పందించారు. ఆ తర్వాతే టాలీవుడు సెలబ్రిటీలు ట్వీట్ చేశారు.

హృదయ విదారక ఘటన



సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే అత్యుత్సాహం సాధారణ పౌరుల రక్షణలో కూడా చూపించాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు. - నాని

నమ్మలేక పోతున్నా



ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు. - రష్మిక

బాధాకరం



సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. - అనిల్ రావిపూడి

దురదృష్టకరం



థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య. - అడవి శేష్

అన్యాయం



ఈ ఘటన బాధాకరం. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్లు చుట్టు పక్కల వారికి సూచిస్తుంటారు. ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయం. - వరుణ్ ధావన్

జవాబు చెప్పాలి



అల్లు అర్జున్ ఏమైనా టెర్రరిస్టా? ఇంట్లోకి దూరి అరెస్ట్ చేయడం ఏమిటి? ఈ అరెస్టుపై రేవంత్ రెడ్డి అందరికీ జవాబు చెప్పాలి. - రవి కిషన్


నాంపల్లి కోర్టు వద్ద గుమిగూడిన జనం

జైల్లో పుష్ప

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి/రాంనగర్/అడ్డగుట్ట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సినిమాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు చిక్కకుండా సవాలు విసిరే పుష్పరాజ్.. నిజ జీవితంలో మాత్రం జైలుకు వెళ్లాల్సి వచ్చింది. వెండితెరపై 'తగ్గేదేలే' అంటూ మేనరిజం ప్రదర్శించిన నటుడు చట్టం ముందు తగ్గాల్సివచ్చింది. తన సినిమా ప్రీమియర్ షో చూసేందుకు థియేటర్‌కు స్వయంగా వెళ్లి.. తొక్కిసలాటలో ఓ మహిళ మృతికి కారణమయ్యారన్న ఆరోపణలపై నమోదైన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరు పరచగా.. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే ఆ వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినా.. ఆ పత్రాలు సకాలంలో జైలుకు చేరకపోవడంతో అల్లు అర్జున్ విడుదల వాయిదా పడింది. కోర్టు ఉత్తర్వులు అప్‌లోడ్ చేసేసరికి రాత్రి 11 గంటలు దాటిపోవడంతో ఆయనను శనివారం ఉదయం విడుదల చేస్తామని జైలు అధికారులు ప్రకటించారు. దీంతో రాత్రంతా ఆయన జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, అల్లు అర్జున్ అరెస్టు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పలువురు సినీ ప్రముఖులు ఆయనకు సంఘీభావం ప్రకటించగా.. అరెస్టును ప్రతిపక్ష బీఆర్ఎస్, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

తెల్లవారితే పుష్ప-2 సినిమా విడుదలవుతుందనగా.. ఈ నెల 4వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేయడం, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి(35) మృతి చెందడం, ఆమె కుమారుడు శ్రీతేజ్ (13) అపస్మారక స్థితికి చేరుకొని చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరితోపాటు తొక్కిసలాటలో మరి కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంతోపాటు.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రీమియర్ షో వీక్షించడానికి హీరో అల్లు అర్జున్ రావడం కూడా కారణమని పోలీసులు భావించారు. ఈ మేరకు ఆయనపై 105 (హత్య కిందకు రాని ప్రాణ నష్టం), 118(1) (ప్రమాదకరంగా వ్యవహరించడం, వేరే వ్యక్తులు గాయపడేందుకు కారణం కావడం) రెడ్‌విత్ 3(5), నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఏ-11గా చేర్చారు. అల్లు అర్జున్ నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా, బయట క్రిస్టల్ హోటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో అభిమానులకు అభివాదం చేసుకుంటూ రావడంతో ఒక్కసారిగా వందలాది అభిమానులు ఆయనవైపు చొచ్చుకొని రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో మహిళ మృతి చెంది, ఆయన కొడుకు తీవ్ర గాయాల పాలయ్యారని సెంట్రల్ జోన్ డీసీపీ వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.. ఇటీవల థియేటర్ భాగస్వామి ఎం.సందీప్, మేనేజర్ నాగరాజు, బాల్కనీ ఇన్‌చార్జి విజయ్ చందర్‌లను అరెస్టు చేశారు. ఏ11గా ఉన్న అల్లు అర్జున్ శుక్రవారం ఇంట్లోనే ఉన్నట్లు తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు జూబ్లీహిల్స్‌లోని నివాసంలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన తండ్రి అల్లు అరవింద్ సైతం పోలీసుల కారులోనే మధ్యాహ్నం 12:30కు స్టేషన్‌కు చేరుకున్నారు.

గంటపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డు..

అల్లు అర్జున్‌ను పీఎస్‌లోకి తీసుకువెళ్లిన తర్వాత ఎవరినీ లోనికి రాకుండా పోలీసులు గేట్లు మూసివేశారు. డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ ఆధ్వర్యంలోని బృందం గంటపాటు ఆయనను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఓవైపు ప్రశ్నిస్తూనే రిమాండ్ రిపోర్ట్‌ను తయారు చేశారు. మధ్యాహ్నం 1:30కు అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. 'పుష్ప అరెస్టు' అంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయన్ను చూసేందుకు అభిమానులతోపాటు.. స్థానిక ప్రజలు ఎగబడ్డారు. అల్లు అర్జున్‌ను విచారిస్తున్న క్రమంలో ఆయన తండ్రి అల్లు అరవింద్, సినీ నిర్మాత దిల్ రాజు, అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డిని మాత్రమే లోపలికి రానిచ్చారు. ఆయన సోదరుడు అల్లు శిరీష్, కేల శ్రీకాంత్ అనే స్నేహితుడు పీఎస్‌కు చేరుకోగా వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా, మధ్యాహ్నం 2:15 గంటలకు అల్లు అర్జున్‌ను వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు పూర్తయ్యాక భారీ బందోబస్తు నడుమ 3:10 గంటలకు నాంపల్లి కోర్టుకు తీసుకొచ్చి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. సుమారు 45 నిమిషాలపాటు ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం సాయంత్రం 4:00 గంటలకు అల్లు అర్జున్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన క్రమంలో హైదరాబాద్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్ కోర్టులోనే ఉండి పోలీస్ భద్రత, బందోబస్తును పర్యవేక్షించారు. అటు చంచల్‌గూడ జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో ప్రత్యేక పోలీస్ బృందం భారీ బందోస్తు నడుమ అర్జున్‌ను జైలుకు తరలించింది. విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద ఎత్తున జైలు వద్దకు చేరుకున్నారు.


గాంధీ ఆస్పత్రి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్


చిక్కడపల్లి పోలిస్‌స్టేషన్ వద్ద అల్లు అరవింద్, కంచర్ల చంద్రశేఖరరెడ్డి

అరెస్టుకు ముందు పోలీసులపై 'పుష్ప' ఫైర్..

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన కేసుకు సంబంధించి నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసేందుకు వచ్చిన చిక్కడపల్లి పోలీసులపై తొలుత ఆయన ఫైర్ అయినట్లు తెలిసింది. బట్టలు మార్చుకుని వస్తానని చెప్పినా.. పోలీసులు అనుమతించకపోవడంతో ఇది మంచి పద్ధతి కాదని ఆయన అన్నట్లు సమాచారం. "మీరు ఇక్కడికి రావడం, నేను మీతో స్టేషన్‌కు రావడంలో తప్పులేదు. కానీ, బెడ్రూం నుంచి నేరుగా తీసుకెళతాననడం సరికాదని పోలీసులపై ఫైర్ అయినట్లు తెలిసింది. మరోవైపు అల్లు అర్జున్ కంటే ముందే ఆయన తండ్రి అరవింద్ పోలీసు వాహనంలోకి ఎక్కగా.. ఆయన్ను కారులో రావద్దని పోలీసులు వారించారు. అయినా, వినకపోవడంతో అల్లు అర్జున్ కలుగజేసుకొని.. మంచైనా, చెడైనా తనకే వదిలేయండని తండ్రికి చెప్పారు. తండ్రిని కారునుంచి దించేశారు. ఇక అరెస్టుకు ముందు అర్జున్ కాఫీ తాగుతూ.. తన పక్కనే విచారవదనంతో ఉన్న ఆయన సతీమణిని ఓదార్చారు. కంగారు పడవద్దని భరోసా ఇచ్చారు. ఆపై బుగ్గపై సుతారంగా ముద్దాడారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బందోబస్తు కోసం చాలా దరఖాస్తులు వస్తుంటాయి: డీసీపీ

రాజకీయ నాయకులు, సినీ నటులు, ధార్మిక కార్యక్రమాల సందర్భంగా పోలీస్ బందోబస్తు కోసం అనేక లేఖలు వస్తుంటాయని, కార్యక్రమంలో పాల్గొనే వారిని బట్టి తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ తెలిపారు. పెద్ద స్థాయిలో బందోబస్తు కావాలనుకున్న వారు, డీసీపీ, ఏసీపీని కలిసి వివరాలు తెలిపితే దానికి తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా బందోబస్తు ఏర్పాటు కోసం సంధ్యా థియేటర్ నిర్వాహకులు బందోబస్తు కోసం చిక్కడపల్లి పోలీసులకు పంపిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దానిపై డీసీపీ వివరణ ఇచ్చారు. సంధ్య థియేటర్ నిర్వాహకులు అధికారులను కలవకుండా ఇన్‌వార్డ్ విభాగంలో లేఖను అందించారని తెలిపారు. దానికి తగిన విధంగా థియేటర్ బయట తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆ సినిమా హీరో అల్లు అర్జున్ వచ్చేవరకు జనాలు అదుపులో ఉన్నారని, ఆయన వచ్చి కారు రూఫ్ టాప్ నుంచి బయట ఉన్న అభిమానులకు చేయి ఊపడంతో చాలా మంది థియేటర్ వైపునకు వచ్చారని తెలిపారు. అదే సమయంలో అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది వాహనానికి దారి కల్పించడానికి గుంపుగా చేరిన అభిమానులను పక్కకు నెట్టడం ప్రారంభించారని, దాంతో తొక్కిసలాట జరిగిందని వెల్లడించారు.

అరెస్టు- రిమాండ్- బెయిల్
ఉత్కంఠగా సాగిన యాక్షన్ డ్రామా

పుష్ప-2 ప్రీమియర్ షో తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, అరెస్టు నుంచి బెయిల్ మంజూరు వరకు జరిగిన పరిణామాలు గంట గంటకు ఉత్కంఠభరితంగా సాగాయి. అరెస్టు నుంచి బెయిల్ దాకా శుక్రవారం జరిగిన తీరు ఇది.

- ఉదయం 10:40 : జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న పోలీసులు
- 11.30 : అల్లు అర్జున్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మధ్యాహ్నం 12:30 : పోలీసు స్టేషన్‌కు తరలింపు
- 12:30- 1:30 : డీసీపీ ఆధ్వర్యంలో అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ సేకరణ
- 1:30 : అల్లు అర్జున్‌ను అరెస్టు చేసినట్లు పోలీసుల ప్రకటన
- 2:15 : వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలింపు
- 3:10 : నాంపల్లి కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు
- సాయంత్రం 4:00 : 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- 5:00 : చంచల్‌గూడ జైలుకు తరలింపు
- 5:30 : మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- 6:45 : బెయిల్ పత్రాల రాక కోసం జైలు రిసెప్షన్‌లో ఎదురుచూసిన అల్లు అర్జున్
- రాత్రి 11: సాంకేతిక కారణాలతో విడుదల వాయిదా అంటూ జైలు అధికారుల ప్రకటన

ఖైదీ నంబర్ 7697

» రాత్రంతా చంచల్‌గూడ జైల్లోనే అల్లు అర్జున్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్‌ను నాంపల్లి 9వ చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశం మేరకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచేందుకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈలోగా హైకోర్టు ఆయనకు 4 వారాల పాటు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. కాపీ అందిన వెంటనే విడుదల చేయాలని కూడా ఆదేశించారు. దాంతో అల్లు అర్జున్ విడుదల ఖాయమని అంతా భావించారు. జైలుకు వెళ్లిన అల్లు అర్జున్ బెయిల్ పత్రాల కోసం రిసెప్షన్‌లో వేచి ఉన్నారు. అయితే, రాత్రి పదిన్నర గంటల వరకు హైకోర్టు బెయిల్ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో శుక్రవారం రాత్రంతా అల్లు అర్జున్ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో జైలు అధికారులు ఆయన్ను అండర్ ట్రైల్ ఖైదీగా(ఖైదీ నంబర్ 7697) మంజీరా బ్యారక్‌లో ఉంచారు.

ఎందుకు విడుదల చేయలేదు?

సాధారణంగా సూర్యాస్తమయానికి ఖైదీలను బ్యారక్‌లలోకి పంపుతారు. అప్పటివరకు వచ్చే బెయిలు ఆర్డర్లకు సంబంధించిన ఖైదీలను లోపలికి పంపరు. వారందరి బెయిలు పత్రాలను పరిశీలించి, జైలు రికార్డుల్లో ఎంట్రీ చేసి, అందర్నీ ఒకేసారి విడుదల చేస్తారు. సూర్యాస్తమయం తర్వాత వచ్చే బెయిలు ఆర్డర్లకు సంబంధించి ఖైదీలను అప్పటికే బ్యారక్‌లకు పంపడం వల్ల వారిని విడుదల చేయరు. కానీ, వారికి సంబంధించిన బెయిలు పత్రాలను పరిశీలించి, జైలు రికార్డుల్లో ఎంట్రీ చేస్తారు. సూర్యోదయం కాగానే వారిని విడుదల చేస్తారు. అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు నుంచి 5.20కు చంచల్‌గూడ జైలుకు తీసుకువచ్చారు. 6 గంటల్లోపే ఆయనకు బెయిలు సమాచారం అందింది. దాంతో ఆయన ఏ క్షణమైనా విడుదల అవుతానన్న భరోసాతో ఉన్నారు. ఆరు గంటల వరకు బెయిలు కాపీలు రాకపోవడంతో మరి కాసేపు వేచిచూసి ఆయన్ను నిబంధనల ప్రకారం బ్యారక్‌లోకి పంపారు. అప్పుడే ఆయన రాత్రంతా జైల్లో ఉండటం ఖాయమైంది. ఆయనను ముగ్గురు ఖైదీలుండే బ్యారక్‌లో ఉంచారు. జైల్లో అల్లు అర్జున్‌కు భోజనం ఇచ్చినా తినలేదు. 14 రోజుల రిమాండ్ విధించినపుడు న్యాయాధికారి ఆయనను ప్రత్యేక ఖైదీగా పరిగణించాలని ఆదేశించారు. అయితే, ఆ సౌకర్యాలు జైల్లోకి వచ్చిన మర్నాడు మాత్రమే అందుతాయి. ఆయనకు కొత్త రగ్గు, కొత్త దుప్పటి ఇచ్చారు. శనివారం ఉదయం ఏడుగంటల్లోపే అల్లును విడుదల చేస్తారు.

మహిళ మృతికి అల్లు అర్జున్ కారణమే!

» ఆయన సెక్యూరిటీ సిబ్బంది, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఇది జరిగింది

» రిమాండ్ రిపోర్టులో వివరాల నమోదు

సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట, మహిళ మృతి ఘటనలో సినీ హీరో అల్లు అర్జున్, అతడి సెక్యూరిటీ సిబ్బంది, థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణమని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అల్లు అర్జున్ రాక సందర్భంగా తొక్కిసలాట జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో థియేటర్ యాజమాన్యం విఫలమైందని తెలిపారు. సినీ హీరో వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక దారి కేటాయించలేదని, అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ ప్రేక్షకులను నెట్టి వేయడంతోనే తొక్కిసలాట జరిగి మహిళ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను రిపోర్టులో నమోదు చేశారు. పుష్ప 2 విడుదల సందర్భంగా ఈ నెల 4వ తేదీన సంధ్య థియేటర్‌లో ప్రీమియర్ షో వేశారు. థియేటర్‌లో 1323 సీటింగ్ కెపాసిటీ ఉంది. థియేటర్ యాజమాన్యం టికెట్లను రూ.1100, రూ.1000 చొప్పున విక్రయించారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్, రేవతి దంపతులు కుమారుడు శ్రీతేజ్, కుమార్తెతో కలిసి రాత్రి 9.10 గంటలకు థియేటర్‌కు వచ్చారు. రాత్రి 9.40 గంటలకు అల్లు అర్జున్, అతడి కుటుంబం ప్రైవేటు సెక్యూరిటీతో థియేటర్‌కు వచ్చారు. అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. అల్లు అర్జున్ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందితోపాటు థియేటర్ సిబ్బంది ప్రేక్షకులను తోసివేశారు. దీంతో జరిగిన తోపులాటలో అందరూ లోవర్ బాల్కనీ వైపుకు వెళ్లారు. ఈ సమయంలో రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ్ తొక్కిసలాటలో గాయపడ్డారు. తన భార్య పిల్లలు లోవర్ బాల్కనీలోని జనంలో ఉంటారని భావించిన భాస్కర్ కుమార్తెను తీసుకొని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ కుమార్తెను వదిలి బంధువుతో కలిసి థియేటర్ వద్దకు వచ్చారు. అక్కడ తన భార్య రేవతి, కుమారుడు శ్రీతేజ్ కనిపించకపోవడంతో పోలీసులను సంప్రదించారు. కాగా, థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి, శ్రీతేజ్ గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఈలోపే రేవతి చనిపోనట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.

సతీసమేతంగా అర్జున్ ఇంటికి చిరంజీవి

అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారనే వార్త తెలుసుకున్న సినీ నటుడు చిరంజీవి వెంటనే అల్లు ఇంటికి వెళ్లారు. తన తదుపరి సినిమా చిత్రీకరణ పనుల్లో ఉన్న చిరంజీవి.. షూటింగ్ రద్దు చేసుకుని భార్య సురేఖతో కలిసి అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటికి చిరంజీవి సోదరుడు నాగబాబు కూడా అక్కడికి చేరుకున్నారు. చిరంజీవి దంపతులు అల్లు అర్జున్ నివాసంలో చాలాసేపు ఉన్నారు.

14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టు అయిన అల్లు అర్జున్‌ను 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపాలని గురువారం నాంపల్లి కోర్టు ఆదేశించింది. తొలుత గాంధీ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాల సమయంలో నాంపల్లిలోని 9వ అడిషనల్ మెట్రోపాలిటన్ కోర్టులో పోలీసులు ఆయన్ను ప్రవేశపెట్టారు. గంటన్నరకు పైగా ప్రభుత్వ న్యాయవాదికి, అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డికి మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. భారీ సంఖ్యలో అభిమానులున్న అల్లు అర్జున్ ప్రజల్లోకి వెళ్లేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. 'అర్జున్ సంధ్య థియేటర్‌కు సినిమా చూడడానికి వచ్చినపుడు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోలేదు. ముందస్తు ఏర్పాట్లు కూడా చేసుకోలేదు. పైపెచ్చు ముందస్తు అనుమతి లేకుండా రోడ్‌షో చేయడంతో ఒక్కసారిగా అభిమానులు ఆయనను చూడడానికి నెట్టుకోవడం ప్రారంభించారు. అభిమానులు ఆయన తోపాటే సంధ్య థియేటర్‌లోకి చొచ్చుకువచ్చారు. ఆయనకు భద్రత కల్పించేందుకు బౌన్సర్లు అభిమానులను ఇష్టానుసారం నెట్టేయడంతో తొక్కిసలాట జరిగింది. తన భద్రతకు కోసం బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్న అర్జున్, ప్రజల భద్రత గురించి కూడా అదే తరహాలో ఆలోచిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు" అని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న విధంగా సెక్షన్ 105 (నాన్ బెయిలబుల్), సెక్షన్ 118(1), రెడ్ విత్ 3(5), బీఎన్ఎస్ సెక్షన్ల కింద అర్జున్‌కు జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరారు.

పోలీసుల వైఫల్యమే!

'పుష్ప2' సినిమా నిర్మాతలు ప్రభుత్వం నుంచి ముందే ప్రీమియర్ షోలకు అనుమతి తీసుకున్నారని, ఈ చిత్రానికున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని అభిమానుల తాకిడిని అంచనా వేసి తగు ఏర్పాట్లు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి వాదించారు. పోలీసుల సమక్షంలోనే జరిగిన తొక్కిసలాటకు అల్లు అర్జున్‌ను మాత్రమే బాధ్యుడిని చేయడం సబబు కాదన్నారు. పోలీసుల అజాగ్రత్త కూడా ఇందులో ఉందని, ఫిర్యాదుదారుడు తన భార్య ఊపిరాడక చనిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు కానీ ఎవరినీ బాధ్యులు చేయలేదని ప్రస్తావించారు. ఈ సెక్షన్లు అల్లు అర్జున్‌కు వర్తించవని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది.

హైకోర్టు మధ్యంతర బెయిల్!

4 వారాలు ఊరట.. జైలుకు వెళ్లిన కొద్ది గంటల్లోనే విడుదలకు ఆదేశం

» 'హత్య చేసే ఉద్దేశంతో దాడి' ఇక్కడ లేదు

» క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిలివ్వొచ్చు

» తీర్పు సందర్భంగా జస్టిస్ శ్రీదేవి వ్యాఖ్యలు

» తొక్కిసలాట పోలీసుల వైఫల్యమే..

» అల్లు అర్జున్ తరపు న్యాయవాది

» క్వాష్ పిటిషన్‌లో బెయిలివ్వడం ఏంటి?

» నటుడైతే లంచ్ మోషన్ ఇస్తారా?

» వ్యతిరేకించిన ప్రభుత్వ న్యాయవాది


అరెస్టుకు ముందు భార్యతో అల్లు అర్జున్

హైదరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నిందితుడు, సినీ హీరో అల్లు అర్జున్‌కు తెలంగాణ హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ప్రసాదించింది. ఈ కేసులో శుక్రవారం ఆయన అరెస్టయి జైలుకు వెళ్లిన కొద్ది గంటల్లోనే బెయిలు లభించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట సంఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హత్య చేసే ఉద్దేశంతో దాడి చేయడం, ఉద్దేశ పూర్వకంగా పదునైన ఆయుధాలతో దాడి చేయడం వంటి సెక్షన్లు ప్రస్తుత కేసుకు వర్తించవని హైకోర్టు పేర్కొంది. నిర్లక్ష్యం వల్ల మరణం జరిగిందనుకున్నా ఆ నేరానికి పడే గరిష్ఠ శిక్ష ఐదేళ్లే కాబట్టి బెయిల్‌కు పిటిషనర్ అల్లు అర్జున్ అర్హుడని పేర్కొంది. ఏడేళ్లలోపు జైలుశిక్ష పడే కేసుల్లో అరెస్ట్ అవసరం లేదు కాబట్టి.. ఇది బెయిలబుల్ కేసేనని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం పేర్కొంది. 'మొదట ఈ కేసులో లంచ్ మోషన్ విచారణకు అనుమతి ఇవ్వొద్దని అనుకున్నాను. సామాన్య పౌరులు అయితే లంచ్ మోషన్ ఇద్దామనుకున్నాను. సెలబ్రిటీ అయినందుకు పిటిషనర్ స్వేచ్ఛను కోల్పోవాలా? అనే ప్రశ్న భోజన విరామం సమయంలో నన్ను తొలచివేసింది. సెలబ్రిటీ అయినందుకు పిటిషనర్ స్వేచ్ఛను కోల్పోతుంటే చూస్తూ ఉండటం సమంజసం కాదని అనిపించింది' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి వ్యాఖ్యానించారు. "అర్నబ్ గోస్వామి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఈ హైకోర్టులో ఇద్దరు జడ్జిలు క్వాష్ పిటిషన్‌లో బెయిల్ మంజూరు చేశారు. ఒకటి 489ఎ వ్యవహారంలో ఒక సామాన్యునికి బెయిల్ లభించింది. బండి సంజయ్ కేసులో దిగువ కోర్టు రిమాండ్ విధించినప్పటికీ ఇదే హైకోర్టులో జడ్జిగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ బెయిల్ మంజూరు చేశారు. క్వాష్ పిటిషన్‌లో సైతం బెయిల్ మంజూరు చేయవచ్చు. పరిమితంగా నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇస్తున్నాం. ఆలోపు పిటిషనర్ తన ఎదుట ఉన్న న్యాయపరమైన అంశాలను వినియోగించుకోవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు సంధ్య థియేటర్ యజమానులకు సైతం మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. సంధ్య థియేటర్ యజమానుల్లో అరెస్ట్ కాకుండా ఉన్న మిగతా యజమానులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టంచేసింది. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుందని తెలిసి సాధారంగా ఎవరైనా దూరంగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది.

పోలీసులదే పూర్తి తప్పు: అర్జున్ న్యాయవాది

పుష్ప సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జనాన్ని అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన పోలీసులు ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని అల్లు అర్జున్ తరపు సీనియర్ న్యాయవాది, వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వాస్తవానికి అక్కడ చాలా తక్కువ మంది పోలీసులు బందోబస్తుకు వచ్చారన్నారు. వారు కూడా అల్లు అర్జున్‌ను, సినిమాను చూడటానికి పోటీ పడ్డారని, జనాన్ని అదుపు చేసే విషయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని, పోలీస్ స్టేషన్‌లో అల్లు అర్జున్‌ను చూడవచ్చని వారు భావించారని ఆరోపించారు. అర్నబ్ గోస్వామి కేసులో బాంబే హైకోర్టు బెయిల్ ఇవ్వకపోతే సుప్రీంకోర్టు దానిని సవరించిందని పేర్కొన్నారు. అర్నబ్ గోస్వామి తీర్పు ఆధారంగా ఈ హైకోర్టు ఇప్పటికే రెండు సందర్భాల్లో క్వాష్ పిటిషన్‌లో బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. షారుఖ్ ఖాన్ ఓ సినిమా ప్రమోషన్ కోసం రైల్లో ప్రయాణించినపుడు ఇలాంటి ఘటనే చోటు చేసుకుందని, దుర్ఘటన జరగాలనే ఉద్దేశం షారుఖ్ ఖాన్‌కు లేదు కాబట్టి ఆయనకు సుప్రీంకోర్టు ఊరట కల్పించిందని గుర్తు చేశారు. మరణం సంభవించడం దురదృష్ట ఘటన అని, మొత్తం ఆసుపత్రి ఖర్చులు పిటిషనర్ భరించడంతో పాటు పరిహారం కూడా ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. ఈ దురదృష్టకర ఘటనను ఒకరిపైకి తోసేయడం ఎవరికీ మంచిది కాదన్నారు. ఇతర దేశాల్లో క్రీడలు, ఇతర వేడుకలు జరిగినపుడు పోలీసులు జనాన్ని అదుపు చేయడానికి చూస్తారని, ఇక్కడ పోలీసులు తామే ప్రేక్షకులయ్యేందుకు ఎక్కువ ఆసక్తి చూపారని వ్యాఖ్యానించారు.

అల్లు అర్జున్ వల్లే తొక్కిసలాట: పీపీ పల్లె నాగేశ్వర్‌రావు

అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్‌ను అత్యవసర కేసులకు మాత్రమే అవకాశమిచ్చే లంచ్ మోషన్‌లో విచారణకు అనుమతివ్వడాన్ని ప్రభుత్వ న్యాయవాది(పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. సినీ నటుడు అయినంత మాత్రాన మధ్యాహ్నం 2.20 గంటలకు లంచ్ మోషన్ ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. జడ్జి సమాధానమిస్తూ సంధ్య థియేటర్ యజమానుల కేసు ఇప్పటికే లిస్ట్‌లో ఉందని, దాంతో పాటు వింటామని చెప్పారు. రిమాండ్ రిపోర్ట్ కాపీ సైతం తమ వద్ద లేదని, వాదనలు వినిపించడానికి మరికొంత సమయం కావాలని పీపీ కోరారు. కావాలంటే వారు హౌస్ మోషన్ వేసుకోవచ్చని, తమకు మాత్రం సోమవారం వరకు సమయం కావాలని చెప్పారు. క్వాష్ పిటిషన్‌లో బెయిల్ ఇవ్వరాదని, రెగ్యులర్ బెయిల్ దాఖలు చేసుకునే అవకాశం అల్లు అర్జున్‌కు ఉందని, మధ్యంతర బెయిల్ కోసం వారు దాఖలు చేసిన అప్లికేషన్‌కు నెంబర్ కూడా కాలేదని, ఇంత హడావుడిగా మధ్యంతర బెయిల్ ఇవ్వడం సరి కాదని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ వల్ల ఇప్పటికే ఒక మనిషి చనిపోగా, మృతురాలి కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నారని వ్యాఖ్యానించారు. వాద ప్రతివాదాల అనంతరం అల్లు అర్జున్‌కు నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. క్వాష్ పిటిషన్‌లను రెండు వారాల పాటు వాయిదా వేసింది. ఫిర్యాదుదారుడు అయిన మృతురాలి భర్తకు నోటీసులు జారీ చేసింది.

తప్పును కప్పిపుచ్చుకునేందుకే అరెస్టు : అశ్వినీ వైష్ణవ్



ప్రభుత్వం, యంత్రాంగం తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆరోపించారు. సినీ పరిశ్రమ అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదనే విషయం అల్లు అర్జున్ అరెస్టుతో రుజువైందని ఎక్స్‌లో పోస్టు చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనలో ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం వైఫల్యం కనిపిస్తోంది. దానిని కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

అరెస్టు సమ్మతం కాదు: జగన్



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టును వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ శుక్రవారం ఎక్స్ వేదికగా ఖండించారు. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటనలో అల్లు అర్జున్‌పై నేరుగా కేసులు బనాయించి మరీ అరెస్టు చేయడం ఏమాత్రం సమ్మతం కాదని ట్వీట్ చేశారు. తొక్కిసలాటలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమేనని.. ఆ సమయంలో అర్జున్ బాధ్యతగా వ్యవహరించారని పేర్కొన్నారు.

అల్లు అర్జున్ తప్పు లేదు.. కేసు విత్‌డ్రా చేసుకుంటా

» 'సంధ్య' ఘటనలో మృతురాలి భర్త ప్రకటన

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో అల్లు అర్జున్ తప్పేమీ లేదని పుష్ప -2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో భార్యను కోల్పోయిన భాస్కర్ స్పష్టం చేశారు. అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అల్లు అర్జున్ అరెస్టుపై పోలీసులు తనకేమీ సమాచారం ఇవ్వలేదని, సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నానని తెలిపారు.

ఇంకా వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన బాలుడు శ్రీతేజకు చికిత్స కొనసాగుతోంది. శ్రీతేజకు తొమ్మిది రోజులుగా వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తున్నామని కిమ్స్ వైద్యులు తెలిపారు. శ్రీతేజ ఆరోగ్యం కొంతమేర మెరుగుపడిందని, రక్త ప్రసరణ కూడా సాధారణ స్థితికి చేరుకుందన్నారు.

మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో

జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ముందస్తు బెయిలు ఇవ్వడానికి న్యాయస్థానం నిరాకరించింది. మోహన్‌బాబుకు, ఆయన కుమారుడు మంచు మనోజ్‌కు ఏర్పడిన కుటుంబ వివాదాన్ని కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టుపై మోహన్‌బాబు దాడి చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది.





స్వర్ణాంధ్ర విజన్ 2047ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి అనిత, ఎంపీ కేశినేని చిన్ని, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, స్వర్ణాంధ్ర విజన్ 2047ను స్వాగతిస్తూ.. చేతులు పైకెత్తిన జనం

స్వర్ణాంధ్ర 2047



స్వర్ణాంధ్ర విజన్ 2047 ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేశాం. జీరో పావర్టీ (పేదరిక సంపూర్ణ నిర్మూలన) కోసం ఎన్టీఆర్ కలలు గనే వారు. పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీ4)అనే విధానం ద్వారా నిరుపేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త అనేది నా సంకల్పం. 2047 నాటికి ఇది తప్పక నెరవేరుతుంది. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నాం. ఇందుకు పాలసీలు తెస్తున్నాం. మంచి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. జనాభా నిర్వహణపై దృష్టి సారించాం. రాష్ట్రంలో నాలెడ్జి సొసైటీని తయారుచేసుకోవాల్సిన అవసరముంది. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందేలా అభివృద్ధి వికేంద్రీకరణ ప్రక్రియను చేపడతాం" అని చంద్రబాబు అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఇన్ని ఇబ్బందులు గతంలో పడలేదు

"నేను 1978 నుంచి అనేక ఎన్నికల్లో పోటీ చేశాను. కానీ, 2024 ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది. 93 సక్సెస్ రేట్‌తో 53 శాతం ఓట్లు పడటం నా జీవితంలో ఇదే మొదటిసారి. ప్రజల్లో వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనీయబోమని నాడు స్పష్టం చేశారు. కలిసి ఉంటేనే బలం ఉంటుందని చెప్పి.. రాష్ట్రంలో కూటమిని ఆయన ముందుకు నడిపించారు. 'నాకేం వస్తుంద'ని ఆలోచించకుండా రాష్ట్రానికి జరిగే మేలును మాత్రమే ఆయన వాంఛించారు. రాష్ట్రాభివృద్ధి కోసమే నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్, నేను కలిసి పోటీ చేశాం. నాడు మేం ఊహించిన దాని కంటే అధికంగా జగన్ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అన్ని శాఖలను సమీక్షించాం. గాడి తప్పిన పాలన గాడిలో పెట్టాం. ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాం. ఇన్ని ఇబ్బందులు గతంలో ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఆరు నెలల్లో విజన్ 2047 డాక్యుమెంట్ తెచ్చామంటే అదే మనకున్న విజన్. 2047లో వందేళ్ల స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకోబోతున్నాం. కేంద్రంలో 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకెళ్తుండగా, మనం స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ తయారుచేశాం"

'విజన్' విశిష్టతలివీ...

- విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, నీతీఆయోగ్, ఇంకా ఇతర సంస్థల ప్రతినిధులు.. ఇలా మొత్తం 17 లక్షలమందిని భాగస్వాములను చేశారు.
- అవగాహన కోసం 4.50 లక్షల మంది పాఠశాల విద్యార్థులకు, 38 వేలమంది కళాశాల విద్యార్థులకు విజన్‌పై పోటీలు నిర్వహించారు.
- అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం మహా కసరత్తు చేసి తయారుచేసిన పత్రం ఇది
- జాబ్ ఫస్ట్ విధానంతో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ప్రైవేట్ పార్కులు, సెమీకండక్టర్, క్లీన్ ఎనర్జీ, డ్రోన్, డేటా సెంటర్, స్పోర్ట్స్, టూరిజం తదితర 20 పాలసీల సమాహారం..
- ఇప్పటికే రెండు విజన్ డాక్యుమెంట్లు రాష్ట్రం కోసం తయారయ్యాయి. అందులో ఒకటి విజన్-2020. మరొకటి విజన్-2047. ఈ రెండు డాక్యుమెంట్లూ ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకంలోనే సిద్ధం కావడం విశేషం.



ఆ రాళ్లలో సింగపూర్, దుబాయ్‌ను చూశా..

"రాష్ట్రంలో తలసరి ఆదాయం మూడు వేల డాలర్ల కంటే తక్కువగా ఉంది. 2047 నాటికి దానిని 42 వేల డాలర్లకు చేర్చడమే విజన్ డాక్యుమెంట్ లక్ష్యం. 'హైదరాబాద్ హైటెక్ సిటీ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా తాము రాళ్లు మాత్రమే చూశామని.. మీరు మాత్రం ఒక విజన్ చూశారని పవన్‌కల్యాణ్ ఎప్పుడూ అంటుంటారు' ఆ రోజు నేను అక్కడ ఒక సింగపూర్‌ను, దుబాయ్‌ను చూశాను. న్యూయార్క్ లాంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన చేసి ముందుకెళ్లాను. దాని ఫలితంగానే హైదరాబాద్ దేశంలోనే తలసరి ఆదాయం ఎక్కువగా సంపాదించే నగరాల్లో ఒకటిగా నిలిచింది. దీనికోసం 1997లో 14 టాస్క్‌ఫోర్స్‌లు వేశాం. ఈ క్రమంలోనే విజన్-2020ను 1999 జనవరి 26న రిపబ్లిక్ డే రోజున ఆవిష్కరించాం. దాని ఫలితాలను ఈ రోజు చూస్తున్నాం. ఇదే విధంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ కూడా సాకారమవుతుంది. విజన్ డాక్యుమెంట్ ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలంటూ పిలుపునిస్తే ఏకంగా 17 లక్షల మంది ఆన్‌లైన్‌లో తమ అభిప్రాయాలు తెలియజేశారు. 4.50 లక్షల మంది పాఠశాల విద్యార్థులు, 38 వేల మంది కళాశాల విద్యార్థులు విజన్‌పై నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ఆ విద్యార్థులతోపాటు పారిశ్రామికవేత్తలు, నీతీఆయోగ్, ఇంకా పలు సంస్థల సభ్యుల ఆలోచనలను క్రోడీకరించి విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేశాం"



తెలుగుజాతి సత్తాకు గుకేశ్ ప్రతీక

"1995లో తొలిసారి సీఎం అయిన సమయంలోనే సంస్కరణల అవసరాన్ని గుర్తించాను. అప్పట్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. దేశ భవిష్యత్తును మార్చేశక్తి పబ్లిక్ పాలసీకి ఉంటుంది. ఆనాడు ఐటీని ప్రోత్సహించడం ద్వారా నేడు అమెరికాతోపాటు అన్ని దేశాల్లో అత్యధిక తలసరి ఆదాయాన్ని తెలుగుబిడ్డలు సంపాదిస్తున్నారు. ఇండియన్స్ ఇప్పటికే గ్లోబల్ లీడర్స్ అయ్యారు. వారు గ్లోబల్ సిటిజన్స్ కూడా అయ్యే పరిస్థితికి వచ్చారు. 18 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ అతి చిన్న వయస్సులోనే ప్రపం చ చెస్ చాంపియన్ కావడం తెలుగుజాతి సత్తాకు ప్రతీక."

నదుల అనుసంధానంతో..

"టీడీపీ కృషి వల్ల నీళ్లు సమృద్ధిగా ఉండే పరిస్థితి వచ్చింది. ఈ ఏడాది భగవంతుడు కరుణించడంతో అన్ని రిజర్వాయర్లలో దాదాపు 750 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పట్టిసీమ తరహాలో నదుల అనుసంధానం వల్ల కరువు అనే మా టే తలెత్తదు. గోదావరి నుంచి పెన్నా వరకు నీళ్లు తీసుకెళ్లే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గోదావరి, వంశధార అనుసంధానంపైనా ఆలోచిస్తు న్నాం. అది జరిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి ఉండ దు. దక్షిణ దేశంలోనే మనం నంబర్‌వన్ రాష్ట్రంగా ఉంటాం. అందుకే నీటి భద్రతకు విజన్‌లో ప్రాధాన్యం కల్పిం చాం. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీళ్లు ఇవ్వాలని సంకల్పిం చాం. రైతును రాజు చేయాలనేది ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం. పంట ఉత్పత్తులకు విలువను జోడిస్తే రైతుకు మెరుగైన ఆదాయం వస్తుంది. అగ్రిటెక్ విధానాలతో రైతులకు న్యాయం చేయాలని ఆలోచిస్తున్నాం. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సంకల్పించాం. ఇందులో భాగంగా అన్ని వాహనాలను ఈవీ వాహనాలుగా తయారుచేయాలని చూస్తున్నాం. కరెంటు చార్జీల విషయంలో ఉత్తమ విధానాలను(ఆప్టిమైజేషన్) తీసుకురావాలని చూస్తున్నాం. గతేడాది రూ.5.19 ఉన్న ప్రొక్యూర్‌మెంట్ సగటు వ్యయాన్ని ఈ ఏడాది రూ.4.80లకు తగ్గించాం."

స్వర్ణాంధ్ర-2047లో భాగస్వాములు కండి...

"2047 నాటికి 2.4 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల రాష్ట్ర జాతీయ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. దీనివల్ల తలసరి ఆదాయం 42 వేల అమెరికన్ డాలర్లకు చేరుతుంది. విజన్ ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలి. ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలి. ఇప్పటి వరకు అందరం సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడాం. రేపటి నుంచి ఆంధ్రా వ్యాలీ ఓ సక్సెస్ స్టోరీ అవుతుంది. ఇచ్ఛాపురం నుంచి మంత్రాలయంవరకు ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేయాలనే సంకల్పంతో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే సుస్థిర ప్రభుత్వం ఉండాలి" అని చంద్రబాబు వివరించారు.

స్వచ్ఛాంధ్ర మన జీవితంలో భాగం కావాలి..

"వ్యవసాయం, పారిశ్రామికం, సేవారంగం, టెక్...ఇలా దేనికి సంబంధించిన ఉత్పత్తి అయినా ప్రపంచ మార్కెట్లో పోటీ పడేలా ముందుకెళ్తున్నాం. స్వచ్ఛాంధ్ర మన జీవితంలో భాగం కావాలి. స్వచ్ఛమైన ఆలోచనలూ ముఖ్యమే. ఆలోచనలు కలుషితమైతే వాతావరణం కూడా కలుషితమవుతుంది. టెక్నాలజీని ఉపయోగించుకుని పనిచేయగలిగితే మన ఉత్పాదకత పెరుగుతుంది. సంపద సృష్టి జరుగుతుంది. విజన్ డాక్యుమెంట్‌తో పాటు 20 కొత్త పాలసీలు తీసుకొచ్చాం. జాబ్ ఫస్ట్ విధానంతో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ప్రైవేట్ పార్క్, సెమీకండక్టర్, క్లీన్ ఎనర్జీ, డ్రోన్, డేటా సెంటర్, స్పోర్ట్స్, టూరిజం తదితర పాలసీలను తీసుకొచ్చాం"

అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యం...

"పర్యాటకానికి కొత్త ఊపు తీసుకువస్తున్నాం. రాబోయే రోజుల్లో కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనేది విజన్ డాక్యుమెంట్ లక్ష్యం. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు పెడుతున్నాం. వాటివల్ల ఐదులక్షల మందికి ఉపాధి లభిస్తుంది. అమరావతికి 33 వేల ఎకరాల భూమి ఇచ్చిన ఘనత రైతులదే. వారిపై కేసులను రద్దుచేసి రైతులను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంది. ఎక్కడైనా పరిశ్రమలొస్తే రైతులను కూడా భాగస్వాములను చేస్తాం."

సాగు.. కొత్త పుంతలు!

- రైతు కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్


అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు నూతన సాంకేతికతను జోడించి, సేంద్రియ పద్ధతులను అనుసరించి, అధిక దిగుబడులిచ్చే వైవిధ్యమైన పంటలను సాగు చేసి.. మార్కెట్ల అనుసంధానంతో రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే దిశగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించారు. రైతు కుటుంబాలకు ఉజ్వల భవిష్యత్ కోసం రూపొందించిన 2024-47 రోడ్ మ్యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న సాగు రంగానికి ఆధునిక సాంకేతికతను జోడించి, గ్లోబల్ అగ్రి హబ్‌గా నిలపడం దీని లక్ష్యం. ఆహార భద్రత, పర్యావరణ అనుకూలత, అధిక ఉత్పాదన, అధిక విలువ, మార్కెట్ అనుసంధానాలు, నాణ్యత పెంపుదలకు ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించడం.. రైతుకు రుణ పరపతిలో చట్ట ప్రకారం మద్దతివ్వడం.. భూసారాన్ని పరిరక్షించడం.. పంట ఉత్పత్తిలో స్థిరత్వం ఉండేలా పంట మార్పిడి ద్వారా తక్కువ ఇన్‌పుట్స్‌తో సాగు చేసే పద్ధతులపై అవగాహన పెంచడం.. ముఖ్యంగా ప్రకృతి సాగును ప్రోత్సహించడం.. డ్రోన్ ఆధారిత అప్లికేషన్లు, రోబోటిక్స్, శాటిలైట్ టెక్నాలజీ వినియోగం, రియల్ టైమ్‌లో పంటల స్థితిగతులను కచ్చితత్వంతో తెలుసుకోవడం, తెగుళ్లను గుర్తించి, పరిష్కార మార్గాలు సూచించే సాంకేతికతను వినియోగించడం.. సూక్ష్మనీటి వనరుల సద్వినియోగం ఈ విజన్ డాక్యుమెంట్‌లోని కీలక అంశాలు.

2024-47 రోడ్‌మ్యాప్..

- పంటల సాగుతో పాటు పశువుల పెంపకం.
- చిన్న రైతులు 100%, మధ్యస్థ రైతులు 40% ప్రకృతి వ్యవసాయం చేయడం. రైతు ఆదాయానికి తోడ్పడే అధిక దిగుబడినిచ్చే రకాల వినియోగం.
- పంటకోత, శుద్ధి యంత్ర సదుపాయాలు అందుబాటులోకి తేవడం.
- సాగుపై ఆసక్తి ఉన్న యువతకు నైపుణ్య శిక్షణ. అగ్రిటెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి నిర్దిష్ట విధానం.
- ఫస్ట్, సెకండ్, థర్డ్ లెవల్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు.
- ఫిష్ ఫార్మర్ పొడ్యూస్ ఆర్గనైజేషన్లకు ప్రోత్సాహం.
- మహిళా పాడి రైతులతో డెయిరీల ఏర్పాటు.
- సముద్రపు ఆహార ఉత్పత్తుల కోసం మెరైన్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్(ఎంఎస్‌సీ). రైతుకు సమగ్ర సాధనంగా ఉపయోగపడేలా సీఎంయాప్ మెరుగుదల
- పంట వ్యర్థాల నుంచి సంపద అవకాశాల అభివృద్ధి. సేంద్రియ ఎరువులుగా పశువుల విసర్జిత పదార్థాలు.
- ప్రతి జిల్లాలో ఓడరేవులు, ఫుడ్ పార్కులు, అగ్రి ఎక్స్‌పోర్ట్ జోన్‌ల అభివృద్ధి.



స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌పై సంతకం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం. మన రాష్ట్రంలో మరో రెండున్నర దశాబ్దాలు సుస్థిర ప్రభుత్వం ఉండాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కలలు గన్న వికసిత్ భారత్-2047లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి కావాలి. - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

చంద్రబాబు విజన్ అద్భుతం

దేవుడు వందేళ్ల ఆయుష్షు ఇవ్వాలి

- స్వర్ణాంధ్ర-2047 ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు ఆంధ్రా కోసం పాటుపడే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వందేళ్ల ఆయుష్షు ఇవ్వాలని భగవంతుడ్ని కోరుకుంటున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని, తనతో పాటు ఈ వేదికపై ఉన్న వారందరూ ఆయన వెంటే ఉంటామన్నారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను చంద్రబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. ఉపాధి అవకాశాలకు చంద్రబాబు ఆర్కిటెక్ట్ అని, ఆయన విజన్ అద్భుతమని ప్రశంసించారు. 'సీఎం చంద్రబాబు 1999లో విజన్-2020 అని చెప్పినప్పుడు అపహాస్యం చేసిన వ్యక్తులే సైబరాబాద్ ప్రాంతాల్లో స్థలాలు కొనుక్కొని ఈ రోజు ఆనందంగా ఉన్నారు. 2047 నాటికి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిందే ఈ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్. ఏ రంగం ఎలా ముందుకు వెళ్లాలి? ఏ రంగానికి భవిష్యత్తులో ప్రాధాన్యముంటుంది? ఆ రంగాల్లో మనం ఎలా ప్రగతి సాధించాలి? అన్న పూర్తి విజన్ మనకు ఉన్నప్పుడే భవిష్యత్తు అందంగా మారుతుంది. అలాంటి భవిష్యత్తును ముందుగానే ఊహించగల దార్శనికుడు చంద్రబాబు. రాబోయే కాలంలో యువతకు ఉద్యోగాలు ఉండాలి. 2047 నాటికి సాంకేతికతతో కూడిన వ్యవసాయం వస్తుంది. స్కిల్ డెవలప్‌మెంట్ పెరగాలి. నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ అందాలనే గొప్ప లక్ష్యాలతో ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకుని ఈ డాక్యుమెంట్ రూపొందించారు. దీన్ని సాకారం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరముంది. మనమంతా ఐకమత్యంగా కష్టపడితే భావితరాలకు గొప్ప భవిష్యత్తును అందించవచ్చు' అన్నారు.

నిర్మించడమే కష్టం

'రాష్ట్రంలోని కొన్ని గిరిజన గ్రామాల్లో సకాలంలో వైద్యసాయం అందక, డోలీల్లో రోగులను, బాలింతలను తీసుకొచ్చే పరిస్థితి ఉండటం బాధాకరం. రాష్ట్రంలో ఇలాంటి గ్రామాలు 2,854 ఉన్నాయని కలెక్టర్ల సదస్సులో అధికారులు చెప్పారు. అక్కడ రోడ్ల సదుపాయం, వైద్య సౌకర్యాల మెరుగుదలకు రూ.3 వేలకోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇంతటి కీలకమైన సమస్యను తీర్చడానికి ప్రభుత్వ ఖజానాలో తగినన్ని నిధులు లేవు. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు, జగనన్న సర్వే రాళ్ల పాతేందుకు రూ.1200 కోట్లు దుబారా చేసింది. గత ప్రభుత్వం ఇష్టానుసారం ఖర్చు చేసిన నిధులే కనుక ఈ రోజు మన దగ్గర ఉంటే కనీసం 1400 గిరిజన గ్రామాలకు సదుపాయాలు కల్పించేందుకు వీలుండేది. గిరిజన గ్రామాలకు మూడు దశల్లో రోడ్డు సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని సీఎం చెప్పడం ఆనందం కలిగించింది. ఏ వ్యవస్థను అయినా, నిర్మాణాన్ని అయినా నిర్మించడం చాలా కష్టం. కూల్చేయడం తేలిక. గత ప్రభుత్వం కూల్చివేతలతో పాలనను మొదలుపెట్టి పూర్తిగా కూలిపోయింది. కలెక్టర్ల సదస్సులో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా చెప్పినట్లు అధికారులు వారి బలం వారే తెలుసుకోవాలి. వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తి ప్రభుత్వ కార్యనిర్వాహక యంత్రాంగం దగ్గర ఉంది. దానిని తెలుసుకుని పనిచేస్తే మనమందరం కలలు కనే కొత్త ఆంధ్రప్రదేశ్ కచ్చితంగా సాధ్యమవుతుంది. ఒత్తిళ్లకు, భయాలకు అతీతంగా పని చేయండి. మీకు కచ్చితంగా ప్రభుత్వ మద్దతు ఉంటుంది. మీరు చేసే పని ప్రజలకు మేలు చేసేది అయితే దానిని ప్రోత్సహించే బాధ్యత మేం తీసుకుంటాం' అని పవన్ పేర్కొన్నారు.

రూల్ ఆఫ్ లా బలంగా ఉండాలి

'రూల్ ఆఫ్ లా అనేది బలంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుంది. అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రూల్ ఆఫ్ లా సమానంగా ఉండాలి. అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతలు బలంగా ఉండాలి. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటే పెట్టుబడిదారులు తరలివస్తారు. రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుంది. స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఒక్కరి జీవితంలో సంపద రావాలని, సుస్థిరత రావాలని, సమగ్రాభివృద్ధి చెందాలనేది మా సంకల్పం. ఇది మహా సంకల్పంగా మారాలి' అని పవన్ అన్నారు.

సీఎంపై పవన్ ప్రశంసలు

'ముఖ్యమంత్రి, నేను పరస్పరం ఎంతో గౌరవించుకుంటాం. ఆయన నాకు ఎంతో గౌరవం ఇస్తారు. ఏ విషయంలో కూడా నాకు చెప్పకుండా ముందుకు వెళ్లరు. ఆయన నాయకత్వ తీరును, ఓపికను దగ్గర నుంచి గమనిస్తూ ప్రతి అంశాన్ని నేర్చుకోవాలని భావిస్తున్నాను. 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు లాంటి గొప్ప నాయకుడు అవసరమని ఆనాడు ఏమీ ఆశించకుండా మద్దతు ఇచ్చాను. ఇప్పుడు ఆయన నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రజల ఆశలను నెరవేర్చేలా సీఎం, నేను పనిచేస్తాం. ఇది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని విభేదాలు పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. 21వ శతాబ్దంలో కూడా నా కులం, నా వర్గం అంటే కష్టం. సమస్యలు అందరికీ ఉంటాయి. వాటిని శాంతియుత పంథాలో పరిష్కరించుకుందాం. కులాలు, మతాలని కూర్చుంటే అభివృద్ధి సాగదు. వాటిని దాటి అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం' అని పవన్ అన్నారు.

100% అక్షరాస్యత

- నిరుద్యోగ రేటు తగ్గించాలి
- పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్య
- 'స్వర్ణాంధ్ర' డాక్యుమెంట్‌లో లక్ష్యాలు



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2047 నాటికి వందశాతం అక్షరాస్యత రేటు సాధించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో విద్య, ఉపాధిపై లక్ష్యాలు నిర్దేశించింది. అక్షరాస్యత రేటు ప్రస్తుతం 72 శాతం ఉండగా, 2029 నాటికి 90 శాతం దాటాలని, 2047 నాటికి వందశాతం చేరుకోవాలని పేర్కొంది. రాష్ట్రంలో 15-59 ఏళ్ల మధ్య వయసు వారిలో నిరుద్యోగులు ప్రస్తుతం 4.1 శాతం ఉన్నారని, 2029 నాటికి దానిని 3 శాతం కంటే తక్కువకు, 2047 నాటికి 2 శాతం లోపునకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి ప్రపంచంలోని టాప్-100 యూనివర్సిటీల్లో రాష్ట్రం నుంచి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉండాలని పేర్కొంది. ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు శాతం ప్రస్తుతం 64.5 శాతం ఉండగా, 2029 నాటికి 100 శాతానికి చేరుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉద్యోగాల కల్పనకు పాఠశాల విద్య నుంచే పునాదులు పడాలని, అందులో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచే విద్యలో నాణ్యత పెరగాలని, అది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొంది. ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించి అంగన్‌వాడీలను ప్రాథమిక విద్యకు అనుసంధానం చేయనుంది.

6వ తరగతి నుంచే వృత్తి విద్య

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల్లో భాగంగా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యను అందుబాటులోకి తీసుకురానున్నారు. 6 నుంచి 8 తరగతులకు ఒకేషనల్ బోధన ప్రారంభిస్తారు. ఇందులో క్షేత్రస్థాయి సందర్శన, కార్యాచరణ ఆధారిత అభ్యాసం, ఇతర ప్రాక్టికల్స్ ఉంటాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు ఒకటి లేదా రెండు రకాల నైపుణ్యాలు కచ్చితంగా ఉండేలా ప్రణాళిక రూపొందిస్తారు. 1 లేదా 2 రకాల స్కిల్ కోర్సులను ఎంపిక చేసుకునే ఆప్షన్ ఇస్తారు. పాఠశాలలను సమీపంలోని స్కిల్ సెంటర్లు, ఐటీఐలు, ఉన్నత విద్యా సంస్థలకు అనుసంధానం చేస్తారు. సాధారణ విద్యతో పాటు సమీపంలోని స్కిల్ సెంటర్ల ద్వారా ప్రత్యేక సెషన్లు ఉండేలా చూస్తారు. 11, 12 తరగతుల్లో 50 శాతం వరకు స్పెషలైజేషన్ కరిక్యులమ్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారు. నైపుణ్య గణన ఆధారంగా స్థానిక అవసరాలకు తగ్గట్టుగా ఉన్నత విద్య కోర్సులు రూపొందిస్తారు. పరిశ్రమలతో అనుసంధానించేలా ఉపాధి కల్పన కోర్సులు ప్రారంభిస్తారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదం

- ఏపీ చాంబర్స్

సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. 'ఈ విజన్ డాక్యుమెంటు ద్వారా రాష్ట్రం రెండు దశాబ్దాల్లో రెండు అంకెల వృద్ధిని నమోదు చేస్తుంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాలలో ఒకటిగా అవతరిస్తుంది. నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా ఉత్పత్తి పరిపూర్ణత సాధిస్తుంది. ప్రపంచ మార్కెట్‌లో ఏపీ అగ్రభాగస్వామిగా ఎదగడానికి దోహదపడుతుంది' అని పొట్లూరి ఆశాభావం వ్యక్తం చేశారు.


పీ-4 విధానంతో పేదరిక నిర్మూలన

- సమ్మిళిత వృద్ధి, అందరికీ వనరులను అందుబాటులోకి తేవడం ద్వారా పేదరిక నిర్మూలన
- పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టిసిపేషన్ (పీ4)తో అత్యుత్తమ రాజధానితో పాటు అందరికీ సమానస్థాయిలో జీవన ప్రమాణాల కల్పన
- అత్యధిక ఆదాయం గల తొలి 10 శాతం ప్రజలు అట్టడుగున ఉన్న 20 శాతం ప్రజలకు ఆర్థికంగా చేయూతనివ్వాలి. ఇళ్ల నిర్మాణం, ఇతర అత్యవసర సౌకర్యాలు కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలన
- అందుబాటు ధరల్లో వైద్యం, ఆరోగ్య పరిరక్షణ
- సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్య శిక్షణ
- ప్రతి కుటుంబానికి 24 గంటల విద్యుత్, వంట గ్యాస్, బీమా సదుపాయం, మరుగుదొడ్డు, డ్రైనేజ్ సౌకర్యాలు

వ్యర్థాల ద్వారా సంపద సృష్టి



- ప్రజలందరికీ నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యం
- ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో సంపద సృష్టించే విధానాలు అందుబాటులోకి
- ప్రపంచస్థాయిలో నివాసానికి అత్యంత అనువుగా ఉన్న నగరాల జాబితాలో ఏపీ నుంచి రెండు నగరాలు ఉండేలా చర్యలు
- పర్యావరణానికి హాని కలిగించని ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణం



ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్

- అన్ని రంగాల్లో పరిపూర్ణమైన ఉత్పత్తులు సాధించడమే లక్ష్యం
- వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు తదితర రంగాల్లో ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాల నిర్వహణకు ప్రోత్సాహకం. రాష్ట్రంలోని ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్
- ఇంక్యుబేషన్ పార్కులు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లు రాష్ట్రంలో పర్యావరణ వ్యవస్థను, సాంకేతికంగా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టడానికి దోహదం చేస్తాయి
- డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్య, శిక్షణ
- ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు, డిజిటల్ ఎక్స్‌పోలు, భారీస్థాయి ఈవెంట్లలో మెరుగైన భాగస్వామ్యం ద్వారా డిస్కవర్ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. తద్వారా గ్లోబల్ బ్రాండ్‌తో ఉత్పత్తులు, సేవలు, ఆవిష్కరణలు ప్రపంచస్థాయిలో ప్రదర్శితమై పెట్టుబడులు, భాగస్వామ్యాల ఆకర్షణ
- పర్యాటక అనుభవాలు, సాంస్కృతిక, ఆర్థిక మార్పిడికి ఇంటిగ్రేటెడ్ నేషనల్, ట్రాన్స్‌నేషనల్ సర్క్యూట్లు ఆవిర్భవిస్తాయి
- ఇంతవరకు అన్వేషించని ప్రాంతాలను గుర్తించడం ద్వారా నీలి సముద్ర ఆర్థిక వ్యవస్థ (బ్లూ ఓషన్ ఎకానమీ)లో ఆంధ్రప్రదేశ్ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటుంది.

వైసీపీ రైతు పోరుబాట తుస్సు

- జగన్ పిలుపునకు స్పందన కరువు
- నిరసనలో ఎక్కడా కానరాని రైతులు, ప్రజలు
- పార్టీ కార్యక్రమానికి ముఖ్యనేతల గైర్హాజరు
- అక్కడక్కడా రోడ్డెక్కిన వైసీపీ కార్యకర్తలు
- విజయవంతం అంటూ ఎక్స్‌లో జగన్ పోస్టు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు పోరుబాట పేరిట వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రజలు, రైతుల నుంచి స్పందన కరువైంది. దీంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం తుస్సుమంది. స్వయంగా ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చినా.. ఆ పార్టీ సీనియర్ నేతలు పట్టించుకోలేదు. పలు జిల్లాల్లో మాజీ మంత్రులు, ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. అక్కడక్కడ కొంతమంది నేతలు, కార్యకర్తలు రోడ్డెక్కి మమ అనిపించారు. నిరసన కార్యక్రమం జరిగిన చోట రైతులు తక్కువ, పార్టీ కార్యకర్తలు ఎక్కువ అన్నట్లు తయారైంది. ఈ కార్యక్రమం దారుణంగా విఫలమవడం చూస్తే వైసీపీ ఎంత బలహీనపడిందో అర్థమవుతోందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దీని ప్రభావం పార్టీపై తీవ్రంగా పడిందని ఆ వర్గాలు చెబుతున్నాయి.

ముందే బైబై చెప్పిన నేతలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దికాలానికే జగన్ ఆందోళనలకు, నిరసనలకు పిలుపునివ్వడం సరికాదంటూ మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైసీపీకి తాజాగా గుడ్‌బై చెప్పారు. జగన్‌కు ఓ విధానంలేదంటూ విమర్శించిన వారు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విముఖత చూపారు. అందుకే ఒక రోజు ముందే ఆ ఇద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా ఇచ్చేశారు. అంతకుముందే పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ పరిస్థితుల్లో రైతు పోరుబాటకు మరింత మంది సీనియర్ నేతలు దూరంగా ఉండటం ఆ పార్టీ వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రత్యక్షంగా పాల్గొనని జగన్

సాధారణంగా ప్రజాందోళనకు రాజకీయపార్టీ పిలుపు ఇచ్చినప్పుడు ఆ పార్టీ అధ్యక్షుడు ముందుండి కార్యక్రమాలను నడిపిస్తాడు. కానీ ఈ పోరుబాటలో మాత్రం జగన్ ఎక్కడా ప్రత్యక్షంగా పాల్గొనలేదు. అయితే సోషల్ మీడియాలో ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వంపై రైతుల తొలి పోరాటం విజయవంతమైందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోపక్క వైసీపీ నేతలు కూడా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాల్లో ఓ ముగ్గురు, నలుగురు నాయకులు మినహా మిగిలిన వారంతా నిరసన కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. ఈ పోరుబాటలో రైతులు లేకపోయినా అనంతపురం, నెల్లూరు, ఒంగోలులో మాత్రం ఓ మోస్తరుగా వైసీపీ కార్యకర్తలు కనిపించారు. మాజీ మంత్రులు పినిపె విశ్వరూప్, అంబటి రాంబాబు, ధర్మాన కృష్ణదాస్, గుడివాడ అమర్నాథ్, ఉషశ్రీ చరణ్, కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా వారి జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే కడప జిల్లాలో మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి, చిత్తూరు జిల్లాలో మాజీ ఎంపీ రెడ్డప్ప రైతు పోరు బాటలో నిరసన తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నాం: బొత్స

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి నేతలు అపహాస్యం చేస్తున్నారని, అందుకే ఎన్నికలను తమ పార్టీ బహిష్కరిస్తోందని వైసీపీ సీనియర్ నాయకుడు, శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న తమ అభ్యర్థులకు వీఆర్‌ఓలు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. నీటిసంఘాల ఎన్నికల్లో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని బొత్స ప్రశ్నించారు. వీటన్నింటి కారణంగా ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు. 'రైతన్నలకు అండగా' పేరుతో శుక్రవారం వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని ఆయన తెలిపారు. కాగా, సినీ నటులు అల్లు అర్జున్, మోహన్‌బాబుల విషయాల్లో ప్రభుత్వాలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా సంయమనం పాటించాలని వ్యాఖ్యానించారు. గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాట జరిగి 20 మంది మృతిచెందారని, ఆ ఘటనకు ఎవరిని బాధ్యులు చేశారనేది పరిశీలించాలని కోరారు.

రేషన్ బియ్యానికి రెక్కలు!



విశాఖ పోర్టు సీఎఫ్ఎస్ వద్ద అధికారుల తనిఖీలు

- విశాఖ పోర్టు నుంచి ఆగని అక్రమ రవాణా
- 20 కంటెయినర్లతో చైనాకు బయల్దేరిన నౌక
- పోర్టు సీఎఫ్ఎస్ వద్దే అధికారుల తనిఖీలు
- పట్టుబడిన సరుకు సీజ్ చేయకుండా వెనక్కి
- ఇతర సీఎఫ్ఎస్‌ల నుంచి తరలుతున్న బియ్యం

విశాఖపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదలకు రాయితీ ధరపై ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై కొద్ది రోజులుగా పెద్దఎత్తున విచారణ జరుగుతున్నా వ్యాపారులు పట్టించుకోకుండా ఎగుమతులు చేస్తూనే ఉన్నారు. విశాఖపట్నం పోర్టు నుంచి ఎగుమతికి సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని కొద్దిరోజుల క్రితం పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టుకున్న సంగతి తెలిసిందే. కాకినాడ నుంచే కాకుండా విశాఖ పోర్టు నుంచి కూడా రేషన్ బియ్యం ఎగుమతి అవుతున్న విషయం అప్పుడే బయటపడింది. దాంతో అధికారులను అప్రమత్తం చేశారు. రేషన్ బియ్యం ఎట్టి పరిస్థితుల్లో పోర్టు నుంచి ఎగుమతి కావడానికి వీల్లేదని మంత్రి ఆదేశించారు. దాంతో ఆ శాఖకు చెందిన అధికారులు పోర్టు ఏరియాలోని కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్ఎస్) వద్ద రోజూ నిఘా పెడుతున్నారు. బియ్యం లోడుతో వచ్చే లారీలను పరిశీలిస్తున్నారు. రేషన్ బియ్యం ఉంటే సీజ్ చేయకుండా వెనక్కి తిప్పి పంపిస్తున్నారు. ఈ విధంగా గత మూడు రోజులుగా కొన్ని లారీలను వెనక్కి పంపేశారు. అయితే వ్యాపారులు ఆ లారీలను విశాఖలోనే వేరే సీఎఫ్ఎస్‌లకు పంపించి, వాటి ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బెబో ఇంటర్నేషనల్ సంస్థ ఇదేవిధంగా సుమారుగా 530 టన్నుల బియ్యాన్ని (10,600 బ్యాగులు) 20 కంటెయినర్లలో వ్యాన్ హాయ్ 367-14 నౌక ద్వారా గురువారం చైనాకు పంపింది. పౌర సరఫరాల శాఖ అధికారులు విశాఖలోని అన్ని సీఎఫ్ఎస్‌ల వద్ద నిఘా పెట్టకుండా కేవలం విశాఖ పోర్టుకు చెందిన సీఎఫ్ఎస్ వద్దే ఉండటంతో వ్యాపారుల పని సులభమవుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉందని పోర్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

స్టెల్లా నౌక.. ఎటూ కదలక!

- ముదురుతున్న 'సీజ్ ద షిప్' వ్యవహారం
- కాకినాడ పోర్టుకు బియ్యం లోడింగ్‌కు వచ్చి నెలపైనే..
- తాజాగా అడ్మిరాలిటీ కోర్టును ఆశ్రయించిన ఎగుమతిదారులు



కాకినాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'సీజ్ ద షిప్' ఆదేశాలతో కాకినాడ పోర్టులో నిలిచిపోయిన స్టెల్లా నౌక వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. గత నెల 29న పారాబాయిల్డ్ బియ్యం లోడుతో ఎగుమతికి సిద్ధంగా ఉన్న స్టెల్లా నౌకను.. రేషన్ బియ్యం ఎగుమతి అవుతోందనే అనుమానంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అడ్డుకున్న విషయం తెలిసిందే!. ఆ తర్వాత షిప్‌లో తనిఖీలు చేపట్టి.. రేషన్ బియ్యమా కాదా? అని తేల్చాల్సి ఉన్నా.. ల్యాబ్ నివేదిక రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నౌక నిర్ణీత సమయానికి బయలుదేరకపోవడంతో రోజుకు రూ.22వేల డాలర్ల డెమరేజీ చార్జీల భారం మోయాల్సి వస్తోందని ఎగుమతిదారులు తాజాగా శుక్రవారం అడ్మిరాలిటీ కోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి మొత్తం 28మంది ఎగుమతిదారులు కలిపి నౌకను అద్దెకు తీసుకోగా, వీరిలో 15మంది తమ బియ్యం లోడింగ్ పూర్తిచేశారు. మరికొందరు లోడ్ చేయాల్సి ఉంది. కానీ అధికారులు స్టెల్లా షిప్‌లోకి బియ్యం లోడింగ్ అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో వ్యాపారపరంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొంటూ కాకినాడకు చెందిన చిత్రా అగ్రి ఎక్స్‌పోర్టు, సూర్యశ్రీ రైస్‌మిల్, పద్మశ్రీ రైస్ మిల్లు ప్రతినిధులు అమరావతిలోని అడ్మిరాలిటీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తాము పశ్చిమ ఆఫ్రికా దేశానికి పారాబాయిల్డ్ రైస్ ఎగుమతి చేయడానికి నౌకను అద్దెకు తీసుకున్నామని, కానీ నౌకలోకి బియ్యం లోడింగ్‌కు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఇలా అడ్డుకోవడం ఫారెన్ ట్రేడ్ పాలసీకి విరుద్ధమని, ఈ చట్టం ప్రకారం బియ్యం ఎగుమతి ఆపడానికి లేదని పేర్కొన్నారు. పైగా నౌకలోకి బియ్యం లోడింగ్ ఆపాలని కలెక్టర్, పోర్టు అధికారులు ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలూ ఇవ్వలేదని, కేవలం నోటి మాటతో ఆదేశాలు ఇచ్చారని వివరించారు. ఈ నేపథ్యంలో డెమరేజీ చార్జీల భారంతో తీవ్రంగా నష్టపోతున్నామని, తమ మూడు కంపెనీలకు చెందిన 3,470 మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ రైస్ ఎగుమతి జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును శుక్రవారం అభ్యర్థించారు. ఎవరైతే నౌకలోకి ఇప్పటికే తమ వాటా బియ్యం లోడ్ చేశారో వారు మినహా మిగిలిన వారు రోజుకు 22వేల డాలర్ల డెమరేజీ చార్జీల భారం మోయాల్సి ఉంటుందని తెలిపారు.

పోలీసులపై దొంగనోట్ల ముఠా ఎటాక్

- రెండు కార్లలో 80 కిలోమీటర్ల చేజింగ్
- పోలీసు వాహనం అడ్డగింత.. దాడి
- వాహనంలోని నిందితుడిని ఎత్తుకుపోయిన వైనం
- రాజమహేంద్రవరంలో సినీ ఫక్కీలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం/సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ముందు పోలీస్ వాహనం. వెనుక రెండు కార్లలో దొంగ నోట్ల ముఠా చేజింగ్. అనుకూలమైన టైం కోసం వెయిటింగ్. 80 కిలో మీటర్లు దాటాక ఒక్కసారిగా ముందుకు వచ్చి పోలీస్ వాహనం అడ్డగింత. పోలీసులపై ఎటాక్ చేసి వారి వాహనంలో ఉన్న తమ సభ్యుడిని ఎత్తుకుపోయిన ముఠా.. ఇదేదో సినిమాలో సీన్ కాదు. రియల్‌గా రాజమహేంద్రవరంలో జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం పోలీసులు తమ పరిధిలోని ఓ దొంగనోట్ల కేసులో ప్రధాన నిందితుడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో గురువారం రాత్రి భీమవరానికి వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ నిందితుడితో పాటు తమ వాహనంలో శ్రీకాకుళానికి బయలుదేరారు. రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి వీఎల్‌పురం సెంటర్‌కు వచ్చాక రెండు కార్లలో వెంబడించి వచ్చిన దొంగ నోట్ల ముఠా సభ్యులు పోలీసు వాహనాన్ని అడ్డగించారు. పోలీసులపై దాడి చేసి నిందితుడ్ని విడిపించి వారి వాహనాల్లో తీసుకెళ్లిపోయారు. వెంటనే ఆ పోలీసులు 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో బొమ్మూరు, ప్రకాశ్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

స్థానికంగా సంచలనం..

అర్ధరాత్రి దొంగనోట్ల ముఠా పోలీసులపై దాడి చేసి వారి అదుపులో నిందితుడ్ని విడిపించుకుపోవడం స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తించింది. ఘటనపై తొమ్మిది సెక్షన్ల కింద ప్రకాశ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం పోలీసుల వాహనం వెనుక వచ్చిన కార్ల వివరాల కోసం సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ముఠాలో ఒకరిని రక్షించడం కోసం ఆ సభ్యులు ఇంత సాహసం చేశారంటే అదుపులోకి తీసుకున్న వ్యక్తే ఆ ముఠా డాన్ అయ్యి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల నుంచి టమాటా కొనుగోళ్లు

- కిలో రూ.8 చొప్పున విక్రయించాలని మంత్రి అచ్చెన్న ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు, పత్తికొండ యార్డుల్లో టమాటా ధరలు పడిపోయినందున మార్కెటింగ్‌శాఖ కిలో రూ.8చొప్పున కొనుగోలు చేసి, అదే ధరకు మార్కెట్లలో విక్రయించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. టమాటా ధర కిలో రూపాయికి పడిపోయిందనే కథనాలపై శుక్రవారం మంత్రి స్పందించారు. ఇతర రాష్ట్రాల నుంచి టమాటా దిగుమతి కావడం, వర్షాధార పంట నాణ్యత లేక, ధర తగ్గడం వల్ల సాధారణ మార్కెట్‌పై ప్రభావం పడిందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈనేపథ్యంలో రైతులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా, లాభనష్టాలు లేకుండా, కొనుగోలు చేసిన ధరకే విక్రయించాలని మార్కెటింగ్ అధికారులకు మంత్రి సూచించారు.

కల్తీ నెయ్యిని ఎప్పుడు గుర్తించారు?



- తిరస్కరించిన ట్యాంకర్ల నుంచి శాంపిల్స్ తీసుకుంది ఎప్పుడు?
- ఏ తేదీల్లో ల్యాబ్‌కు పంపారు?
- తిరుపతిలో సిట్ బృందం ఆరా
- టీటీడీ ఈవో, సీవీఎస్‌వోతో భేటీ
- కీలక ఫైళ్లు, రికార్డుల పరిశీలన..
- మరో 2-3 రోజులు ఇక్కడే!

తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణలపై విచారణకు సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక సభ్యులు తిరుపతిలో మకాం వేశారు. టీటీడీ ఈవో శ్యామలరావును కలిసి ముఖ్యమైన ఫైళ్లను పరిశీలించారు. మరో రెండ్రోజులు తిరుపతిలోనే ఉండి దర్యాప్తును వేగవంతం చేస్తారని సమాచారం. గత నెల 22వ తేదీన సిట్ బృందానికి సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 34 మంది అధికారులు, ఉద్యోగులు తిరుపతి చేరుకుని కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అవసరమైన ప్రదేశాలు సందర్శించి సమాచారాన్ని, రికార్డులను సేకరించారు. తాజాగా సిట్‌కు నాయకత్వం వహిస్తున్న సీబీఐ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ ఎస్.వీరేశ్ ప్రభు, సీబీఐ విశాఖ రేంజ్ ఎస్పీ మురళీ రాంబా, గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, జాతీయ ఆహార కల్తీ నిరోధక విభాగం (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధికారి సత్యకుమార్ పాండా గురువారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన సిట్ కార్యాలయానికి వెళ్లి కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఇప్పటి దాకా చేసిన దర్యాప్తు వివరాలను తెలుసుకున్నారు. వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు నివేదించారు. మధ్యాహ్నం 1.05 గంటలకు టీటీడీ పరిపాలనా భవనం చేరుకుని టీటీడీ ఈవో శ్యామలరావు, సీవీఎస్‌వో శ్రీధర్ తదితరులతో సమావేశమయ్యారు. 45 నిమిషాలు జరిగిన భేటీలో అవసరమైన సమాచారాన్ని సేకరించడంతో పాటు అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు ప్రయత్నించారు. గుజరాత్ ల్యాబ్, చెన్నైలోని ఎస్ఎంఎస్ ల్యాబ్‌లు నెయ్యి నాణ్యతపై జారీ చేసిన రిపోర్టు ప్రతులను తీసుకున్నారు. నెయ్యి కల్తీ జరిగిందని ఎప్పుడు గుర్తించారు.. ప్రస్తుత ఈవో గుర్తించారా? లేక గతంలో పనిచేసిన అధికారులు గుర్తించారా? ఏ ఆధారాలతో గుర్తించారు? మైసూరులో కేంద్ర ప్రభుత్వ రీసెర్చ్ ల్యాబ్ ఉండగా గుజరాత్ ల్యాబ్‌కు ఎందుకు పంపించారు? ఏఆర్ డెయిరీ పంపిన ట్యాంకర్లలో నాలుగింటిని దేని ఆధారంగా తిరస్కరించారు? మరో నాలుగింటిని ఎలా అనుమతించారు? తిరస్కరించిన ట్యాంకర్ల నుంచి నెయ్యి శాంపిల్స్ సేకరించి భద్రపరిచారా? శాంపిల్స్ సేకరించింది ఏయే తేదీల్లో? తిరుమలలో టీటీడీ ల్యాబ్ టెక్నీషియన్లు దేవస్థానం ఉద్యోగులా.. లేక బయటివారా? తిరుమల ల్యాబ్‌లో నెయ్యి నాణ్యత నిర్ధారించేందుకు తగిన పరికరాలు లేవని, టెక్నీషియన్లకు కూడా తగిన సాంకేతిక అర్హతలు లేవన్నది నిజమేనా? భారీ పరిమాణంలో నెయ్యి కొనుగోలు చేసేటప్పుడు ల్యాబ్‌లో తగిన పరికరాలు, అర్హత కలిగిన సిబ్బందిని ఎందుకు నియమించుకోలేదు? ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల నుంచి ఎప్పుడెప్పుడు నెయ్యి ట్యాంకర్లు టీటీడీకి సరఫరా అయ్యాయి.. వంటి ప్రశ్నలు సంధించి సమాచారం తీసుకున్నారు. అలాగే అవసరమైన ఫైళ్లు, రికార్డులు కూడా సేకరించారు. అనంతరం పద్మావతి అతిథి గృహానికి చేరుకుని సదరు సమాచారాన్ని క్రోడీకరించుకునే పనిలో నిమగ్నమయ్యారు. సిట్ బృందం 2-3 రోజులు తిరుపతిలోనే ఉంటుంది. అవసరమని భావిస్తే టీటీడీ గోదాములు, మార్కెటింగ్ కార్యాలయం, తిరుమలలో ల్యాబ్, పోటులతోపాటు ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, చెన్నైలోని ఎస్ఎంఎస్ ల్యాబ్‌లను సందర్శించే అవకాశముంది. కాగా సిట్‌లో నియమించిన విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి శుక్రవారం రాలేదు.

రేపు మరో అల్పపీడనం

ఎల్లుండి నుంచి దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు



- 2 వారాల వ్యవధిలో రెండోసారి ముప్పు
- ఈసారి గుంటూరు వరకూ విస్తరించే చాన్స్
- ఉత్తర కోస్తా ఏజెన్సీలో పెరిగిన చలి తీవ్రత

విశాఖపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలను వర్షాలు వణికిస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో పలు జిల్లాలను రెండు వారాల వ్యవధిలోనే రెండుసార్లు వానలు ముంచెత్తాయి. ఈ నెల 11, 12 తేదీల్లో కురిసిన వర్షాల నుంచి తేరుకోకముందే 16 నుంచి అల్పపీడనం ప్రభావంతో మరోసారి వర్షాలు కురవనున్నాయి. ఈసారి కోస్తాలోని మధ్య ప్రాంతాల వరకూ వర్షాలు విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉన్న అల్పపీడనం శనివారం నాటికి బలహీనపడనుండగా, ఆదివారం మరొకటి ఏర్పడనుంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఇప్పటికే రెండు తుపాన్‌లు రాగా, మూడు రోజుల క్రితం ఒక అల్పపీడనం వచ్చింది. ఈ నెల 15న మరొకటి రానుంది. ప్రస్తుతం ఉత్తర హిందూ మహాసముద్రం పరిధిలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రత్యేకించి బంగాళాఖాతంలో అల్పపీడనాలు/తుఫాన్‌లకు అనువుగా ఉపరితల ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు విశ్లేషించారు. సముద్రం మీదుగా వచ్చే తూర్పుగాలులతో తమిళనాడు, దానికి ఆనుకుని రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో తమిళనాడులో కొన్నిచోట్ల 50 సెం.మీ. భారీ వర్షపాతం నమోదవగా, ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనంతో శుక్రవారం తమిళనాడులోని ఒక ప్రాంతంలో 54 సెం.మీ. వర్షపాతం నమోదైందని, అనేకచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురిశాయని వివరించారు.

నేడు బలహీనపడనున్న అల్పపీడనం

గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లో ఉన్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడి శుక్రవారం నాటికి లక్షద్వీప్ పరిసరాల్లో కొనసాగుతోంది. ఇది శనివారం నాటికి పూర్తిగా బలహీనపడనుంది. అయితే శనివారం నాటికి దక్షిణ అండమాన్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఆవరించనున్నది. దీని ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడనుంది. తరువాత ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 17 కల్లా తమిళనాడు తీరం దిశగా రానుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఈ అల్పపీడనం మధ్య/ ఉత్తర తమిళనాడు వైపు వస్తుందని కొన్ని మోడళ్లు చెబుతున్నాయి. దీని ప్రభావంతో ఈ నెల 16 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయి. 17 నుంచి 19 వరకూ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు పడనున్నాయి. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాలో గుంటూరు జిల్లా వరకు వర్షాలు విస్తరిస్తాయని కొన్ని మోడళ్లు చెబుతుండగా, ఉత్తర కోస్తాలోనూ అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని మరికొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి. కాగా, శుక్రవారం ఉత్తర కోస్తాలోని ఏజెన్సీ, శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది.

పొగమంచుతో ఆలస్యంగా విమానాలు

పొగమంచు కారణంగా శుక్రవారం ఉదయం విశాఖపట్నం రావాల్సిన పలు విమానాలు ఆలస్యంగా చేరుకున్నాయి. హైదరాబాద్-విశాఖపట్నం-హైదరాబాద్ ఇండిగో విమానం 2 గంటలు, బెంగళూరు-విశాఖ-బెంగళూరు ఇండిగో విమానం 1.40 గంటలు, చెన్నై-విశాఖ-చెన్నై ఇండిగో విమానం 1.15 గంటలు, బెంగళూరు-విశాఖ-విజయవాడ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం 1.15 గంటలు ఆలస్యంగా ఇక్కడికి వచ్చాయని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ సోదాలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల దుకాణాలు, గోదాముల్లో శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక సోదాలు జరిపారు. అధిక ధరలతోపాటు, లైసెన్సు లేకుండా ఎరువులు విక్రయించడం, తక్కువ తూకం వంటి లోపాలను గుర్తించాయి. రైతులను ఇబ్బందిపెడితే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డైరెక్టర్ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు.

5 టన్నుల ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి నుంచి అక్రమంగా తరలించిన ఎర్రచందనం దుంగలను.. యాంటీ రెడ్‌శాండిల్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలోని బృందం గుజరాత్‌లోని పటాన్‌లో స్వాధీనం చేసుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో రూ.5కోట్ల విలువ, 5టన్నుల బరువున్న 155 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విజయవాడ పశుసంవర్ధకశాఖ డివిజన్ ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కొత్తగా పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంకిపాడు కేంద్రంగా ఉన్న పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను గన్నవరానికి మార్చింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, నందిగామ, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, గన్నవరం, గుడ్లవల్లేరులో డివిజన్లు ఏర్పాటయ్యాయి.

ఆ బడిలో ఒకే ఒక్కడు!

- మరో పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు
- విశాఖ జిల్లాలోని ఏకోపాధ్యాయ బడుల దుస్థితి



మరుబాయి పాఠశాలలో నలుగురు విద్యార్థులు



మరడ దాసరిపేట పాఠశాలలో ఒకే విద్యార్థి

పెదగంట్యాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదో ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థులు ఎంతమంది అనుకుంటున్నారా?.. ఒకే ఒక్కడు!! మరో పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులే!. ఇదీ విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలం మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని పరిస్థితి. మరడ దాసరిపేట పాఠశాలలో అన్ని వసతులూ ఉన్నాయి. అయితే ఇక్కడ నాలుగో తరగతి చదువుతున్న ఒకే ఒక విద్యార్థి ఉన్నాడు. అలాగే మురుబాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇంకో చిన్నారిని వారం రోజులుగా అనధికారికంగా పాఠశాలకు వస్తోంది. ఆ చిన్నారితో కలుపుకొన్నా ఇక్కడ చదివేది నలుగురే!. ఈ రెండూ ఏకోపాధ్యాయ పాఠశాలలు. ఒకవేళ ఉపాధ్యాయులు రాకుంటే పాఠశాలకు సెలవే. దీంతో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు.

ఆసక్తి చూపని తల్లిదండ్రులు!

వాస్తవానికి మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లో 30 మందికి పైగా చిన్నారులు ఉంటారు. వీరిని స్థానికంగా ఉన్న పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో ప్రయత్నించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకుగాను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేస్తామని పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు.

కిరాయికి దిగి కిరాతకానికి ఒడిగట్టారు

- నేలకొండపల్లి దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ

ఖమ్మం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన దంపతులను వారింట్లో కిరాయికి ఉంటున్న వ్యక్తులే చంపేశారు. దంపతులు డబ్బున్నవారని తెలిసి.. పథకం ప్రకారం అద్దెకు దిగి.. ఇంట్లోకి చొరబడి ప్రాణాలు తీసి, దొరికినంత దోచుకొని ఉడాయించారు! ఈ మేరకు నేలకొండపల్లిలో 17 రోజుల క్రితం జరిగిన దంపతులు యర్రా వెంకటరమణ (62), కృష్ణకుమారి (60) దంపతుల హత్య వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆ వివరాలు.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరుకు చెందిన షేక్ అబిద్ అలియాస్ అబిద్ అలీ, సోహైల్, ఆరిఫ్ అనే వ్యక్తి బై సెక్సువల్! 2011లో కంచికచర్లలో జరిగిన ఓ హత్య కేసులో 2014లో జీవితఖైదు శిక్ష పడింది. అప్పటి నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు ఈ ఏడాది పెరోల్ మీద బయటకొచ్చాడు. గడువు ముగిసినా జైలుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోదాడకు వెళ్లి పేరు మార్చుకున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ అబిద్.. నేలకొండపల్లిలోని బియ్యం వ్యాపారం చేసే యర్రా వెంకటరమణ గురించి తెలుసుకున్నాడు. ఆయన డబ్బులు బాగా సంపాదించాడని, ఇంట్లో ఆయన, భార్య కృష్ణకుమారి మాత్రమే ఉంటారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో పలు పోర్షన్లు కిరాయికిస్తారని తెలుసుకున్న అబిద్.. నవంబరు రెండో వారంలో ఆ ఇంట్లో అద్దెకు దిగాడు. అదును చూసి.. తన స్నేహితులతో కలిసి ఓనర్‌ఇంట్లోకి చొరబడ్డాడు. కృష్ణకుమారి, వెంకటరమణలను హత్యచేసి..వారి శరీరంపై ఉన్న, ఇంట్లోని బంగారం,డబ్బుతో పారిపోయాడని పోలీసులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.